సాహితీ గత వారం పుస్తకాల పైన్నే
ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ



epaper.vaartha.com WWW.VAARTHA.COM

తెలుగు జాతీయ దినపత్రిక

# వార్త

కడప

fb.com/vaartha Digital

Published from Kadapa, Vijayawada, Hyderabad, Visakhapatnam, Rajahmundry, Guntur, Nizamabad, Ongole, Warangal, Tirupathi, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam

6-11-2025 గురువారం సంపుటి: 31 సంచిక: 275 పేజీలు: 10+4 వెల: 6.50



కపిల్ చిట్స్‌తో బంధం ఆనందాల అనుబంధం
KAPIL GROUP
కపిల్ చిట్స్
Visit Us: www.kapilchits.com
కపిల్ చిట్స్ మీ కలలకు సాకారం


# ఎపిలో గ్రీన్ హైడ్రోజన్ హబ్

## పర్యావరణ పరిరక్షణలో ప్రపంచ వ్యాప్తంగా కీలక కార్యాచరణ అవసరం

### రాష్ట్రంలో పెట్టుబడులకు మంచి లాభాలు

### అమరావతి బ్లూ-గ్రీన్ సిటీగా రూపకల్పన

### లండన్‌లోని గ్లోబల్ కన్వెన్షన్ సెంటర్‌లో సిఎం చంద్రబాబు



బుధవారం లండన్‌లోని గ్లోబల్ కన్వెన్షన్ సెంటర్‌లో మాట్లాడుతున్న సిఎం చంద్రబాబు

**విజయవాడ,నవంబరు 5,ప్రభాతవార్తప్రతినిధి:** పర్యావరణ పరిరక్షణ విషయంలో ప్రపంచ వ్యాప్తంగా కీలక కార్యచరణ అవసరమని ముఖ్య మంత్రి చంద్రబాబు వ్యాఖ్యానించారు. కాలుష్యంతో సహా ఇతరంశాలు, వాతావరణ మార్పుల సమస్య పరిష్కారానికి దేశాలన్నీ అత్యవసరంగా పని చేయాల్సిన సమయం ఆసన్నమైందని పిలుపు నిచ్చారు. ప్రతికూల వాతావరణంతో పెనుముప్పు ఎదుర్కోవాల్సిన పరిస్థితులు రాక ముందే మేల్కో వాలని అభిప్రాయపడ్డారు. లండన్‌లోని బుధవారం ఉదయం గ్లోబల్ కన్వెన్షన్ సెంటర్‌లో ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ డైరెక్టర్స్ సంస్థ నిర్వహించిన అవార్డుల ప్రదానోత్సవంలో పాల్గొన్న చంద్రబాబు భవిష్యత్తు తరాలకు మెరుగైన పరిస్థితులు కల్పించాల్సిన బాధ్యత అందరిపైనాఉందని తెలిపారు. ప్రభు త్వాలు, ప్రైవేటు రంగం కలిసి పనిచేస్తేనే భావి తరం సురక్షితంగా ఉంటుందని పేర్కొన్నారు. రేపటితరం భవిష్యత్తు కోసం సరైన వేదికలు సిద్ధం చేయాల్సిన బాధ్యత పాలకులు, పారిశ్రామికవేత్త లపై ఉందని ముఖ్యమంత్రి చంద్రబాబు తెలిపారు. విజన్ ఉంటేనే ఏరంగంలోనైనా అభివృద్ధి సాధ్య మని ఆయన వివరించారు. ప్రపంచంలో వస్తున్న మార్పులకు అనుగుణంగా ప్రభుత్వాలు, సంస్థలు వాటి ప్రణాళికలను మార్చుకోవాలని సూచించారు. భౌగోళిక, రాజకీయ మార్పులతో పాటు వాతా వరణ సంక్షోభాలను అధిగమించాలని స్పష్టం చేశారు. దూరదృష్టి, పక్కా ప్రణాళిక అవసరమని సిఎం చంద్రబాబు అన్నారు. ప్రజల జీవితాల్ని మెరుగుపరిచేందుకు, వారికి అత్యుత్తమ సేవలం దించేందుకు సాంకేతికతను ఉప >>2

# 120 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో తనిఖీలు

### అవినీతి ఆరోపణల నేపథ్యంలో దాడులు జరిపిన ఎసిబి

**విజయవాడ.డిసెంబరు 5,ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్రవ్యాప్తంగా 120 సబ్ రిజిస్ట్రార్ కార్యాల యాల్లో ఎసిబి తనిఖీలు చేపట్టింది. సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో అధికారులు ఏకకాలంలో సోదాలు చేపట్టారు. ఎన్టీఆర్ జిల్లాలోని ఇబ్రహీంపట్నం, ప్రకాశం జిల్లాలోని ఒంగోలు, విజయనగరం జిల్లా లోని భోగాపురం, సత్యసాయి జిల్లాలోని చిలమ త్తూరు, నెల్లూరు జిల్లాలోని స్టోన్‌హౌస్‌పేట, విశాఖపట్నం జిల్లాలోని మధురవాడ, పల్నాడు జిల్లా నరసరావుపేట తదితర సబ్ రిజిస్ట్రార్ కార్యా లయాల్లో తనిఖీలు చేపట్టారు. అవినీతి ఆరోపణల నేపథ్యంలోనే సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో ఈ దాడులు చేపట్టినట్లు తెలుస్తోంది.

ఎన్టీఆర్ జిల్లా ఇబ్రహీంపట్నం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంపై ఎసిబి ఆకస్మిక దాడులు చేసింది. సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంపై అవినీతి ఆరోపణలు రావడంతో అధికారులు మెరుపు దాడులు చేశారు. బయట వ్యక్తులను అనుమతించ >>2



# బీహార్‌లో నేడే తొలిదశ పోలింగ్

### 121 నియోజకవర్గాలలో 1314 మంది అభ్యర్థులు

### బరిలో తేజస్వి సహా పలువురు మహామహులు

**పాట్నా, నవంబరు 5:** బీహార్‌లో గురువారం 121 నియోజకవర్గాల్లో మొదటి దశ పోలింగ్ జరుగనుంది. ఇందుకోసం కేంద్ర ఎన్నికల సంఘం పెద్ద ఎత్తున ఏర్పాట్లు చేసింది. తొలి విడతలో 1,314 మంది అభ్యర్థులు బరిలో ఉండగా 3.75కోట్ల మంది బీహారీలు వారి భవితవ్యాన్ని తేల్చనున్నారు. అందులో 122 మంది మహిళా అభ్యర్థులు కాగా జన్ సురాజ్ పార్టీ తరఫున ఓ ట్రాన్స్‌జెండర్ కూడా బరిలో ఉన్నారు. తొలి విడతలో ఓటువేయనున్న 3.75 కోట్లమంది కోసం కేంద్ర ఎన్నికల సంఘం 45, 341 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేసింది. అందులో 36,733 గ్రామీణ ప్రాంతాల్లో ఉన్నాయి. 10.72లక్షల మంది తొలిసారి >>2

# ప్రయాణికుల పైనుంచి దూసుకుపోయిన రైలు

### ఆరుగురు అక్కడికక్కడే మృతి

### యుపిలో ఘోర విషాదం

**లక్నో, నవంబరు 5:** ఉత్తరప్రదేశ్‌లోని మీర్జా పూర్‌లో ఘోర విషాదం చోటుచేసుకుంది. చునార్ రైల్వే స్టేషన్‌లో బుధవారం ఉదయం వేగంగా వెళ్తున్న రైలు కిందపడి ఆరుగురు భక్తులు అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. ఈ దుర్ఘటనలో మరికొందరు తీవ్రంగా గాయ పడ్డారు. కార్తిక పౌర్ణమి పుణ్యస్నానాల కోసం వారణాసికి వెళ్తుండగా ఈ ప్రమాదం జరిగింది. చోపాన్ నుంచి ప్రయాగ్‌రాజ్ వెళ్లే ప్యాసింజర్ రైలు (13309) చునార్ స్టేషన్‌లోని 4వ నంబర్ ప్లాట్‌ఫామ్‌పై ఆగింది. ఈ రైలులో వచ్చిన భక్తులు, ఫుట్ ఓవర్‌బ్రిడ్జిని ఉపయో గించకుండా, పట్టాలు దాటి 3వ నంబర్ ప్లాట్ ఫామ్‌కు వెళ్లేందుకు ప్రయత్నించారు. ఉదయం సుమారు 9:30 గంటల సమయంలో అదే ట్రాక్‌పై వేగంగా వస్తున్న నేతాజీ ఎక్స్‌ప్రెస్ (కల్కా మెయిల్,12311) వారిని బలంగా ఢీకొట్టింది. ఆ రైలుకు చునార్ స్టేషన్‌లో హాల్ట్ లేదు. దీంతోభక్తులు తప్పించుకునే అవ కాశం లేకుండా పోయింది. ఈ ఘట >>2



బుధవారం న్యూఢిల్లీలో ప్రధాని మోదీతో భేటీ అయిన భారత మహిళల క్రికెట్ జట్టు సభ్యులు

# ఇది భారత్ గెలుపు

### మహిళల ప్రపంచకప్ టీమ్‌ను అభినందించిన ప్రధాని మోడీ

### ప్రధానికి 'నమో-1' జెర్సీని అందించిన మహిళా జట్టు

**న్యూఢిల్లీ, నవంబరు 5:** చారిత్రాత్మక విజయం సాధించిన తర్వాత భారత మహిళల క్రికెట్ జట్టు దేశ రాజధాని ఢిల్లీ నగరంలో ప్రధాని నరేంద్ర మోడీని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసింది. మహిళల వన్డే ప్రపంచ కప్ ఫైనల్‌లో హర్మన్‌ప్రీత్ కౌర్ నేతృత్వంలోని భారత జట్టు ఆదివారం దక్షిణాఫ్రికాను 52 పరుగుల తేడాతో ఓడించి తొలిసారి ఐసిసి ట్రోఫీని నెగ్గింది. 52 సంవత్సరాల >>2

# జాబ్ మేళా ద్వారా 78 వేల ఉద్యోగాలు భర్తీ

- ఉన్నత విద్యలో పాఠ్యప్రణాళిక ప్రక్షాళన
- ఐటిఐలు, వర్సిటీలకు పరిశ్రమలతో అనుసంధానం
- స్కిల్ డెవలప్‌మెంట్, ఉన్నత విద్యపై మంత్రి లోకేష్ సమీక్ష

**విజయవాడ.నవంబరు 5.ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్రంలో ప్రజాప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఇప్పటివరకు 175 అసెంబ్లీ నియోజకవర్గాల్లో 406 జాబ్ మేళాల ద్వారా 78వేలమంది యువతకు ఉద్యోగాలు లభించినట్లు రాష్ట్ర విద్య, ఐటి, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్ తెలిపారు. ఉండవల్లి నివాసంలో స్కిల్ డెవలప్ మెంట్ శాఖపై మంత్రి నారా లోకేష్ ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశంలో మంత్రి లోకేష్ మాట్లాడుతూ... జాబ్ మేళాల్లో మరిన్ని సంస్థలను భాగస్వాములను చేసి యువతకు పెద్దఎత్తున ఉద్యోగాలు కల్పించేలా చూడాలని అన్నారు. గ్లోబల్ మార్కెట్లో డిమాండ్‌కు అనుగుణంగా డిజిటల్, ఎఐ సాంకేతికతలపై విద్యార్థులకు శిక్షణ ఇవ్వాలని సూచించారు. అధునాతన సాంకేతికతలపై ప్రపంచస్థాయి సంస్థలతో భాగస్వామ్యం కోసం కేంద్రప్రభుత్వ ఉన్నతాధికారులతో సమన్వయంచేసుకోవాలని అన్నారు. రాష్ట్రంలో కొత్తగా వస్తున్న పరిశ్రమలు, వాటి అవసరాలను గుర్తించి అందుకు అనుగుణంగా ఐటిఐ, పాలిటెక్నిక్‌ల కరిక్యులమ్‌లో మార్పులపై దృష్టిసారించాలన్నారు. ఈసందర్భంగా మంత్రి లోకేష్‌మాట్లాడుతూ రాష్ట్రంలోని 16 ఇండస్ట్రి >>2



బుధవారం స్కిల్ డెవలప్‌మెంట్, ఉన్నత విద్యపై మంత్రి లోకేష్ సమీక్ష దృశ్యం

# స్వతంత్ర పాలనా యూనిట్లుగా పంచాయతీలు

### క్లస్టర్ వ్యవస్థ రద్దు

**విజయవాడ,నవంబరు 5,ప్రభాతవార్తప్రతినిధి:** పంచాయితీరాజ్ శాఖలో సంస్కరణలకు ప్రభుత్వం కార్యచరణ చేపట్టింది.ప్రస్తుతం అమలులో ఉన్న పంచాయితీ క్లస్టర్ వ్యవస్థను రద్దుచేసింది. పంచాయితీలను స్వతంత్ర పరిపా లన యూనిట్లుగా ప్రకటించింది. వీటిని నాలుగు గ్రేడులుగా విభజించడంతో పాటు పంచాయితీ కార్యదర్శుల పేర్లను పంచాయితీ అభివృద్ధి అధికారులు (పిడిఒ)గా మార్చింది. పురపాలక సంఘాల తరహాలో ప్రతి పంచాయితీలోనూ పారిశుద్ధ్యం, త్రాగునీటి సరఫరా, గ్రామీణ ప్రణాళిక,వీధి దీపాలు,ఇంజినీరింగ్, ఆదాయం, పన్ను వసూళ్ళ విభాగాలను ఏర్పాటు చేసి సిబ్బందిని కేటాయించాలని నిర్ణ >>2

# తాడిపత్రిలో బ్యాంకు మేనేజర్ ఆత్మహత్య

**తాడిపత్రిటౌన్, నవంబరు 5 ప్రభాతవార్త :** తాడిపత్రి పట్టణంలోని యూనియన్ బ్యాంక్ మేనేజర్ గోగర్ తన ఇంటిలో ఫ్యాన్‌కు ఉరివేసు కొని ఆత్మహత్య చేసుకున్నాడు. బుధవారం ఉదయం 11 గంటలైనా మేనేజర్ బ్యాంకుకు రాక పోవడంతో తోటి ఉద్యోగులు తన ఇంటి దగ్గరికి వెళ్లి చూడగా అక్కడ బ్యాంకు మేనేజర్ ఫ్యాన్‌కు వేలాడుతూ కనిపించాడు. మేనేజర్ గోగర్ గత సంవత్సరంనుండి యూనియన్ బ్యాంకులో మేనే జర్‌గా పనిచేస్తున్నట్లు తోటి ఉద్యోగులు తెలి పారు. కుటుంబ కలహాలనేపథ్యంలో ఆత్మహత్య చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. మృతుడి వద్ద సూసైడ్ లెటర్‌ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. మృతికి గల కారణాలపై పోలీ సులు దర్యాప్తు చేపట్టారు.

# తిరుమల లడ్డూ నాణ్యత పెంచాం



### రెండు గంటల్లో దర్శనం కలిగించే ఎఐ ప్రాజెక్టు

### టిటిడి పరిధిలోని అన్ని ఆలయాల్లో నిత్యాన్నదానం

### కరీంనగర్, దుబ్బాకలో శ్రీవారి ఆలయాలు

### గత యేడాదిలో టిటిడికి వెయ్యి కోట్ల విరాళాలు

### చైర్మన్‌గా యేడాది పూర్తి సందర్భంగా మీడియాతో బిఆర్ నాయుడు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, నవంబరు 5:** గత యేడాది కాలంలో టిటిడికి రూ.1000 కోట్ల విరాళాలు వచ్చాయని బోర్డు చైర్మన్ బిఆర్ నాయుడు వెల్లడించారు. చైర్మన్‌గా ఏడాది పూర్తి చేసుకున్న సందర్భంగా బుధవారం మీడియాతో మాట్లాడారు. మొదటి బోర్డు మీటింగ్ లోనే అన్యమతస్థులను తొలగిస్తూ నిర్ణయం తీసుకు న్నామని, కొందరిని తొలగించామన్నారు. ఎఐ టెక్నాలజీద్వారా రెండు,మూడుగంటల్లోనే సమాన్య భక్తులకు దర్శనం కల్పించేందుకు ఏర్పాట్లు చేయాలని అనుకున్నామని, కానీ ఒక వర్గం ఎఐపై వ్యతిరేకత వ్యక్తం చేసిందని,నూతన ఇఒ అనిల్ కుమార్ సింఘాల్ ఆధ్వర్యంలో మళ్లీ ఎఐ ప్రాజె క్టును పట్టాలెక్కిస్తున్నామని చెప్పారు. తిరు మల కొండపై రాజకీయాలు మాట్లాడితే చర్యలు తీసుకో వాలని తీర్మానించామని, తిరుమలపై అసత్య ప్రచా రాలుచేస్తే చట్టపరమైన చర్యలు తీసుకుం టామన్నారు.. శ్రీవారి అన్నప్రసాదంలో >>2

# కృష్ణపై భారీ వంతెనతో దీవుల్లోని గ్రామాలకు లింక్



### కేంద్ర సాయంతో అవనిగడ్డలో స్లూయిజ్‌ల పునరుద్ధరణ

### తుఫాన్ నష్టంపై సమీక్ష జరిపిన డిసిఎం పవన్

**విజయవాడ.నవంబరు 5,ప్రభాతవార్తప్రతినిధి:** కృష్ణా జిల్లా అవనిగడ్డ నియోజకవర్గంలోని ఎదురు మొండిదీవులవాసుల చిరకాలకలఏటిమొగ, ఎదురు మొండి హైలెవల్ వంతెననిర్మాణాన్ని సాకారం చేసేందుకు కృషిచేస్తామని ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ స్పష్టం చేశారు. ఈ వంతెన నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వ సహకారంతోపాటు సాస్కి పథకం నుంచి నిధులు సమకూరుస్తామన్నారు. అవనిగడ్డ నియోజకవర్గం పరిధిలో అవుట్ ఫాల్ స్లూయిజ్‌ల పునరుద్ధరణకు తక్షణం చర్యలు తీసుకోనున్నట్టు తెలిపారు. బుధవారం మంగళగిరిలోని క్యాంపు కార్యాలయంలో కృష్ణా జిల్లా, అవనిగడ్డ నియోజక వర్గ పరిధిలోని తుపాను ప్రభావిత ప్రాంతాల్లో పంట నష్టం అంచనాలు, నియోజకవర్గ అభివృద్ధి తదితర అంశాలపై మచిలీపట్నం పార్లమెంటు సభ్యులు వల్లభనేని బాలశౌరి, శాసన సభ్యులు మండలి బుద్ధప్రసాద్, వివిధశాఖల ఉన్నతా ధికారులు, జిల్లా కలెక్టర్, ఇంజినీరింగ్ అది >>2




వివరాలు తెలుపాల్సిన నంబరును చూపుతున్న సిఐడి బృందం

# పరకామణి ఆస్తులపై దర్యాప్తు మొదలు

- అక్రమ ఆస్తులపై సమాచారం ఇవ్వండి
- డిసెంబర్2లోగా హైకోర్టుకు సమగ్ర నివేదిక
- నిందితుడు రవికుమార్ హైదరాబాద్‌లో మకాం
- తిరుపతిలో సిఐడి డిజి రవిశంకర్‌అయ్యన్నార్

**తిరుపతి, నవంబరు 5, ప్రభాతవార్తప్రతినిధి:** తిరుమల పరకామణిలో జరి గిన అవినీతిఅక్రమాలపై హైకోర్టు ఆదేశాలతో సిఐడి బృందం 20మంది అధికారులతో విచారణ చేపట్టేందుకు రంగంలోకి దిగామని, పరకామణితో సంపాదించిన ఆస్తుల వివరాలు తెలిసిన వారెవరైనా సమాచారం ఇవ్వొచ్చని సిఐడి చీఫ్ రవిశంకర్ అయ్యన్నార్ విజ్ఞప్తి చేశారు. పూర్తి వివరాలు అందిం చిన వారి పేర్లు, ఇతరత్రా సమాచారం గోప్యంగా ఉంచుతామని అన్నారు. పరకామణి ఆస్తులకు సంబంధించి 9440700921 నంబర్‌కు వాట్సాప్ ద్వారా గానీ, మెయిల్‌ఐడి "సిడిజిసిఐడిఅట్‌దిరేట్‌ఆఫ్ ఎపి.జిఒవి.ఇన్"కు సమాచారం తెలియజేయవచ్చని సూచించారు. తిరుమల పరకామణిలో 2023లో జరిగిన 920 అమెరికన్ విదేశీడాలర్ల చోరీకేసుకు సంబంధించి ఇటీవల శ్రీనివాసులు అనే వ్యక్తి పిటిషన్ దాఖలు చేయడం, విచారణ చేపట్టిన హైకోర్టు న్యాయమూర్తి తదుపరి పూర్తిస్థాయిలో సమగ్రదర్యాప్తుకు సిఐడి డిజిని ఆదేశించిన విషయం విదితమే. హైకోర్టు ధర్మాసనం ఆదేశాలతో ఇప్పటికే తొలిదఫా తిరుమలకు వచ్చిన సిఐడి డిజి >>2

### భువనేశ్వరికి 'డిస్టింగ్విష్డ్ ఫెలోషిప్-2025' పురస్కారం

2లో

### ట్రంప్‌కు ఎదురు దెబ్బ

న్యూయార్క్, వర్జీనియాలో డెమొక్రాట్ల విజయం

గవర్నర్‌గా తెలంగాణ మూలాలున్న మహిళ

5లో




బుధవారం లండన్‌లో 'డిస్టింగ్విష్డ్ ఫెలోషిప్-2025' పురస్కారం అందుకుంటున్న నారా భువనేశ్వరి. చిత్రంలో సిఎం చంద్రబాబు, తదితరులు

# భువనేశ్వరికి 'డిస్టింగ్విష్డ్ ఫెలోషిప్-2025' పురస్కారం

## హెరిటేజ్ ఫుడ్స్‌కు 'గోల్డెన్ పీకాక్' అవార్డు అందచేత

### లండన్‌లో ప్రదానం చేసిన ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ డైరెక్టర్స్ సంస్థ

**విజయవాడ,నవంబరు 5,పభాతవార్త ప్రతినిధి:** ముఖ్యమంత్రి చంద్రబాబు సతీమణి నారా భువనేశ్వరి ప్రతిష్టాత్మక 'డిస్టింగ్విష్డ్ ఫెలోషిప్-2025' అందుకున్నారు. లండన్‌లోని గ్లోబల్ కన్వెన్షన్ సెంటర్‌లో భారత కాలమానం ప్రకారం మంగళవారం రాత్రి 1.30 సమయంలో జరిగిన కార్యక్రమంలో ఇనిస్టిట్యూట్ ఆఫ్ డైరెక్టర్స్(ఐవోడి) సంస్థ ప్రతినిథులు ఆమెకు ఈ పురస్కారాన్ని ప్రదానం చేశారు. హెరిటేజ్ పుడ్స్ సంస్థకు 'ఎక్స్‌లెన్స్ ఇన్ కార్పొరేట్ గవర్నెర్స్' విభాగంలో లభించిన గోల్డెన్ పీకాక్




గోల్డెన్ పీకాక్ అవార్డును అందుకొంటున్న భువనేశ్వరి

అవార్డునూ ఆ సంస్థ విసిఎండి అయిన భువనేశ్వరికి ఇదే వేదికపై అందచేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ఈ కార్యక్రమంలో ప్రత్యేక అతిథిగా పాల్గొని ప్రసంగించారు.ఎన్టీఆర్ ట్రస్ట్ మేజేజింగ్ ట్రస్టీ హోదాలో ప్రజాసేవ-సామాజిక సాధికారత రంగాల్లో చేసిన విశేష కృషికి గానూ భువనేశ్వరికి 'డిస్టింగ్విష్ట్ ఫెలోషిప్-2025' పురస్కారాన్ని అందించారు. ఎన్టీఆర్ ట్రస్ట్ ద్వారా విద్య,వైద్యం,మహిళా సాధికారత,విపత్తుల్లో సహాయం తదితర అంశాల్లో ఆమె విస్తృత సేవలందిస్తున్నారు. రక్తదాన శిబిరాలు, విద్యార్థి సహాయ పథకాలు, మహిళల ఆర్థిక స్వావలంబన వంటి సేవా కార్యక్రమాలు అమలు చేస్తూ ప్రజల మన్ననలు పొందారు. తలసేమియా రోగులకు ఉచితంగా రక్తమార్పిడి చేయిస్తున్నారు. దీనిపై పెద్ద ఎత్తున అవగాహనా కార్యక్రమాలు నిర్వహించారు. దేశంలోనే ప్రతిష్టాత్మక డెయిరీ బ్రాండ్‌గా హెరిటేజ్‌ను తీర్చిదిద్దడం,ఆ సంస్థ ఎదుగుదల,కొత్త ఉత్పత్తుల ఆవిష్కరణలు,కోట్ల మంది వినియోగదారులకు ఆ ఉత్పత్తులు చేరువయ్యేలా చేయడంలో భువనేశ్వరిది క్రియాశీలక పాత్ర.ఈ సంస్థ కార్యకలాపాల ద్వారా రైతుల సాధికారతను ఆమె పెద్దపీట వేస్తున్నారు. ఈనేపథ్యంలో హెరిటేజ్ పుడ్స్‌సంస్థకు ఎక్స్‌లెన్స్ ఇన్ కార్పొరేట్ గవర్నెన్స్ విభాగంలో లభించిన గోల్డెన్ పీకాక్ అవార్డును ఆ సంస్థ విసిఎండి హోదాలో భువనేశ్వరి అందుకున్నారు. ఇంతకుముందు ఈ ప్రతిష్ఠాత్మక అవార్డును భారత మాజీరాష్ట్రపతి డాక్టర్ అబ్దుల్ కలాం, హిందూజా గ్రూప్ కోఛైర్మన్ గోపీచంద్ హిందూజా, ఆదిత్యబిర్లా గ్రూప్ కమ్యూనిటీ ఇనిషియేటివ్స్ ఛైర్‌పర్సన్ రాజశ్రీ బిర్లా వంటి ప్రపంచ ప్రఖ్యాత వ్యక్తులు అందుకున్నారు. ఆ జాబితాలో ఇప్పుడు భువనేశ్వరిపేరుచేరడం రాష్ట్రానికి గౌరవం, దేశానికి గర్వకారణం అని సిఎం చంద్రబాబు, మంత్రి లోకేష్, హిందుపురం శాసనసభ్యుడు నందమూరి బాలకృష్ణ ఆమెను అభినందించారు.

# బీజాపూర్ జిల్లాలో ఎన్ కౌంటర్

## ముగ్గురు మావోయిస్టుల మృతి

**చర్ల, నవంబరు 5, ప్రభాతవార్త:** ఛత్తీస్‌ఘఢ్ దండకారణ్యంలో మరోమారు కాల్పుల మోతతో దద్దరిల్లాయి. బీజాపూర్ జిల్లా తాళ్లగూడెం పోలీస్ స్టేషన్ పరిదిలోని అన్నారం మరిమల్ల అటవీ ప్రాంతంలో భద్రతా బలగాలు మావోయిస్టుల మధ్య జరిగిన ఎదురుకాల్పులలో ముగ్గురు మావోయిస్టులు మృతిచెందారు. తాళ్లగూడెం పోలీస్ స్టేషన్ పరిధిలోని అటవీప్రాంతంలో మావోయిస్టులు సంచరిస్తూన్నారన్న నిఘా వర్గాల పక్కా సమాచారంతో సిఆర్పిఎఫ్ డిఆర్జి ఎస్టిఎఫ్ బలగాలు గాలింపు చేపట్టాయి. ఈ క్రమంలో అన్నారం మరిమల్ల అటవీప్రాంతంలో మావోయిస్టులు తారసపడటంతో ఇరువైపుల నుండి హోరా హోరీగా కాల్పులు జరిగాయి. ఈ ఎదురుకాల్పులలో ముగ్గురు మావోయిస్టులు మృతిచెందగా వారి మృత దేహాలతో పాటు ఆయుదాలు, పేలుడు పదార్ధాలు, నిత్యావసర సరుకులను భద్రతా బలగాలు స్వాదీనం చేసుకున్నాయి. మృతదేహాలను గుర్తించాల్సి ఉంది.

# ఎపిలో గ్రీన్ హైడ్రోజన్ హబ్

>> యోగంపై ప్రభుత్వాలు ఆలోచించాలని చంద్రబాబు పిలుపునిచ్చారు. ఇప్పుడు ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ సరిపోదని సిఎం చంద్రబాబు అన్నారు.స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ కూడా అవసరమని స్పష్టం చేశారు. ఎపి కేవలం ఒక్క సంవత్సరంలోనే 120 బిలియన్ డాలర్ల కొత్త పెట్టుబడులను ఆకర్షించిందన్నారు. రాష్ట్రంలో గ్రీన్ హైడ్రోజన్ హబ్ ఏర్పాటు చేస్తున్నామనీ, అమరావతి నగరాన్ని బ్లూగ్రీన్ సిటీ నమూనాగా రూపొందించామని వివరించారు. విశాఖలో ఈ నెల 14, 15న పెట్టుబడిదారుల సదస్సు నిర్వహిస్తున్నాం. ఇక్కడున్న కంపెనీలన్నీ ఆ సదస్సుకు హాజరుకావాలని వ్యక్తిగతంగా ఆహ్వానిస్తున్నాను అన్నారు. ఏపీలో మీరు పెట్టుబడి పెట్టవచ్చు. మీ పెట్టుబడులకు మంచి లాభాలు వస్తాయని నేను హామీ ఇస్తున్నట్లు తెలిపారు. 2047 నాటికి ప్రపంచంలోనే అగ్రగామి ఆర్థిక వ్యవస్థగా ఎదగాలనేది భారత్ ఆకాంక్ష అని గుర్తుచేశారు. ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా కృత్రిమ మేథ చాలా వేగంగా విస్తరిస్తోందన్న ఆయన భవిష్యత్తు అంతా ఎఐ చుట్టూ తిరిగే సూచనలే కనిపిస్తున్నాయన్నారు. ఎపిలో ఆ దిశగానే విధానాలు, ప్రణాళికలు రూపొందించుకుంటున్నామని తెలిపారు.

# యూనిట్లుగా పంచాయతీలు

>> యించింది. ఈ ప్రతిపాదనలను మంత్రివర్గం ఇటీవల ఆమోదించడంతో రాష్ట్ర పంచాయితీ రాజ్ గ్రామీణాభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శి శశిభూషణ్‌కుమార్ ఇందుకు సంబంధించి మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు తదుపరి చర్యలు తీసుకోవాలని పంచాయితీరాజ్ శాఖ కమీషనర్‌ను ఆదేశించారు,ప్రస్తుతం ఉన్న 7,244 క్లస్టర్ వ్యవస్థను రద్దు చేసి 13,351 గ్రామ పంచాయితీలు స్వతంత్ర పరిపాలన యూనిట్లుగా విభజన13,351 పంచాయితీలు నాలుగు గ్రేడ్లుగా వర్గీంచారు.వీటిలో రూరల్ పంచాయితీలు 359 గ్రేడ్1,గా ఉంటాయి, -3,082,ఉంటాయి,గ్రేడ్2-3,163 ఉంటాయి.గ్రేడ్3-6,747 ఉంటాయి.గ్రేడ్-1 పంచాయితీ కార్యదర్శుల పోస్టులను డిప్యూటీ ఎంపీడీవో క్యాడర్‌లో చేర్చాలని నిర్ణయంమిగతా కార్యదర్శులను మూడు గ్రేడ్‌లుగా విభజనరూరల్ పంచాయితీల్లో మెరుగైన పరిపాలన కోసం జూనియర్ అసిస్టెంట్లు,బిల్ కలెక్టర్లు 359 మందిని సీనియర్ అసిస్టెంట్లుగా అప్‌గ్రేడ్ చెయ్యాలని నిర్ణయంప్రతి పంచాయితీలోనూ పారిశుద్ధ్యం,త్రాగునీటి సరఫరా,గ్రామీణ ప్రణాళిక,వీధి దీపాలు,ఇంజనీరింగ్,ఆదాయం విభాగాల్లో సిబ్బంది ఏర్పాటుఇంజనీరింగ్,డిజిటల్ అసిస్టెంట్ల సేవలు గ్రామీణ ప్రణాళజక అసిస్టెంట్‌లుగా వినియోగిస్తారు,డిజిటల్ అసిస్టెంట్లతో పంచాయితీల్లో ప్రత్యేక ఐటీ విభాగం ఏర్పాటు చేస్తారు,పంచాయితీల్లో కార్యదర్శుల ఖాళీలు 2025-26 ప్యానల్‌కు ముందే నింపాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది .

# దూసుకుపోయిన రైలు

>> నలో ఆరుగురు అక్కడికక్కడే మరణించగా, పలువురి శరీర భాగాలు ఛిద్రమయ్యాయి. ప్రమాదం జరిగిన వెంటనే స్టేషన్‌లో గందరగోళం నెలకొంది. సమాచారం అందుకున్న రైల్వే పోలీసులు, రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్ సిబ్బంది, స్థానిక పోలీసులు వెంటనే ఘటనా స్థలానికి చేరుకున్నారు. క్షతగాత్రులను సమీపంలోని ఆసుపత్రులకు తరలించి చికిత్స అందిస్తున్నారు. వారణాసి జోన్ ఎడిజి పీయూష్ మోర్డియా ఆరుగురు మరణించినట్లు ధృవీకరించారు. ఈ ప్రమాదం కారణంగా చునార్ జంక్షన్‌లో రైళ్ల రాకపోకలకు ఎలాంటి అంతరాయం కలగలేదని నార్త్ సెంట్రల్ రైల్వే జోన్ అధికారులు తెలిపారు. ఈ దుర్ఘటనపై ఉత్తరప్రదేశ్ సిఎం యోగిఆదిత్యనాథ్ తీవ్రదిగ్భ్రాంతి వ్యక్తంచేశారు.మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

# దీవుల్లోని గ్రామాలకు లింక్

>>.కారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వ సహకారంతో అవనిగడ్డ ప్రాంతంలో ఉన్న అవుట్ ఫాల్ స్లూయిజ్ ల సమస్యకు పరిష్కారం చూపుతానని చెప్పారు. అటవీ శాఖ అనుమతుల కోసం నిలిచిపోయిన అభివృద్ధి పనులను ముందుకు తీసుకువెళ్లే అంశంపైనా ఈ సమావేశంలో సంబంధిత శాఖ అధికారులకు దిశానిర్దేశం చేశారు.పవన్ కళ్యాణ్ మాట్లాడుతూ మొంథా తుపాను కారణంగా రాష్ట్రవ్యాప్తంగా తీర ప్రాంత గ్రామాల్లో పంటలకు తీవ్ర నష్టం వాటిల్లింది. గత వారం అవనిగడ్డ నియోజక వర్గం పరిధిలో పర్యటించి దెబ్బతిన్న పంటలను పరిశీలించిన సమయంలో నష్టపోయిన వారిలో కౌలు రైతులు కూడా ఉన్న విషయం నా దృష్టికి వచ్చింది. ఒక్క కృష్ణా జిల్లాలోనే 60 వేల మందికి పైగా సీసీఆర్సీ కార్డులు కలిగిన కౌలు రైతులు ఉన్నట్టు అధికారులు చెబుతున్నారు. నష్టపోయిన ప్రతి కౌలు రైతుని గుర్తించి వారికి ఇబ్బందులు కలగకుండా యంత్రాంగం చర్యలు తీసుకోవాలి అన్నారు.

అవనిగడ్డ నియోజకవర్గం పరిధిలోని తీర ప్రాంతంలో కాలువలను సముద్రానికి అనుసంధానిస్తూ నిర్మించిన అవుట్ ఫాల్ స్లూయిజ్‌లు పని చేయకపోవడం కారణంగా నాగాయలంక, కోడూరు మండలాల పరిధిలో సుమారు 5 వేల ఎకరాలు ముంపుకు గురవుతున్న విషయం మా దృష్టికి వచ్చింది. గత ప్రభుత్వ నిరక్ష ్యం కారణంగా ఇవి పూర్తిగా పని చేయకుండాపోయాయి అన్నారు.

**ఎదురుమొండి దీవుల వాసుల కల నెరవేరుస్తాం**

ఎదురుమొండి దీవుల్లో నివాసం ఉంటున్న ప్రజల చిరకాల వాంఛ ఏటిమొగ్గ ఎదురుమొండి బ్రిడ్జి నిర్మాణానికి పూర్తిస్థాయిలో సహాయ సహకారాలు అందిస్తామన్నారు. కృష్ణా నదిపై నిర్మించతలపెట్టిన ఈ హైలెవల్ బ్రిడ్జ కోసం ఇప్పటికే రూ.109కోట్ల నాబార్డు నిధులు మంజూరయ్యాయి. అలైన్మెంట్‌లో మార్పుల కారణంగా నిర్మాణ వ్యయం పెరిగిన విషయాన్ని స్థానిక శాసన సభ్యులు తెలియచేశారు. రూ.60 కోట్లు వరకూ నిర్మాణ వ్యయం పెరిగే అవకాశం ఉందని అంచనా వేశారు. నిర్ణీత కాల వ్యవధిలో ఏటిమొగ - ఎదురుమొండి హైలెవల్ బ్రిడ్జి నిర్మాణం పూర్తి చేస్తామన్నారు.




బుధవారం గవర్నర్ అబ్దుల్ నజీర్‌కు కర్ణాటక లా యూనివర్సిటీ గౌరవ డాక్టరేట్ ప్రదానం చేస్తున్న దృశ్యం

# గవర్నర్ నజీర్‌కు గౌరవ డాక్టరేట్

## ప్రదానం చేసిన కర్ణాటక లా యూనివర్సిటీ

**విజయవాడ, నవంబరు 5, ప్రభాతవార్తప్రతినిధి:** కర్ణాటక దార్వాడ్‌లోని వ్యవసాయ శాస్త్రాల విశ్వవిద్యాలయం ఫార్మర్స్ నాలెడ్జ్ సెంటర్‌లో బుధవారం జరిగిన 7వ స్నాతకోత్సవంలో ఆంధ్రప్రదేశ్ గవర్నర్ ఎస్.అబ్దుల్ నజీర్‌కు కర్ణాటక రాష్ట్ర లా యూనివర్సిటీ గౌరవ డాక్టరేట్ ప్రదానం చేసింది. కర్ణాటక గవర్నర్,కర్ణాటక రాష్ట్ర లా యూనివర్సిటీ ఛాన్సలర్ థావర్ చంద్ గెహ్లాట్,అబ్దుల్ నజీర్‌కు గౌరవ డాక్టరేట్ ప్రదానం చేశారు. వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ డాక్టర్ సి.బసవరాజు నిర్వహించిన స్నాతకోత్సవంలో న్యాయ,న్యాయ పార్లమెంటరీ వ్యవహారాలు,శాసన శాఖ మంత్రి,విశ్వవిద్యాలయ ప్రో ఛాన్సలర్ డాక్టర్ హెచ్‌కె పాటిల్ గౌరవ అతిథిగా పాల్గొన్నారు. భారత సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి,కర్ణాటక రాష్ట్ర సరిహద్దు,నదుల రక్షణ కమీషన్ ఛైర్మన్ డాక్టర్ జస్టిస్ శివరాజ్ వి. పైల్ స్నాతకోత్సవ ప్రసంగం చేశారు. గవర్నర్ అబ్దుల్ నజీర్ తన ప్రసంగంలో తనకు ఇచ్చిన డాక్టర్ ఆఫ్ లా డిగ్రీ గౌరవానికి కర్ణాటక రాష్ట్ర లా విశ్వవిద్యాలయానికి కృతజ్ఞతలు తెలిపారు.

# బీహార్‌లో నేడే తొలిదశ పోలింగ్

>> ఓటు వేయనున్నారు. ఉదయం 7 గంటలకు ప్రారంభం కానున్న ఓటింగ్, సాయంత్రం 6గంటలకు ముగియనుంది. భద్రతా కారణాలతో సిమ్రిబఖ్తియార్‌పుర్, మహిషి, తారాపుర్, ముంగర్, జమల్‌పుర్, సూర్యగర్హ నియోజకవర్గంలోని 56 పోలింగ్ బూత్‌ల్లో ఓటింగ్ సాయంత్రం 5గంటలకే ముగియనుంది. రాష్ట్ర పోలీసులతోపాటు కేంద్ర పారామిలిటరీ బలగాలతో కట్టుదిట్టమైన భద్రత ఏర్పాటు చేశారు. మొత్తం 1314 మంది అభ్యర్థులు బరిలో ఉండగా, ప్రధానంగా ఎన్‌డిఏ, ఇండియా కూటమిల మధ్యే పోటీ నెలకొంది. అయితే రాజకీయ వ్యూహకర్త ప్రశాంత్ కిషోర్ సారథ్యంలోని జనసురాజ్ పార్టీ తొలిసారి బిహార్ బరిలో దిగింది. ఈ ఎన్నికల్లో ఆ పార్టీ ప్రభావంపై ఉత్కంఠ నెలకొంది. తొలి దశ పోలింగ్ జరుగుతున్న ప్రాంతాల్లో ఇండియా కూటమి ముఖ్యమంత్రి అభ్యర్థి తేజస్వి యాదవ్‌తోపాటు సిఎం నితీశ్ కుమార్ కేబినెట్‌లోని 16 మంది మంత్రులు తమ భవితవ్యం తేల్చుకోనున్నారు. తేజస్వి యాదవ్ సోదరుడు, జనశక్తి జనతాదళ్ అధినేత తేజ్ ప్రతాప్ యాదవ్ కూడా బరిలో ఉన్నాడు. 16 మంది మంత్రులలో 11 మంది బిజెపి తరఫున, ఐదుగురు జెడియు నుంచి పోటీ చేస్తున్నారు. తమ పనితీరు, ప్రభుత్వ విశ్వసనీయత, పాలనా రికార్డు, సంస్థాగత బలానికి ప్రత్యక్ష పరీక్షగా భావిస్తున్నారు. ఈనెల 11న మిగతా 122స్థానాలకు రెండో విడతలో పోలింగ్ జరగనుంది.

# 78 వేల ఉద్యోగాలు భర్తీ

>> యల్ క్లస్టర్ల పరిధిలో 16 పెద్ద సంస్థలను గుర్తించి పాలిటెక్నిక్, ఐటిఐలతో అనుసంధానించాలని అన్నారు. రాష్ట్రస్థాయి న్యాక్ సెంటర్‌ను మంగళగిరిలో ఏర్పాటుచేసే అంశాన్ని పరిశీలించాలని సూచించారు. ఎమర్జింగ్ టెక్నాలజీస్ పై ఐటిఐలలో 30, పాలిటెక్నిక్ కళాశాలలో 23 యాడ్ ఆన్ కోర్సులను ప్రవేశపెట్టామని అధికారులు తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా ఐటిఐ, పాలిటెక్నిక్ లకు విద్యార్థులకు సంబంధించి 95శాతం అపార్ ఐడి అథెంటికేషన్ పూర్తయినట్లు చెప్పారు. యువతకు అత్యంత ఉపయుక్తంగా తీర్చిదిద్దిన నైపుణ్యం పోర్టల్‌ను త్వరలో ప్రారంభించనున్నట్లు తెలిపారు.ఈ సమావేశంలో స్కిల్ డెవలప్ మెంట్ కార్పొరేషన్ ఎండి గణేష్ కుమార్, ఓంక్యాప్ అడ్వైజర్ సీతా శర్మ, సీడ్యాప్ సిఇఒ నారాయణ స్వామి పాల్గొన్నారు.

**ప్రభుత్వ విశ్వవిద్యాలయాల్లో పరిపాలనకు సంబంధించి యూనిఫైడ్ యాక్ట్ రూపొందించాలి**

విద్య, ఐటీ శాఖల మంత్రి లోకేష్ అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. కళాశాలల్లో నాలుగేళ్ల పాటు ఇంజనీరింగ్ చదువుతున్న విద్యార్థులకు ఉద్యోగాలు లభించడం లేదు. అమీర్‌పేటలో నాలుగు నెలల కోచింగ్‌తో విద్యార్థులు ఉద్యోగాలు సాధిస్తున్నారు. ఈ నేపథ్యంలో ఉన్నత విద్య పాఠ్యప్రణాళికను ప్రక్షాళన చేయాల్సిన అవసరం ఉంది. ఐటిఐలు, యూనివర్సిటీలను నవంబర్‌లోగా పరిశ్రమలతో అనుసంధానానికి చర్యలు చేపట్టాలని ఈ సందర్భంగా మంత్రి అధికారును ఆదేశించారు. ప్రైవేటు కాలేజీలను కూడా నైపుణ్యం పోర్టల్ తో అనుసంధానం చేసి ప్రాంగణ నియామకాలకు గ్యారంటీ ఇవ్వాలని, కశాశాలల్లో తప్పనిసరిగా ముఖ ఆధారిత హాజరుకు చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉందన్నారు. యూనివర్సిటీలు, ఐటిఐ, ట్రిపుల్ ఐటీల్లో ప్రాంగణ నియామకాలపై ఈ సందర్భంగా మంత్రి ఆరా తీశారు. విద్యార్థుల వందశాతం ప్రాంగణ నియామకాలకు చర్యలు తీసుకోవాలని అధికారులను మంత్రి ఆదేశించారు. ఇంటర్మీడియట్‌లో ఉత్తీర్ణతా శాతం పెంపునకు చర్యలు చేపట్టాలని అధికారులను మంత్రి లోకేష్ ఆదేశించారు. ఇంటర్ విద్యపై ఉన్నతాధికారులతో మంత్రి సమీక్ష నిర్వహించారు.

# ఇది భారత్ గెలుపు

>> మహిళా క్రికెట్ ప్రపంచ కప్ చరిత్రలో తొలిసారిగా ట్రోఫీని గెలుచుకున్నందుకు హర్మన్‌ప్రీత్ కౌర్ నేతృత్వంలోని జట్టును ప్రధానిమోడీ అభినందించారు. వరుసగా మూడుపరాజయాలు, సోషల్ మీడియాలో ట్రోలింగ్‌ను ఎదుర్కొన్న తర్వాత టోర్నీలో అద్భుతమైన పునరాగమనం చేసి టైటిల్‌ను సాధించడంపై ప్రధాని ప్రశంసించారు. ఢిల్లీ చేరుకున్న తర్వాత మహిళా జట్టుకు హోటల్‌లో డ్రమ్స్, పూలతో ఘన స్వాగతం లభించింది. ప్లేయర్లు, కోచ్ అమోల్ మజుందార్ కేక్ కట్ చేసి విజయోత్సవ వేడుకలు జరుపుకున్నారు. ప్రధానమంత్రి మోడీ జట్టును అభినందించారు. భారత క్రికెట్ ఈ చారిత్రాత్మక క్షణం కలల విజయంగా అభివర్ణించారు. ఈ సందర్భంగా కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్ ప్రధానికి 'నమో' అని ఉన్న జెర్సీని అందజేశారు. 2017 వరల్డ్ కప్ ఫైనల్‌లోభారత్ చివరివరకూ పోరాడినా విజయం సాధించలేక రన్నరప్‌తో సరిపెట్టుకుంది. అప్పుడు మిథాలిరాజ్ నేతృత్వంలోని జట్టు నరేంద్రమోడీని కలిసింది. తాజాగా ఆవిషయం ప్రధాని గుర్తుచేసారు. ప్రధానికి ప్రపంచకప్ ట్రోఫీతోపాటు నమో-1 అని రాసి ఉన్న జెర్సీని కూడా అందించారు.

# తిరుమల లడ్డూ నాణ్యత పెంచాం

>> మార్పులు తీసుకొచ్చాం లడ్డూ ప్రసాదంలో నాణ్యత పెంచాం, అన్న ప్రసాదంలో వడను తీసుకొచ్చామని చెప్పారు. తిరుపతి స్థానికులకు నెలలో ఒక మంగళవారం 3వేల మందికి స్వామివారి దర్శనం కల్పిస్తున్నామన్నారు. గతంలో టూరిజం టికెట్లు 4వేల వరకు ఇచ్చేవారు, అవి బ్లాక్‌మార్కెట్‌కు వెళ్లేవని, టూరిజం ప్యాకేజీలను రద్దు చేసి ఆ టికెట్‌లను సామాన్య భక్తులకు ఇస్తున్నామన్నారు.. తిరుమలలో కాటేజీలు, గెస్ట్‌హౌస్‌లకు స్వామివారి పేర్లు వచ్చేలా పెట్టాం స్విమ్స్ ఆస్పత్రి నిర్వాహణ,అభివృద్ధి, ఆర్థిక వనరుల సమీకరణ కోసం నిపుణుల కమిటీ ఏర్పాటు చేశామని చెప్పారు. కమిటీ నివేదిక ఆధారంగా స్విమ్స్ ఆస్పత్రికి రూ.71 కోట్లు ఇచ్చామన్నారు. బ్రేక్ దర్శనం సమయాల్లోనూ మార్పులు తీసుకొచ్చాం శ్రీవారి ట్రస్ట్ ద్వారా 5వేల శ్రీవారి ఆలయాలు నిర్మించాలని తీర్మానించామన్నారు. తిరుపతి-తిరుమల మధ్య ఎలక్ట్రిక్ బస్సులు నడిపేందుకు, టిటిడికి వంద ఎలక్ట్రిక్ బస్సులు ఇవ్వాలని కేంద్ర మంత్రి కుమారస్వామిని కోరామన్నారు. దేశవ్యాప్తంగా ఉన్న టిటిడి ఆలయాల్లో నిత్యాన్న ప్రసాదం ఏర్పాటు చేస్తామన్నారు. ముఖ్యమంత్రి ఆదేశాలతో ఇప్పటికే కొన్ని ఆలయాల్లో ప్రారంభమైందన్నారు. ఆర్కియాలజీ సర్వే ఆఫ్ ఇండియా సహాయంతో అలిపిరి పాదాల మండపం పునః నిర్మాణం చేస్తామన్నారు. ప్రతి రాష్ట్ర రాజధానిలో శ్రీవారి ఆలయాల నిర్మించబోతున్నాం ఇప్పటికే రెండు రాష్ట్రాలు ఆమోదం తెలిపాయని తెలిపారు. ఒంటిమిట్టలో భక్తుల సౌకర్యార్థం వంద గదులతో వసతి గృహ నిర్మాణం ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఎస్వీ గోశాల అభివృద్ధికి నిపుణుల కమిటీ కమిటీ సూచనల మేరకు గోశాలను మరింత అభివృద్ధి చేస్తున్నామన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మత్స్యకార ప్రాంతాల్లో ఆలయాలు,భజన మందిరాలు నిర్మిస్తామని, వీటి సంఖ్య పెరగవచ్చునని చెప్పారు. పరకామణిలో చోరీ ఘటనపై సీఐడీ ఎంక్వైరీ కొనసాగుతోందన్నారు. తిరుపతిలో ఉన్న ఫ్లైఓవర్ పేరును గత ప్రభుత్వం శ్రీనివాస సేతుగా మార్చింది ఫ్లైఓవర్‌కు తిరిగి చంద్రబాబు పెట్టిన గరుడ వారధిగా పేరు మార్చామన్నారు. గత ప్రభుత్వం అలిపిరిలో ముంతాజ్ హోటల్ కోసం 20 ఎకరాలు కేటాయించింది, ముంతాజ్ హోటల్ భూముల లీజును రద్దు చేయాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశామన్నారు. సిఎం చంద్రబాబు ఆదేశాల మేరకు దేవలోక్, ముంతాజ్ హోటల్స్, ఎంఆర్‌కేఆర్ ప్రొప్టరీస్,.. టూరిజం హోటల్ మేనేజ్మెంట్ కాలేజీకి ఇచ్చిన 50 ఎకరాల భూమిని టిటిడికి కేటాయించాలని తీర్మానించామన్నారు. పోటు కార్మికులకు జీఎస్టీ కట్ కాకుండా..వారి వేతనం పెంచాం, స్విమ్స్ హెల్త్ కార్డులు వచ్చేలా చర్యలు తీసుకున్నాం, 650 మంది కాంట్రాక్టు లెక్చరర్లు, డ్రైవర్లను రెగ్యులరైజ్ చేయాలని తీర్మానం చేశామని చెప్పారు. గత ప్రభుత్వం 1500 షాపులు అక్రమంగా కొండ మీద నెలకొల్పింది వాటిని క్రమబద్ధీకరిస్తున్నామన్నారు. భక్తులకు టిటిడి సిబ్బంది మెరుగైన సేవలు అందించడానికి.. ఉద్యోగులకు నేమ్ బ్యాడ్జ్ ఇవ్వాలని నిర్ణయించామన్నారు, స్విమ్స్‌లో మెడికల్ మాఫియా నడుస్తుంది.. దీనికి అడ్డుకట్ట వేస్తూ షాప్స్ నిర్వాహణకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. స్విమ్స్ ఆస్పత్రిలో రోగుల సౌకర్యార్థం... స్విమ్స్ ఆధ్వర్యంలో మెడికల్ షాపుల నిర్వహణ చేసేలా ఏర్పాట్లు చేశామన్నారు. తిరుపతి ఎయిర్ పోర్టుకు శ్రీ వేంకటేశ్వరా ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్టు అని నామకరణం చేయాలని నిర్ణయించామని, రాష్ట్ర ప్రభుత్వం ఈ విషయాన్ని క్యాబినెట్‌లో చర్చించి, కేంద్రానికి సిఫార్సు చేయడానికి సన్నాహాలు చేస్తోందని తెలిపారు. అమరావతిలో నిర్మించిన శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయ నిర్మాణంలో అనేక అక్రమాలున్నాయి చేసిన డిజైన్‌కు, నిర్మించిన ఆలయానికి సంబంధం లేదని పేర్కొన్నారు. 175కోట్ల రూపాయల వ్యయంతో అమరావతిలోని శ్రీవారి ఆలయాన్ని అభివృద్ధి చేస్తామని, గత యేడాది వైకుంఠ ఏకాదశి ఘటనను దృష్టిలో పెట్టుకొని ముందు జాగ్రత్తలు తీసుకుంటున్నామన్నారు. సైబర్ నేరాలు అరికట్టేందుకు తిరుపతిలో సైబర్ సెక్యూరిటీ ల్యాబ్ ఏర్పాటు చేశామని, శ్రీవాణి దర్శనం సమయాలను మార్చడంతో భక్తులకు దర్శనం సులభతరమైందన్నారు. రూ,30 కోట్లతో కరీంనగర్‌లో, రూ.4.5 కోట్లతో దుబ్బాకలో శ్రీవారి ఆలయాలు నిర్మించనున్నామని తెలిపారు. బ్రేక్ దర్శనాలు మొన్నటి వరకు ఉదయం 10.30కి ఉండేవని,ఇప్పుడు వాటిని తిరిగి తెల్లవారుజాముకి మార్చామన్నారు.

# పరకామణి ఆస్తులపై దర్యాప్తు మొదలు

>> రవిశంకర్ అయ్యన్నార్ తిరుమల పోలీసుల నుండి ఎఫ్ఐఆర్, సిడి డికార్డులు, సిసికెమెరాల ఫుటేజీలను స్వాధీనం చేసుకుని గత నెలలో హైకోర్టుకు సమర్పించారు. ఇంకా మరింత లోతుగా సమగ్రదర్యాప్తు చేపట్టి పరకామణిలో చోరీతో కూడగట్టిన ఆస్తుల వివరాలు సేకరించాలని, ఎక్కడెక్కడ ఎంత మేరకు ఉన్నాయనే ఆధారాలు,లోక్‌అదాలత్‌ద్వారా మధ్యవర్తిత్వం జరిపి లబ్ధిపొందిన వారి వివరాలు,వారికి సంబంధించిన ఆస్తులు, బ్యాంకు లావాదేవీలు,డిజిటల్ పేమెంట్స్ వివరాలను డిసెంబర్ 2వతేదీ హైకోర్టుకు సమర్పించాల్సి ఉంది. ఈ నేపథ్యంలో బుధవారం సిఐడి డిజి రవిశంకర్ అయ్యన్నార్ నేతృత్వంలో సిఐడి ఎస్పీ గంగాధర్,లీగల్‌అడ్వయిజర్ లక్ష్మణరావు, ముగ్గురు డిఎస్పీలు, ఆరుమంది సిఐలు సిబ్బంది మొత్తం 20మంది బృందం తిరుపతికి చేరుకుంది.మధ్యాహ్నం నుండి సాయంత్రం వరకు పలుకోణాల్లో సమాచారం రాబట్టారు. ఈ వివరాలతో మరింతగా అక్రమాలపై, అవినీతిపై సమాచారం రావాలని బుధవారం సాయంత్రం తిరుపతిలోని పద్మావతి విశ్రాంతి భవనంలో మీడియాప్రతినిధుల సమావేశంలో తెలిపారు.

**9440700921కు వాట్సాప్ చేయండి:**

తిరుమల పరకామణిలో చోరీచేసి దానిద్వారా విలువైన ఆస్తులు కూడగట్టారని, కుటుంబసభ్యుల పేరున ఉంచారని, అయితే ఆ వివరాలు తెలిసిన వ్యక్తులు ఎవరైనా 9440700921 నంబర్‌కు వాట్సాప్‌ద్వారా తెలియజేయాలని సిఐడి డిజి రవిశంకర్ అయ్యన్నార్ కోరారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని భరోసానిచ్చారు. ఇంకా మెయిల్ ఐడిని కూడా తెలిపారు. వివరాలు అందిస్తే మా విచారణ మరింత వేగవంతంచేస్తామని అన్నారు.

ఏడుకొండల వేంకటేశ్వరస్వామికి భక్తులుసమర్పించే కానుకల హుండీ ఆదాయం లెక్కించే పరకామణిలో అక్రమాలు జరిగాయనేది తెలిసిందన్నారు. ఇప్పటికే తిరుమల పరకామణిలో అవకతవకలపై విచారణ మొదలుపెట్టామని డిజి తెలిపారు. పరకామణిలో జరిగిన అవినీతిపై అప్పటి టిటిడి అధికారులు, గత బోర్డు సభ్యులు, పోలీస్ అధికారులు, ఇతర సిబ్బందిని విచారణ చేస్తామన్నారు. ఐదు టీమ్‌లుగా పరకామణి కేసు దర్యాప్తు చేపడతామని చెప్పారు. పరకామణిలో అధికారుల విధులు, వారి పాత్ర, బాధ్యత, జీయర్‌వ్యవస్థ బాధ్యతలు వంటి అంశాలపై విచారణ చేయనున్నామన్నారు. 1980వ సంవత్సరం నుండి సివి రవికుమార్ తిరుమల పెద్దజీయర్ మఠంలో పనిచేస్తూ పరకామణిలో గుమస్తాగా ఉన్నారన్నారు. అప్పటినుండి ఆయన వ్యవహారాలపై విచారణ చేస్తామన్నారు. ఆదాయం, ఆదాయానికి మించిన ఆస్తులు, బ్యాంకులా ఖాతాలు, లావాదేవీలు, సిసికెమెరాలు ఫుటేజీల రికార్డులు, ఇతర అంశాలపై దర్యాప్తు మొదలవుతుందన్నారు. అతనికి సంబంధించి ఆస్తులు తిరుపతి, కర్నాటక, హైదరాబాద్ మరికొన్నిచోట్ల ఉన్నట్లు తెలిసిందన్నారు. నిందితుడు రవికుమార్ హైదరాబాద్‌లో ఉన్నాడని తెలిసిందని, అతడిని గుర్తించే ప్రయత్నం చేస్తున్నామన్నారు. ఇప్పటికే శ్రీవారికానుకల క్రింద అతని నుండి గత బోర్డు రాబట్టిన 14కోట్ల రూపాయలు ఆస్తులు టిటిడికి అప్పగించినవే దానివిలువ మార్కెట్‌లో 40కోట్ల రూపాయల మేర ఉంటుందనే విషయాన్ని డిజి రవిశంకర్ మీడియాకు వెల్లడించడం సంచలనంగామారింది. అదేగాక రిజిస్ట్రార్ కార్యాలయాల్లోని డాక్యుమెంట్‌లు, గిఫ్ట్‌డీడ్ రూపంలో రిజిష్టర్ జరిగినవి పరిశీలించాల్సి ఉందన్నారు.ఈ మీడియా సమావేశంలో సిఐడి బృందం పాల్గొంది.

## వారం - వర్జ్యం

06-11-2025, గురువారం
శ్రీ విశ్వావసు నామ సంవత్సరం,
కార్తీకమాసం, దక్షిణాయణం
శరద్ ఋతువు, కృష్ణ పక్షం
పాడ్యమి మ.2.56, స్వాతి కార్తె
భరణి ఉ.6.34, కృత్తిక తె.3.28
వర్జ్యం : ఉ.10.35-1.23
దు.ఉ.9.57-10.43, 2) మ.2.33-3.19
రాహుకాలం - మ.1.30-3.00

## వార్తాఫలం

**మేషం:** కార్యాలయంలోని నూతన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తారు. అరుదైన ఆహ్వానాలు అందుకుంటారు.

**వృషభం:** మీ కృషిని, పట్టుదలను అందరూ మెచ్చుకుంటారు. శత్రువులు సైతం మిత్రులుగా మారి సాయం అందిస్తారు.

**మిథునం:** దానధర్మాల వంటి పుణ్యకార్యాచరణ పట్ల మక్కువ పెరుగుతుంది. నూతన కార్యక్రమాలకు శ్రీకారంచుడతారు.

**కర్కాటకం :** వ్యాపార విస్తరణకు తగినంత ఆర్థిక వనరులు సమకూరడం కష్టమవుతుంది. ఆరోగ్య విషయంలో మెలుకువ అవసరం.

**సింహం:** వృత్తి విషయంలో కొంత ఓర్పును పాటించుట అవసరమవుతుంది.ఆభరణాలు కొనుగోలుచేస్తారు. వాహన సౌఖ్యం కలదు.

**కన్య :** మధ్యవర్తిత్వానికి దూరంగా ఉండండి. సేవాకార్యక్రమాలలో పాల్గొంటారు.ప్రముఖుల నుండి ఆహ్వానాలు అందుకుంటారు.

**తుల :** సహోదర, సహోదరీ వర్గము కొన్ని కారణముల వలన దూరంగా ఉంటారు. ఆర్థిక పరిస్థితి సానుకూలంగా ఉండదు.

**వృశ్చికం:** సంతాన స్థిరత్వం, మానసిక ఆనందాన్ని కలిగిస్తుంది. వస్తు, వాహనాలు కొనుగోలుచేస్తారు. నూతన పరిచయాలు పెరుగుతాయి.

**ధనుస్సు:** ముఖ్యమైన వ్యవహారాలు సాఫీగా పూర్తి చేస్తారు. ఆస్తి తగాదాలు తీరి లబ్ధి పొందు తారు. బాధ్యతలు సమర్ధవంతంగా నెరవేరుస్తారు.

**మకరం:** అందరిలోనూ ప్రత్యేకంగా గుర్తింపు లభిస్తుంది.సభలలో పాల్గొంటారు.షేర్లు, భూముల క్రయ విక్రయాలలో లాభాలు పొందుతారు.

**కుంభం:** వాహనాలు, భూములు, స్థలాలు కొనుగోలు చేస్తారు. కొత్త కార్యక్రమాలు చేపట్టి సన్నిహితుల సాయంతో పూర్తిచేస్తారు.

**మీనం:** ఆస్తి వివాదాలు పరిష్కార మవుతాయి. మానసిక ప్రశాంత పొందుతారు. ఆరోగ్యంపట్ల మెలుకువ అవసరం.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

# సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో తనిఖీలు

>> కుండా కార్యాలయం గేట్లు మూసేశారు. సాధారణ తనిఖీల్లో భాగంగానే సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి విచ్చేసినట్లు ఎసిబి అధికారులు తెలిపారు. తమ పరిధిలోని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలను తనిఖీ చేస్తున్నామని ఎసిబి అధికారులు వివరించారు. అన్నమయ్య జిల్లా రాజంపేట సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంపై ఎసిబి అధికారులు దాడులుచేశారు. కార్యాలయం తలుపులు మూసేసి సిబ్బందిని అదుపులోకి తీసుకుని విచారించారు. కార్యాలయంలోనికి ఎవరినీ అనుమతించలేదు. సబ్ రిజిస్టర్ కార్యాలయంలో అవినీతికి పాల్పడుతున్నట్లు గత కొంతకాలంగా తీవ్ర అరోపణలు వినిపిస్తున్నాయి. దీంతో రంగంలోకి దిగిన ఎసిబి అధికారులు కార్యాలయంలో విస్తృత తనిఖీలు చేపట్టారు. అధికారుల సోదాలతో అప్రమత్తమైన డాక్యుమెంట్ రైటర్లు తమ షాపులకు తాళం వేసుకుని పరారయ్యారు. గతంలోనూ రాజంపేట సబ్ రిజిస్టర్ కార్యాలయంపై ఎసిబి అధికారులు దాడులు చేశారు. పల్నాడు జిల్లా నరసరావుపేట సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో ఎసిబి అధికారులు దాడులు నిర్వహించారు. సబ్ రిజిస్ట్రేషన్ కార్యాలయంలో ఎసిబి అధికారులు దస్తావేజుల తనిఖీలు చేపట్టారు. దీంతో సబ్ రిజిస్ట్రేషన్ వద్దనున్న నోటరీ, దస్తావేజుల రైటర్లు కార్యాలయాలు మూసివేశారు. నెల్లూరు స్టోన్‌హౌస్‌పేట సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంపై అనిశా అధికారులు ఆకస్మిక దాడులు నిర్వహించారు. కార్యాలయానికి తలుపులు వేసి పలు రికార్డులు పరిశీలించారు. ఆ సమయంలో సబ్ రిజిస్టర్ సెలవులో ఉన్నారు. కార్యాలయంలోని పలు కీలక ఫైళ్లు స్వాధీనం చేసుకున్నారు. అనిశా అధికారులు సిబ్బందిని పిలిచి పూర్తిస్థాయిలో విచారణ జరుపుతున్నారు.

**నెల్లూరు స్టోన్ హౌస్ పేట సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో ఎసిబి సోదాలు**



నెల్లూరు సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో తనిఖీలు చేస్తున్న ఎసిబి అధికారులు

నెల్లూరు నగరంలోని స్టోన్ హౌస్‌పేట సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో ఎసిబి డిఎస్పి రామకృష్ణుడు ఆధ్వర్యంలో సిబ్బంది బుధవారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా కార్యాలయంలో అనధికారిక వ్యక్తులు, స్టాంపు రైటర్లు హల్చల్ చేస్తుండడాన్ని ఎసిబి అధికారులు గుర్తించారు. ఈ తనిఖీలకు సంబంధించి ఎసిబి డిఎస్పి రామకృష్ణుడు మాట్లాడుతూ తమ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు రాష్ట్రవ్యాప్తంగా జరుగుతున్న తనిఖీల్లో భాగంగా స్టోన్ హౌస్ పేట కార్యాలయంలో సోదరుల నిర్వహించామనితెలిపారు. ఈ సబ్‌రిజిస్టర్ కార్యాలయంపై తరచూ ఫిర్యాదు అందుతున్నాయని పేర్కొన్నారు. తమ తనిఖీల్లో కార్యాలయం లోపల సంబంధం లేని వ్యక్తులు తిష్ట వేసి ఉండడాన్ని గుర్తించామని తెలిపారు. కార్యాలయ సబరిస్తారు ప్రస్తుతం సెలవులో ఉన్నారని, సోదాలు గురువారం కూడా కొనసాగుతాయని ఆయన స్పష్టం చేశారు. ఈ సోదాల్లో కార్యాలయం లోపల ఉన్న అనధికారిక వ్యక్తుల నుండి కొంత నగదు స్వాధీనం చేసుకున్నట్లు వెల్లడించారు. ఎంత నగదు స్వాధీనం చేసుకున్న విషయం ఆయన వెల్లడించలేదు. పూర్తి స్థాయిలో సోదాలు పూర్తయిన తర్వాత పూర్తి వివరాలు తెలుపుతానని డిఎస్పి తెలిపారు.

# పార్టీ లైన్ దాటితే చర్యలు

**-ఇక ప్రతి శుక్రవారం ప్రతి నియోజకవర్గంలో గ్రీవెన్స్ నిర్వహించాలి**

**- 15లోగా గ్రామ స్థాయి నుండి నియోజకవర్గ కమిటీల వరకు నియామకాలు పూర్తి కావాలి**

**- టిడిపి అధ్యక్షుడు పల్లా శ్రీనివాస్ రావు ఆదేశం**



టెలికాన్ఫరెన్స్‌లో టిడిపి అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు

**గుంటూరు-ప్రభాతవార్త ప్రతినిధి, నవంబర్ 5:** నియోజకవర్గాల్లో సరిగా గ్రీవెన్స్ నిర్వహించడం లేదని, నాయకులు ప్రజల సమస్యలు సరైన రీతిలో పరిష్కరించి ఉంటే మంత్రి లోకేష్ 'ప్రజాదర్బార్' కు 4వేల మంది ఎందుకు వస్తారు? అని నాయకులతో తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాస్ రావు మండిపడ్డారు. బుధవారం తెలుగుదేశం పార్టీ కేంద్ర కార్యాలయంలో పర్యటించిన ఆయన పార్టీ ముఖ్య నేతలతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా నేతలతో ఆయన మాట్లాడుతూ, పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ఆదేశాల మేరకు ఇకపై ప్రతి శుక్రవారం ప్రతి నియోజకవర్గంలో గ్రీవెన్స్ నిర్వహించాలని ఆదేశించారు. ఇక అదే రోజు స్థానిక నాయకులతో సమావేశం నిర్వహించి నియోజకవర్గంలో ఎటువంటి సమస్యలు లేకుండా చూసుకోవాలని కోరారు. నవంబర్ 15వ తేది లోపు నియోజకవర్గ కమిటీల నుంచి గ్రామ స్థాయి కమిటీల వరకు పార్టీ నియామకాలు పూర్తి చేయాలని డెడ్ లైన్ విధించారు. 15వ తేది లోపు పూర్తి చేయలేకపోతే జాతీయ అధ్యక్షుడు ఎదుట హాజరుకావాల్సి ఉంటుందని హెచ్చరించార తెలుగుదేశం పార్టీ అంటే ఒక సంస్క ృతి. క్రమశిక్షణకు మారు పేరు తెలుగుదేశం పార్టీ అని అన్నారు. కొందరి నాయకుల వలన పార్టీకి చెడ్డపేరు వస్తుందని, పార్టీ లైన్ దాటి వ్యవహరిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అటువంటి నాయకులు వారి ప్రవర్తన మార్చుకోవాలని, మరలా పునరావృతం అయితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రభుత్వ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్ళడంలో పార్టీ నాయకులు సఫలం కావాలి, దానికి తగ్గట్టు నియోజకవర్గాల్లో కార్యక్రమాల్లో నిర్వహిస్తూ.. క్యాడర్ ను కలుపుకుంటూ.. క్షేత్రస్థాయిలో పర్యటనలు చేయాలని సూచించారు. కూటమి నేతల మధ్య విభేదాలు సృష్టించేందుకు వైసీపీ ప్రయత్నిస్తుంది.. అందరూ సఖ్యతతో పనిచేయాలి.. సంయమనం పాటించండి.. సోషల్ మీడియాలో వైసీపీ చేస్తున్న దుష్ప్రచారాలను తిప్పికొట్టండంతో పాటు వైసీపీ దుష్ప్రచారాలకు ప్రజలు ప్రభావితం కాకుండా వాస్తవాలను ప్రజల్లోకి తీసుకెళ్ళాల్సిన బాధ్యత మీపై ఉందని గుర్తుచేశారు.

ప్రతి ఒక్కరూ క్రమశిక్షణతో పని చేయండని కోరారు. ఈ టెలికాన్ఫరెన్స్ లో టిడిపి ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, జిల్లా, జోనల్, పార్లమెంట్, నియోజకవర్గ ఇంచార్జులు, వివిధ కార్పొరేషన్ చైర్మన్లు, ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

# తిరుమల సమాచారం

## కార్తికపౌర్ణమి వేళ కపిలేశ్వరునికి అన్నాభిషేకం



**తిరుమల,నవంబర్ 5ప్రభాతవార్తప్రతినిధి:** టిటిడి ఆధ్వర్యంలోని తిరుపతిలోని శైవాలయం కపిలేశ్వరస్వామి ఆలయంలో కార్తీక పౌర్ణమి వేళ కపిలేశ్వరునికి అన్నాభిషేకం జరిగింది. ఉదయం 2గంటలకు సుప్రభాతంతో మేల్కొలిపి అనంతరం అభిషేకం, అర్చన నిర్వహించారు. బుధవారం మధ్యాహ్నం 12గంటల నుండి 4గంటల వరకు ఏకాంతంగా అన్నాభిషేకం, దీపారాధన చేపట్టారు. సాయంత్రం భక్తులకు అన్నలింగ దర్శనం కల్పించారు. మళ్లీ సాయంత్రం ఏకాంతంగా అన్నలింగ ఉద్వాసన చేశారు. రాత్రి 7.30గంటల నుండి 8.30గంటల వరకు సుగంధద్రవ్య అభిషేకం ఏకాంతంగా నిర్వహించడంతో కార్తీకపౌర్ణమి ముగిసింది. ఈ కార్యక్రమంలో ఆలయ డిప్యూటీ ఇఒ నాగరత్న, సూపరింటెండెంట్ చంద్రశేఖర్, అర్చకులు పాల్గొన్నారు.

## రేపు డయల్ యువర్ 'టిటిడి ఇఒ'



**తిరుమల,నవంబర్ 5 ప్రభాతవార్తప్రతినిధి:** తిరుమలకు వచ్చిన భక్తులకు వెంకన్న దర్శనంలోగానీ, వసతి కల్పనలో ఎదురైన అనుభవాలు, ఇబ్బందులు, తమతమ సూచనలు,సలహాలు తెలిపేందుకు 7వతేదీ శుక్రవారం తిరుమలలో "డయల్ యువర్ ఇఒ"కార్యక్రమం జరగనుంది. దేశవిదేశాల్లోని భక్తులు తమతమ ఫిర్యాదులు, సూచనలను శుక్రవారం ఉదయం 9నుంచి 10గంటల వరకు 0877-2263261 నంబర్లకు ఫోన్‌ద్వారా నేరుగా టిటిడి ఇఒ అనిల్‌కుమార్‌సింఘాల్‌తో మాట్లాడే అవకాశం కలుగుతుంది.

## గరుడసేవతో భక్తుల పులకింత



**తిరుమల,నవంబర్ 5ప్రభాతవార్తప్రతినిధి:** పవిత్రమైన కార్తీకమాసంలో కార్తీకపౌర్ణమి రోజు గరుడ్మంతునిపై గరుడాద్రివాసుడు ఆలయ మాఢవీదుల్లో ఊరేగిభక్తులను కటాక్షించాడు. బుధవారం రాత్రి అత్యంత విశిష్టమైన, పౌర్ణమి సందర్భంగా గరుడసేవ జరిగింది. ఏడుకొండల వేంకటేశ్వరస్వామి ఉత్సవమూర్తి మలయప్పస్వామికి సాయంత్రం నిత్యకైంకర్యాలు అనంతరం వాహనమండపం వద్దకు వేంచేపుచేశారు. స్వామివారు లక్ష్మీకాసులహారం, పచ్చలహారం, మరిన్ని అమూల్యమైన ఆభరణాలు ధరించారు. వాహనమండపం వద్ద ఆలయ అర్చకులు కర్పూర హారతులిచ్చి వాహనాన్ని బయలుదేరించారు. గరుడునిపై మలయప్ప ఆలయ మాఢవీధుల్లో ఊరేగి భక్తులను కటాక్షించారు. 108 వైష్ణవ దివ్యదేశాలలో గరుడసేవకు ఎంతో ప్రాధాన్యత ఉంది. తిరుమలలో జరిగే గరుడసేవరోజు భక్తులు ఇష్టదైవాన్ని దర్శించుకుంటే తమ పాపాలు నశిస్తాయని, కష్టాలు తొలగిపోతాయని ప్రశస్తి.ఈ వాహనసేవలో టిటిడి ఆలయ డిప్యూటీ ఇఒ లోకనాథం, సివిఎస్ఒ కెవి మురళీకృష్ణ, ఆలయ పేష్కార్ రామకృష్ణ, ఆలయ పారుపత్తేదార్ హిమత్‌గిరి ,అర్చకులు పాల్గొన్నారు.

## స్వామివారి ఆశీస్సులందుకున్నాం: ప్రముఖులు



**తిరుమల,నవంబర్ 5ప్రభాతవార్తప్రతినిధి:** కార్తీకపౌర్ణమి రోజు బుధవారం ఉదయం శ్రీవేంకటేశ్వరస్వామిని దర్శించుకోవడం మనస్సు ఆనందంగా ఉందని సినీప్రముఖులు తెలిపారు. బుధవారం ఉదయం విఐపి బ్రేక్‌లో కొరియోగ్రాఫర్ రాజు, సుందరం మాస్టర్‌తో కలసి ఆలయంలోనికి చేరుకుని స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ అధికారులు తీర్థప్రసాదాలు అందజేశారు.



## విఆర్వోలకు సీనియర్ అసిస్టెంట్ ప్రమోషన్లు కల్పించాలి

**విజయవాడ, ప్రభాతవార్త నవంబర్ 5:** విఆర్వోలకు సీనియర్ అసిస్టెంట్ ప్రమోషన్లు కల్పించాలని ఏపి విఆర్ఓ అసోసియేషన్ రాష్ట్రాధ్యక్షుడు భూపతిరాజు రవీంద్ర రాజు రాష్ట్ర రెవిన్యూ స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్‌ని కోరారు. ఒకే క్యాడర్లో 17 సంవత్సరాలుగా సర్వీస్ చేస్తూన్న విఆర్వోలకు 15 సంవత్సరాలు సర్వీస్ పూర్తి చేసుకున్న వారికి డిప్యూటీ తాహసిల్దార్ పే స్కేల్ ఇవ్వాలని, 10 సంవత్సరాలు సర్వీస్ పూర్తి చేసుకున్న వారికి సీనియర్ అసిస్టెంట్ పే స్కేల్ కల్పించాలని, 5 సంవత్సరాలు సర్వీస్ పూర్తి చేసుకున్న వారికి జూనియర్ అసిస్టెంట్ పే స్కేల్ కల్పించాలని కోరారు. కార్యక్రమంలో అసోసియేషన్ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు రాటకొండ శ్రీనివాస్, రాష్ట్ర ఉపాధ్యక్షులు మిరియాల లక్ష్మీ మ్నారాయణ లతో కలిసి రెవిన్యూ శాఖ మంత్రిని శాలువ తో సత్కరించి భీమవరం మావుళ్ళమ్మ మెమెంటో అందించారు.

### జగన్ పర్యటనలో నిబంధనల ఉల్లంఘున వైసీపీ మాజీ ఎంఎల్ఏ,నేతలపై కేసు

**విజయవాడ,నవంబరు 5,ప్రభాతవార్తప్రతినిధి:** పామర్రు మాజీ ఎంఎల్ఏ కైలే అనిల్‌కుమార్ పలువురు వైసీపీ నేతలపై కృష్ణాజిల్లా పమిడిముక్కల పోలీసులు కేసు నమోదు చేశారు. మంగళవారం జరిగిన వైకాపా అధ్యక్షుడు జగన్ పర్యటనలో వీరంతా పోలీసు నిబంధనలను అతిక్రమించారని,విధులకు ఆటంకం కల్గించారని అందులో పేర్కొన్నారు. పమిడిముక్కల మండలం,గోపువానిపాలెం వద్ద హైవేపై ట్రాఫిక్‌కు ఇబ్బంది కల్గించవద్దని సిఐ చిట్టిబాబు మంగళవారం వైకాపా నేతలను కోరారు. ఈ క్రమంలో తమ ఇష్టంమటూ అనిల్,ఇతర వైకాపా నేతలు,పోలీసులతో వాగ్వాదానికి దిగారు. దీంతో వారిపై బుధవారం కేసు నమోదు చేశారు. డ్రోన్ విజువల్స్ ద్వారా గుర్తించి మిగిలిన వారిపైనా కేసులు పెడతామని సిఐ చిట్టిబాబు తెలిపారు.

## మూడు దశల్లో 175 ఎంఎస్ఎంఇ పార్కుల అభివృద్ధి

**- ప్రైవేటు భాగస్వామ్యంతో 53 పార్కులు - మౌలిక వసతుల కల్పనకు హడ్కో రుణం**

**విజయవాడ,నవంబరు 5,ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్రం లోని 175 నియోజక వర్గాల్లో దశల వారీగా ఎంఎస్ఎంఈ పార్కులు/ప్లాటెడ్ ఫ్యాక్టరీ కాంప్లెక్స్‌లను అభివృద్ధి చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది.,యువతకు,మహిళలకు విస్తారంగా స్వయం ఉపాధి కల్పన.ఉత్పత్తులకు మార్కెటింగ్ తదితరంశాల్లో ప్రోత్సాహించే దిశలో ప్రభుత్వం దశల వారిగా ఈ పార్కులు ఏర్పాటు చేస్తుంది.మొదటి దశలో 56 పార్కులను అభివృద్ధి చేస్తోంది. మిగిలిన వాటి అభివృద్ధికి అందుబాటులో ఉన్న ప్రభుత్వ భూములను గుర్తించి ఏపీఐఐసీకి అప్పగించాలని ప్రభుత్వం ఆదేశించింది. అవసరమైన చోట ప్రైవేటు భూములను కూడా సేకరించాలని కలెక్టర్లను కోరింది. మొత్తం 175 పార్కుల్లో కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాల నిధులతో 122,ప్రైవేటు భాగస్వామ్యంతో 53 పార్కులను అభివృద్ధి చేయాలని నిర్ణయించింది. ఇక్కడ మౌలిక సదుపాయాల కల్పనకు అవసరమైన నిధులను రుణంగా తీసుకునేందుకు ఏపీఐఐసీకి ప్రభుత్వం అనుమతించింది. మొదటి దశలో 56 పార్కులను ప్రభుత్వం అభివృద్ధి చేస్తోంది. ఇందులో 11 పార్కులను ముఖ్యమంత్రి ప్రారంభించారు. 39 పార్కులకు ఆయన శంఖుస్థాపన చేశారు. మూడు నియోజక వర్గాల్లో ఇప్పటికే ఎంఎస్ఎంఈలకు ప్రత్యేక పార్కులు ఉన్నాయి. మూడు చోట్ల మౌలిక సదుపాయాలను కల్పించింది. మిగిలిన పార్కుల అభివృద్ధికి అవసరమైన భూములను సేకరించడంతో పాటు ప్రైవేటు భాగస్వామ్యంతో అభివృద్ధి చేసే పార్కులకు ప్రోత్సాహకాలు అందిస్తుంది.మిగిలిన 119 పార్కులను రెండు దశల్లో అభివృద్ధి చేస్తారు. వీటిలో 102 పార్కులకు అవసరమైన భూములకు సంబంధించి వివిధ జిల్లాల కలెక్టర్ల నుంచి ప్రతిపాదనలు ప్రభుత్వానికి అందాయి. 66 చోట్ల మాత్రమే భూములు ఎంఎస్ఎంఈ పార్కుల ఏర్పాటుకు అనువైనవిగా ఉన్నట్లు పరిశ్రమల శాఖ అధికారులు భావిస్తున్నారు. పూర్తిగా ప్రభుత్వ భూములు అందుబాటులో ఉన్న 25 పార్కులను రెండో దశలో పూర్తి చేస్తారు.సాధ్యమైనంత త్వరగా భూసేకరణ పూర్తి చేసి, మూడో దశలో పార్కులను అభివృద్ధి చేయాలని ప్రభుత్వం భావిస్తోంది.ప్రైవేటు పార్కుల విధానం కింద 3 పార్కులను అభివృద్ధి చేసేందుకు అధికారులు అనుమతించారు. 14 పార్కుల కోసం భూములను గుర్తించాల్సి ఉంది.మౌలిక సదుపాయాలు కల్పించే బాధ్యత ఏపీఐఐసీ అప్పగించింది., ఏర్పాటుకు అవసరమైన భూములు సేకరించడంతో పాటు, వాటిలో మౌలిక సదుపాయాలను ఏపీఐఐసీ కల్పిస్తోంది. ఎంఎస్ఎంఈ పారిశ్రామిక పార్కుల్లో మౌలిక సదుపాయాల కల్పన, భూసేకరణకు హడ్కో నుంచి రూ.5వేల కోట్ల రుణం తీసుకునేందుకు ఏపీఐఐసీకి ప్రభుత్వం అనుమతించింది. ఈ మేరకు రుణాన్ని ఇచ్చేందుకు హడ్కో కూడా అంగీకరించింది.

## పిఎంజెవికె పనుల కోసం రూ.203.69కోట్లు విడుదల

**- రాష్ట్రంలో మైనార్టీల వికాసానికి 'జన్ వికాస్' ద్వారా విస్తృత మౌలిక వసతులు**

**- రాష్ట్ర న్యాయ,మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్ వెల్లడి**



సచివాలయంలోని మంత్రి పేషి వివరాలు వెల్లడిస్తున్న ఎన్ఎండి ఫరూక్

**సచివాలయం,నవంబర్ 5,ప్రభాతవార్త :** రాష్ట్రంలో ప్రధానమంత్రి జన్ వికాస్ కార్యక్రమం (పిఎంజెవికె) ద్వారా మైనార్టీల సంక్షేమ,అభివృద్ధి కార్యక్రమాల పనుల కోసం రూ.203.69 కోట్లు మొత్తాన్ని కూటమి ప్రభుత్వం విడుదల చేసిందని రాష్ట్ర న్యాయ మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్ బుధవారం అమరావతిలో విడుదల చేసిన ప్రకటనలో వెల్లడించారు.రాష్ట్ర బడ్జెట్ 2025-26ఆర్థిక సంవత్సరానికి సంబంధించి మైనార్టీ సంక్షేమం కోసం కేటాయించిన బడ్జెట్‌లో పిఎంజేవికే కింద రూపొందించిన పనులు,అభివృద్ధి ప్రణాళిక,ఆర్థిక తోడ్పాటు తదితర వాటి పూర్తిగా రూ.203.69కోట్లు మొత్తాన్ని ప్రభుత్వం విడుదల చేస్తూ ఉత్తర్వులు కూడా జారీ చేసిందని మంత్రి పేర్కొన్నారు.మైనార్టీలు ఎక్కువగా ఉండే ప్రాంతాల అభివృద్ధి,సమస్యలను పరిష్కరించడానికి కేంద్రం నేతృత్వంలో,రాష్ట్రాల భాగస్వామ్యంతో పిఎంజేవికే పథకానిన అత్యంత పటిష్టంగా,పారదర్శకంగా అమలు చేస్తుందని తెలిపారు.రాష్ట్రంలో మైనార్టీల సంక్షేమానికి సీఎం నారా చంద్రబాబు నాయుడు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యత ఇవ్వడంతోపాటు,కేంద్ర మైనార్టీ పథకాలను కూడా సమర్థవంతంగా వినియోగించుకోవడం ద్వారా మైనార్టీ వరా ్గల సంక్షేమానికి కార్యాచరణ బద్ధంగా ముందుకు సాగుతున్నట్లు మంత్రి ఫరూక్ వెల్లడించారు.కేంద్రం నిధులను సమర్థవంతంగా వినియోగించుకునేందుకు సమన్వయంతో ముందుకు సాగడంలో భాగంగానే 2025-26ఆర్థిక సంవత్సరాలో పీఎంజేవికే పనుల కోసం నిధులు విడుదల చేయడంతో విస్తృత మౌలిక వసతుల కల్పనకు అవకాశం కలుగుతుందని మైనార్టీ మంత్రి ఎన్ఎండి ఫరూక్ తెలిపారు.

## రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి కోసం ఎఐ పోర్టల్

**విజయవాడ,డిసెంబరు 5,ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్రం లోని యువతకు నైపుణ్యాభివృద్ధి కోసం ఏఐ పోర్టల్‌ను రాష్ట్ర ప్రభుత్వం తీసుకొస్తోంది. దేశం లోనే తొలి ఏఐ టెక్నాలజీ ఆధారిత పోర్టల్‌గా ఇది నిలవనుంది. 'నైపుణ్యం' పేరిట అందుబాటులోకి రానున్న ఈ పోర్టల్ రాష్ట్రంలో యువతకు నైపుణ్యం శిక్షణ,ఉపాధి కల్పించేందుకు వేదిక కానుంది. అభ్యర్థుల సామర్థ్యాలను అంచనా వేసేందుకు కృత్తిమ మేధతో ఇంటర్వ్యూను ప్రవేశపెడుతోంది. ప్లంబర్ నుంచి బీటెక్ టెక్నాలజీ విద్య వరకు ప్రతి అభ్యర్థి సామర్థ్యాన్ని పోర్టల్ లోని ఏఐ అంచనా వేస్తుంది. నిరుద్యోగులు తమ అర్హతలతో ఏఐని వినియోగించి రెజ్యూమ్‌ను సైతం ఇందులో తయారు చేసుకోవచ్చు. నవంబరు 14,15 తేదీల్లో విశాఖలో జరుగనున్న సీఐఐ భాగస్వామ్య సదస్సులో ఈ పోర్టల్‌ను ఆవిష్కరించనున్నారు. కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాల వద్ద నున్న అన్ని రకాల డేటాను ఈ పోర్టల్‌తో అనుసంధానం చేస్తున్నారు. కేంద్ర ప్రభుత్వ 'ఈ-శ్రమ్,ఆధార్,డిజి లాకర్,ఈపీఎఫ్, ఆదాయ పన్ను చెల్లింపుదారుల వివరాలను పోర్టల్‌కు అనుసంధానించనున్నారు. అంటే వీటి ద్వారా ఎవరైనా ఇప్పటికే ఉద్యోగంలో ఉంటే ఆ వివరాలు కూడా తెలుస్తాయి. రాష్ట్ర ప్రభుత్వం వద్ద నున్న పాఠశాల స్థాయి నుంచి ఉన్నత స్థాయి విద్య వరకు ఉన్న వివిధ విభాగాల డేటాను అనుసంధానిస్తారు. ఆర్థికశాఖ వద్ద నున్న ఉద్యోగుల డేటాను లింక్ చేస్తారు.

## రామచంద్రపురంలో బాలిక హత్యా? ఆత్మహత్యా? దర్యాప్తు ప్రారంభించిన ఎస్పీ

**ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాబ్యూరో, నవంబర్ 5, (ప్రభాతవార్త):** కోనసీమ జిల్లా రామచంద్రపురం లోని ప్రైవేటు పాఠశాలలో ఐదవ తరగతి చదువుతున్న చిర్రా రంజిత (10) ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరి వేసుకొని వెంకటజీవిగా పడి ఉన్నది. పాఠశాల నుంచి ఇంటికి రాగానే తల్లికి ఫోన్ చేయగా నేను త్వరగా వస్తాను నువ్వు ఇంట్లో ఉండు అని తల్లి చెప్పగా సరేనని బదిలిచ్చినది.అనంతరం తల్లి సునీత ఇంటికి వచ్చి తలుపులు ఎంతసేపటికి తీయకపోవడంతో బద్దలు కొట్టి చూడగా ఫ్యాన్ కి ఉరి వేసుకుని వేలాడుతూ కనిపించడంతో స్థానికుల సహాయంతో ముళ్ళు ఇప్పడానికి ప్రయత్నించగా అవి చాలా కష్టతరంగా ఉండటంతో, తన కూతురిది ఆత్మహత్య కాదని హత్య అని వాపోయింది. మూడు సంవత్సరాల నుంచి అద్దె ఇంట్లో ఉండడంతో ఇంటి యజమాని కుమారుడు జాకీర్ హుస్సేన్ పై తల్లిదండ్రులు అనుమానం వ్యక్తం చేశారు. ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు హుస్సేన్ అదుపులో తీసుకుని విచారణ చేపట్టారు. పోస్టుమార్టం అనంతరం న్యాయం చేయాలన్నారు.

## కారు సహా 5 ఎర్రచందనం దుంగలు స్వాధీనం

**- తమిళ స్మగ్లర్ అరెస్టు**

**యర్రావారిపాలెం, నవంబర్ 5 ప్రభాతవార్త:** కారుతో సహా 5 ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకుని ఒక స్మగ్లర్‌ను అరెస్టు చేసినట్లు చిత్తూరు జిల్లా భాకరాపేట రేంజ్ అటవీక్షేత్రాధికారి ఎన్. వెంకటరమణ తెలిపారు. ఎర్రచందనం కించ ప్రాంతం నుండి యల్లమంద మీదుగా వేలూరుకు ఎర్రచందనం అక్రమ రవాణా అవుతోందని అందిన రహస్య సమాచారం మేరకు భాకరాపేట రేంజ్ అటవీ సిబ్బందితో కలసి ఉస్తికాయల పెంట బీట్ పరిధిలోని యల్లమంద వద్ద అదుపులోకి తీసుకోవడం జరిగిందన్నారు. తీసుకొని అందులోని తమిళనాడు రాష్ట్రం వేలూరుకు చెందిన అజిత్ కుమార్ మురళి అను స్మగ్లర్ ను అరెస్టు చేయడం జరిగిందన్నారు. కారు తో సహా 5 ఎర్రచందనం దుంగలు అదుపులోకి తీసుకోవడం జరిగింది అన్నారు. కారు ఎర్రచందనం తో సహా వాటి విలువ సుమారు 5 లక్షలు ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎఫ్‌బిఓ లు వై.రాజేష్ కుమార్, ఎం. సదాశివయ్య, సి. ప్రదీప్ చంద్, సి.రవి, జె.బి. నిఖిల్, డ్రైవర్ లు హెచ్. శంకర్, ఎన్. రోహిత్, ప్రొటెక్షన్ వాచర్లు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో కేసన శంకరరావు, బిసి నేతలు

## బిసిల రిజర్వేషన్లను చట్టబద్ధంగా అమలు చేయాలి

**రాష్ట్ర బిసి సంక్షేమ సంఘం అధ్యక్షుడు కేసన శంకరరావు**

**గుంటూరు విద్య, నవంబర్ 5, ప్రభాతవార్త:** రాష్ట్రవ్యాప్తంగా జనగణనతో పాటు సమగ్ర కుల గణనను శాస్త్రీయంగా నిర్వహించి, ఆపై జనాభా దామాషా మేరకు బీసీల రిజర్వేషన్లను చట్టబద్ధంగా అమలు చేయాలని ఆంధ్రప్రదేశ్ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు కేసన శంకరరావు కోరారు. స్థానిక గుంటూరు చుట్టగుంట లోని రాష్ట్ర కార్యాలయంలో జరిగిన మీడియా సమావేశం లో ఆ మేరకు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈనెల9 న విజయవాడ రాఘవయ్య పార్కు ఎదురుగా ఉన్న మాకినేని బసవపున్నయ్య విజ్ఞాన కేంద్రం లో ఉదయం 10 గంటల నుండి జరుగు రాష్ట్రస్థాయి విస్తృత సమావేశం,బీసీల అన్ని సమస్యలపై సమగ్రంగా చర్చిస్తుందన్నారు. కూటమి ప్రభుత్వ ఎన్నికల వాగ్దానాలైన ..చట్టసభల్లో 33 శాతం, స్థానిక సంస్థలలో 34 శాతం రిజర్వేషన్లు అమలు జరపాలన్నా,ముందుగా కుల గణన చేయడం తప్పనిసరన్నారు. బీసీలలో ఏఏ కులాలవారు ఎంతెంత మంది ఉన్నా రో తెలియకుండా,ఎవరికి ఎంతని రిజర్వేషన్లు అమలు చేయాలో తెలియదన్నారు. న్యాయ రాజ్యాంగపర ఆటంకాలు రాకుండా, డెడికేటెడ్ కమిషన్ ద్వారా సరైన ఏంపరికల్ డేటా తో సమగ్ర కుల గణన జరగాలన్నారు. బీసీ రిజర్వేషన్ల లో కూడా అన్ని సామాజిక వర్గాలకు సమన్యాయం జరగాలంటే ఏబిసిడిలుగా వర్గీకరించాల్సి ఉందన్నారు. సుప్రీం కోర్టు 50 శాతం పరిమితిని అధిగమించేలా మరో చట్టం చేయాల్సి ఉందన్నారు. అందుకు పార్లమెంటుచే రాజ్యాంగ సవరణలు చేయించి,బీసీ రిజర్వేషన్లను రాజ్యాంగం షెడ్యూల్9 లో పెట్టించాలన్నారు. 2026 మార్చి కల్లా స్థానిక సంస్థల ఎన్నికల గడువు ముగుస్తున్నందున ఆరు నెలలు అటు ఇటుగా ఎన్నికలు నిర్వహించుకునే వెసులుబాటు ఉన్నందున,ఈ మొత్తం ప్రక్రియను త్వరితగతన పూర్తి చేసి,స్థానిక సంస్థలలో బీసీలకు చట్టబద్ధ రిజర్వేషన్లు అమలు జరపాలన్నారు.

## ఎపిఎస్పీడిసిఎల్ ఆధ్వర్యంలో ఇ-వి చార్జింగ్ స్టేషన్లు: సిఎండి శివశంకర్ లోతేటి



**తిరుపతిరూరల్, నవంబర్ 5 ప్రభాతవార్త:** కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల ఆదేశాలకు అనుగుణంగా జాతీయ రహదారుల వెంట ఎలక్ట్రిక్ వెహికల్ (ఈ-వి) చార్జింగ్ స్టేషన్లను ఏర్పాటు చేసే అంశాన్ని ఏపిఎస్పీడిసిఎల్ పరిశీలిస్తున్నట్లు ఆ సంస్థ చైర్మెన్ మేనేజింగ్ డైరెక్టర్ శివశంకర్ లోతేటి తెలిపారు. బుధవారం తిరుపతి వున్న ఏపిఎస్పీడిసిఎల్ కార్పొరేట్ కార్యాలయంలో నుండి డైరెక్టర్లు ఆయూబ్‌ఖాన్, కె.గురవయ్య, కె,రామమోహన్ రావులతో కలిసి 9జిల్లాల సూపరింటెండింగ్ ఇంజనీర్లతో టెలికాన్ఫరేన్స్ నిర్వహించారు. ఈ కాన్ఫరేన్స్‌లో సిఎండి మాట్లాడుతూ 'సంస్థ పరిధిలోని 9జిల్లాల్లో జాతీయ రహదారి పక్కనున్న సబ్ స్టేషన్ల ప్రాంగణాల్లో ఈ-వి చార్జింగ్ స్టేషన్లకు అనువైన ప్రాంతాలను గుర్తించాలన్నారు. ఇప్పటికే ఉన్న చార్జింగ్ స్టేషన్లను పరిశీలించి, వాటి పనితీరును అధ్యయనం చేయాలని సూచించారు. సబ్ స్టేషన్లతో పాటు ప్రభుత్వ భూములు, ఆసుపత్రులు తదితర ప్రాంతాలను కూడా పరిగణలోకి తీసుకోవాలని ఆదేశించారు. ఈ అంశంపై వారంలోగా సమగ్ర నివేదిక సమర్పించాలని ఎస్ఈలకు ఆదేశాలు జారీ చేసారు. ఏపిఎస్పీడిసిఎల్ సంస్థ పరిధిలోని 9జి ల్లా ల్లో ఒక్కో జిల్లాలో 100మంది విద్యుత్ ఉద్యోగుల గృహాల్లో ప్రయోగాత్మకంగా ప్రీ-పెయిడ్ స్మార్ట్ మీటర్లు అమర్చే ప్రణాళిక ఉందన్నారు. ఈ-వాలెట్ రీచార్జ్ ప్రక్రియ, ఎస్ఎంఎస్ అలర్టులు వంటి అంశాలను పరిశీలించి, పూర్తిస్థాయిలో నమ్మకం కలిగిన తర్వాతే వినియోగదారులకు అమలు చేయాలని ఆయన సూచించారు. అలాగే 11కెవి ఫీడర్లకు స్మార్ట్ మీటర్ల అమర్చే కార్యక్రమాన్ని వేగవంతం చేయాలని, డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్‌ఫార్మర్లకు మీటర్ల వ్యవస్థాపనను సకాలంలో పూర్తి చేయాలని సిఎండి ఆదేశించారు.ఈ కార్యక్రమంలో చీఫ్ జనరల్ మేనేజర్ జె.రమణాదేవి, సూపరింటెండింగ్ ఇంజనీర్లు చంద్రశేఖర్‌రావు, ఇస్మాయిల్ అహ్మద్, రాఘవేంద్ర, శేషాద్రి శేఖర్, రమణ, ప్రదీప్‌కుమార్, సుధాకర్, సంపత్ కుమార్, ఈశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## విధి నిర్వహణలో అలసత్వం వహిస్తే కఠిన చర్యలు

**ముఖేష్ కుమార్ మీనా**

**విజయవాడ నవంబరు 5, ప్రభాతవార్తప్రతినిధి:** విధి నిర్వహణలో అలసత్వాన్ని ప్రదర్శించే వారిపై కఠిన చర్యలకు వెనుకాడబోమని ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి (సాధారణ పరిపాలన రాజకీయం, అబ్కారీ, గనులు ) ముఖేష్ కుమార్ మీనా హెచ్చరించారు. ప్రభుత్వ ప్రతిష్ఠకు భంగం కలిగించే విధంగా నిర్ణయాలు తీసుకోవడం సరికాదన్నారు. మంగళగిరి అబ్కారీ కమీషనర్ కార్యాలయంలో బుధవారం ఆయా జిల్లాల అబ్కారీ అధికారులు, అసిస్టెంట్, డిప్యూటీ కమిషనర్ల తో రాష్ట్ర స్థాయి విస్తృత సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మీనా మాట్లాడుతూ ములకల చెరువు వంటి సంఘటనలు పునరావృతం కాకుండా చూడాలని ఆదేశించారు. నేరం జరిగిన సందర్భంలో పాటించాల్సిన సాధారణ ప్రోటోకాల్ ను అనుసరించక పోవడం పట్ల తీవ్ర ఆగ్రహం వ్యక్తంచేశారు. ఇకపై రాష్ట్ర స్థాయిలో అబ్కారీ కమీషనర్, ఎన్ఫోర్స్మెంట్ డైరెక్టర్ లు 15 రోజులకు ఒకసారి, ముఖ్య కార్యదర్శిగా తాను నెలకు ఒకసారి అన్ని విషయాలపై సమీక్ష నిర్వహిస్తామన్నారు. అబ్కారీ శాఖలో వ్యవస్థీకృత అవినీతి కథనాలు వస్తున్నాయని, ఏ ఒక్కరు అక్రమార్జనకు పాల్పడినా తీవ్ర పరిణామాలు ఎదుర్కొవలసి వస్తుందని హెచ్చరించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఈ వ్యవహారాలలో కఠినంగా వ్యవహరించాలని ఆదేశించారని చెప్పారు. అబ్కారీ శాఖ పనితీరును మరింత మెరుగు పర్చుకునే స్ధితిలో పని తీరు ఉండాలన్నారు.అబ్కారీశాఖ సంచాలకులు చామకూరి శ్రీధర్ మాట్లాడుతూ వాస్తవ ఉత్పత్తి సామర్ధ్యం కల్లు విక్రయాల పరిణామాలను తరచు గమనిస్తూ ఉండటం తప్పని సరి అన్నారు. అధికారులు దేవ కుమార్, అనసూయదేవి,నాగ లక్ష్మీ,అరుణరావు, ఎస్టీ చంద్రశేఖర నాయుడు తదితరులు పాల్గొన్నారు.

వార్త

కోపంగా ఉన్నప్పుడు నీవు ఏ పనీ చేయొద్దు.
అప్పుడు అన్నీ పొరపాట్లే చేస్తావు.

-బల్తజాన్

# ట్రంప్ జాతకం తలకిందులు!

అమెరికాలో రాష్ట్రాల గవర్నర్ల ఎన్నికల్లోట్రంప్ పార్టీ రిపబ్లికన్ అభ్యర్థులు కట్టకట్టుకొనిఓటమి పాలయ్యారు. డెమొక్రటిక్ పార్టీ అభ్యర్థులు గెలిచి విజయకేతనం ఎగురవేశారు. ఆనాడు ట్రంప్ శ్వేతసౌధంలో అడుగుపెట్టిన నాటి నుంచి తీసుకున్న నిర్ణయాలు చాలా సందర్భాల్లో ఎదురొచ్చాయి. చాలా నిర్ణయాలను అమెరికన్లే వ్యతిరేకించారు. కళ్లకు కనపడిన వారందరినీ హెచ్చరికలు చేసి భయభ్రాంతులను చేయడం, విచక్షణ లేని వాగాడంబరం ఆయన్ని పరాజయం అంచున నిలబెట్టింది. మంచి నిర్ణయాలు తీసుకున్నారని జనం భావిస్తే వాటికి తుది ఆమోదముద్రగా ముందున్న ఎన్నికల్లో ప్రజలు అభినందన పూర్వకంగా ఓట్లిచ్చి ఆయా పార్టీల అభ్యర్థులను ఆదరించేవారు. లేకంటే తిరస్కరించడం మామూలే. గవర్నర్, మేయర్ ఎన్నికల్లో రిపబ్లికన్ పార్టీ అభ్యర్థులు ఓడిపోయారు. అమెరికా ఉపాధ్యక్షుడు జెడివాన్స్ బంధువు ఒకరు సిన్సినాటి మేయర్ ఎన్నికల్లో ఓటమి చవిచూశారు. వివిధ రాష్ట్రాల్లో ట్రంప్ వ్యతిరేకులపైనే జనం మొగ్గు చూపారని అర్థమౌతోంది. అమెరికాలో ఎన్నికల్లో ఎదురుపడేవి రెండే రెండు పార్టీలు. ఒకరు ఓడితే మరొకరు నెగ్గినట్లే.ఎప్పుడూ ఇవే అంచనాలుప్రాతిపదికగా జనంలో అభిప్రాయాలు ఏర్పడుతాయి. ఈసారి ఎన్నికల్లో మాత్రం ట్రంప్ పార్టీ అభ్యర్థులకు అపజయం తప్పదనే విషయం మీడియా ముందుగానే అంచనావేసింది. అందుకే వీలుగానే విశ్లేషణలను వెలువరించింది.కాగా బ్యాలెట్ పేపర్లపై తన పేరు లేకపోవడం వల్లనే రిపబ్లికన్ అభ్యర్థులంతా ఓటమి పాలయ్యారని ట్రంప్ చెప్పుకోవడం విడ్డూరంగా ఉంది. ఎన్నికల్లో గెలుపోటములు ఎలా ఉంటాయో చెప్పలేకపోయినా వాటి పర్యవసానాలు ఏమి సూచిస్తున్నాయో విశ్లేషించడం తేలిక. ప్రపంచవ్యాప్తంగా అన్ని దేశాలపై కక్షకార్పణ్యాలున్నట్లు ఈర్ష్యాసూయలతో ట్రంప్ వరుసగా ఒక పద్ధతి లేకుండా సుంకాలు విధిస్తూ లొంగి వచ్చిన వారికి సుంకాలు తగ్గిస్తూ, రాని వారికి రాలేని వారికి సుంకాలు పెంచుతూ తీసుకున్న నిర్ణయాలు విమర్శలకు గురయ్యారు. ఏదో మిశ్రమ స్పందన అయి ఉంటే కొన్నిసీట్లేనా రిపబ్లికన్ పార్టీ గెలిచి ఉండేది. కానీ ఒక్కటంటే ఒక చోట కూడా గెలిచిన సందర్భం లేదు. ప్రధానంగా అమెరికా అధ్యక్షుడి హోదాలో భారత దేశం మీద కాలుదువ్వడం అక్కడున్న భారతీయులెవరికీ రుచించలేదు.పైగా రష్యా నుంచి చమురు కొనుగోలు చేయకూడదని ఆంక్షలు, ట్రేడ్ డీల్ కుదరకపోతే ఇక చూస్కో! అనే గంతులు భారతీయేతరులకు కూడా నచ్చలేదు.కేవలం యేడాది పాలనలోనే ట్రంప్‌పై తీవ్ర వ్యతిరేకతలు ఉండబట్టే రిపబ్లికన్ పార్టీ అభ్యర్థులకు తగినన్ని ఓట్లు పడలేదు. ఒకసారి గెలిపించి అత్యున్నత స్థానానికి పంపిన వారు, తమకు, తమ మనుగడకు ఏమాత్రం ఇబ్బంది అవుతోందన్నా వేచి చూసి అనంతర ఎన్నికల్లో ఓటర్లు చాచికొడతారన్న ఎన్నికలతత్త్వం ట్రంప్‌కుబోధపడినట్లు లేదు. ప్రధానంగా ఈ ఎన్నికల్లో న్యూయార్క్ ఎన్నికలలో భారీ ఓటింగ్ నమోదైంది. సుమారు రెండు మిలియన్లకుపైగా నగర ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు.న్యూయార్క్ నగర తొలి ముస్లిం మేయర్‌గా భారతీయ మూలాలున్న జోహ్రాన్ హమ్దానీ (34) చారిత్రక విజయం సాధించారు. ఆయన బాలీవుడ్ ఫిల్మ్ మేకర్ మీరానాయర్ కుమారుడు.వామపక్ష అభిలాషలున్న వ్యక్తి. ఉచిత బస్సు ప్రయాణం,ఉచిత విద్య వంటి భరోసా ఇవ్వడం వలనే గెలిచి ఉండొచ్చునని విశ్లేషకుల అంచనా. టారిఫ్‌లపై ఫెడరల్ చట్టాల్ని ఉల్లంఘించారన్న ఆరోపణలతో ట్రంప్ నిర్ణయాలపైదాదాపు 50 కేసులు నమోదయ్యాయి. పైగా షట్‌డౌన్ కూడా ట్రంప్ అనుకూల అభ్యర్థుల ఓటమికి కారణం. ఈ విషయాన్ని ట్రంప్ కూడా అంగీకరించారు. నిజానికి అమెరికా చట్టసభ సభ్యులు మధ్య కీలక బిల్లులపై సయోధ్య కుదరకపోవడంతో 36 రోజులుగా 'షట్‌డౌన్' కొనసాగుతోంది.ఇదికూడా అమెరికా రాజకీయాల్లోనేకాదు ప్రజల్లో కూడా చర్చనీయాంశమైంది. ఇలాంటి షట్‌డౌన్ కారణంగా అమెరికా వ్యవస్థ బలహీనమైందనే ఆరోపణలు ప్రజల్నించి వినవస్తున్నాయి. గతంలో ట్రంప్ రాజ్యమేలినప్పుడు కూడా 35 రోజుల పాటు సుదీర్ఘ షట్‌డౌన్ కన్నా ఈసారి మరికొన్ని రోజులు కొనసాగే అవకాశాలు కనపడుతున్నాయి. రేపెపుడో ట్రంప్ దిగివచ్చినా జరిగిన నష్టాన్ని కూడగట్టడం సాధ్యం కాదు. ఇంతవరకు జరిగిన షట్‌డౌన్ కాలంలో 90వేల కోట్ల రూపాయల ఆర్థిక నష్టం జరిగిందని కాంగ్రెషనల్ బడ్జెట్ ఆఫీసు లెక్క తేల్చింది. హైదరాబాద్ మూలాలున్న భారతీయ సంతతి నేత గజాలా హాష్మీ వర్జీనియా రాష్ట్ర లెఫ్టినెంట్ గవర్నర్‌గా ఎన్నికయ్యారు. అమెరికాలో షట్‌డౌన్ కారణంగా ఆహార సంక్షోభం తలెత్తింది. ఫెడరల్ ప్రభుత్వం నుంచి అందాల్సిన ఆహార సహాయంఅందడం లేదు. ఇంత జరుగుతున్నా ట్రంప్ కిమ్మన్నాస్తిగా ఉండిపోయారు. ప్రధానంగా వాణిజ్య రాజధానిగా చెప్పబడే న్యూయార్క్‌పై తీవ్ర ప్రభావం పడడంతో ఆ రాష్ట్రం స్టేట్ ఆఫ్ ఎమర్జెన్సీగా ప్రకటించుకుంది. అమెరికాలో కోట్లాది మంది అల్పాదాయ కుటుంబాలపై ప్రతికూల ప్రభావం చూపుతోంది.ఇలాంటి ఆహార సంక్షోభాన్ని పరిష్కరించాల్సిన బాధ్యత ట్రంప్‌దే. కానీ ఆయనలో చిత్తశుద్ధి లేకనే రోజుల తరబడి ఆహార సదుపాయాలు నిలిచిపోయినా జోక్యం చేసుకోవడం లేదని విపక్షాలు తమ ఎన్నికల ప్రచార ప్రస్తావనలతో ప్రజల్ని ఆకట్టుకోగలగడమే ట్రంప్ అభ్యర్థులకు ఓటమి తెచ్చిపెట్టాయి. అంతర్గత సమస్యలు పరిష్కరించుకునే తరుణంలో ఇతర దేశాల కింద కయ్యానికి కాలు దువ్వుతున్న ట్రంప్‌కు ఈ ఎన్నికల ఫలితాలు గుణపాఠం కాగలదు. విజ్ఞతతో వ్యవహరిస్తే ఆయనకే మేలు.

నిముషాన్ని సంపూర్ణత్వంతో నింపడమే సంతోషం. పశ్చాత్తాపానికి, ఆజ్ఞలకూ అతీతమైనదే అసలైన సంతోషం.



ఎమర్సన్

అభ్యుదయాన్ని సాధించాలి అంటే చరిత్రను పునరావృతం చేయడం కాదు. కొత్త చరిత్రను సృష్టించాలి.



మహాత్మా గాంధీ


# సమాజాన్ని సంస్కరించే విద్యా వ్యవస్థ రావాలి

*తల్లిదండ్రులు కూడా తమ పిల్లలను కేవలం ఉద్యోగాలు చేసే యంత్రాలుగా కరెన్సీ నోట్లకు ప్రతిరూపాలుగా చూడడం వలనే సమాజం అధోగతి పాలైపోతున్నది.ఒకరితో ఒకరికి సంబంధాలుండడం లేదు. మానవ సంబంధాలన్నీ ఆర్థిక సంబంధాలేనన్న నానుడి నిక్కమైకూర్చున్నది. మితిమీరిన ధనాపేక్ష,యుక్తాయుక్త విచక్షణ మరచిన అహంకారతత్వం కలుపుగోలుతనాన్ని, సంఘటితంగా మెసలేతత్వాన్ని మంటగల పడం బాధాకరం.అష్టవంకరలతో అడ్డదిడ్డంగా మారినసామాజికవ్యవస్థను సరిచేసే బాధ్యత ఉపాధ్యాయుల భుజస్కంధాలపైఉంది. అందుకు తగిన మార్పులను ప్రభుత్వాలు నేటి విద్యావ్యవస్థలో తీసుకురావాలి.సంస్కారాన్ని, వినయాన్ని, వివేకాన్ని,సామాజిక స్పృహను కలిగించే రీతిలో పాఠ్యాంశాలలో మార్పులు రావాలి.'ధనమే పరమావధి' అనే ధోరణి మారాలి. విలువల ఆధారంగా సమాజం నడవాలంటే విద్యావ్యవస్థపై తీవ్రమైన మేథోమథనం జరగాలి. దిగజారిపోతున్న విలువలను చదువులతో సంస్కరించాలి.*



సుంకవల్లి సత్తిరాజు

సాంకేతిక వ్యవస్థ ప్రపంచాన్ని శాసిస్తున్న వర్తమానంలో ఇక నుంచి చదువులకు కూడాఅర్థం మారిపోయే అవకాశముంది. ఇప్పటికే చదువులకు, చేస్తున్న ఉద్యోగాలకు పొంతన లేకుండా పోయింది. ఉపాధికి పనికి రాని చదువులెందుకనే అభిప్రాయం నేటి యువతలో ప్రబలింది. విద్యాధికుల కంటే అరకొర చదువులతో లోక జ్ఞానం సంపాదించుకుని,తాము చేస్తున్న వృత్తిలో నైపుణ్యం సంపాదించుకుని, సంపాదనలో ముందంజలో దూసుకుపోతున్న వారిని చూసి ఆశ్చర్యపడక తప్పదు. ఆస్తులమ్ముకుని చాలీచాలని జీతాలతో జీవితాలను భారంగా నెట్టుకొస్తున్న వారికష్టాలను చూస్తుంటే నేటి విద్యావ్యవస్థను సంస్కరించవలసిన తరుణం తరుముకొచ్చిందనే భావించాలి. మానసిక వికాసాన్ని,జ్ఞానాన్ని అందించిన విద్యల సేద్యంలో సమూల మార్పులు రావాలి. నేటి విద్యార్థుల్లో చేతి వ్రాత కనుమరుగైపోతున్నది. అక్షరాలు సరిగా వ్రాయలేకపోతున్నారు.ఉచ్చారణలో స్పష్టత గురించి ప్రత్యేకంగా చెప్పనక్కరలేదు. సాంకేతిక పరిజ్ఞానం మానవ మేథస్సును మింగేస్తున్నది. సాంఘిక మాధ్యమాలు సంస్కారాన్ని పాతి పెడుతున్నాయి. చరవాణి పుణ్యమా అని చిన్న వయసునుండే అశ్లీల దృశ్యాలను చూసే సౌకర్యం అందుబాటులోకి వచ్చింది. చదువు సంస్కారాన్ని ప్రసాదించాలి కాని దుర్గుణాలను పెంపొందించకూడదు. దురదృష్టవశాత్తూ నేడు జరుగుతున్నది అదే. ఈ పరిస్థితులు మారాలి. వర్తమానంలో చోటు చేసుకుంటున్న పరిణామాలు సమాజాన్ని అధోగతి పాలు చేస్తున్నాయి. ఆధునిక మానవుడు ఆటవిక ప్రవృత్తిని సంతరించుకుని, ఆటవిక ప్రస్థానం వైపు వడివడిగా అడుగులు వేస్తున్నాడు. కుటుంబ వ్యవస్థ చిన్నాభిన్నమైపోతున్నది. పెళ్లిళ్ళు పెటాకులైపోతున్నాయి వివాహవ్యవస్థ ఇక గతంలా మిగిలే పరిస్థితులు ఏర్పడుతున్నాయి. ఆత్మీయబంధాలు అటకెక్కుతున్నాయి. బంధాలు,బంధుత్వాలు తెగిపోతున్నాయి.రక్తసంబంధాల మధ్య కార్చిచ్చు రగులుతున్నది. పెరటి చెట్టు వైద్యానికి పనికి రాదన్నట్లుగా కుటుంబ సభ్యులు పగవారిగా మారుతున్నారు.పరాయివారు ఆత్మీయులుగా మారుతున్నారు. 'ఎవరికి వారే యమునా తీరే' అనే రీతిలో ఒకరి పొడ మరొకరికి గిట్టడంలేదు. సంస్కారం అడుగంటి, వినయం నశించి,సద్గుణాలు లోపించి సమాజం ఒక విష సంస్కృతిలోకి నెట్టబడుతున్నది. ఇలాంటి అస్తవ్యస్త పరిస్థితులకు మూల కారణం నేటి మన విద్యావ్యవస్థఅని చెప్పక తప్పదు. పాఠ్యపుస్తకాలు కేవలం బట్టీ పట్టడానికి, పరీక్షల్లో మార్కులు సంపాదించడానికే ఉపకరిస్తున్నాయి. చదువులంటే కేవలం సంపాదన కోసమేనన్న దురభిప్రాయంఏర్పడింది. నైతిక ప్రవర్తనకు సంబంధించిన అంశాలు పాఠ్యపుస్తకాల్లో లోపించడం, విలువల గురించి బోధించకుండా కేవలం మార్కుల వైపే దృష్టి సారించడం వంటి ఆధునిక వ్యాపార దృక్పథం వలన సమాజం వికృత పరివర్తన దిశగా సాగుతున్నది. ఇప్పటికైనా మేల్కొనకపోతే మానవ ప్రపంచంలో మనిషి లక్షణాలనేవి మిగలవు. ఇప్పటికే నైతిక విలువలు అడుగంటి పోయాయి.స్వార్థం,అరాచకం,అవినీతి విచ్చలవిడిగా పెరిగిపోయాయి. పసి పిల్లలపై కూడా అత్యాచారాలు పెరిగిపోతున్నాయి. ఇటీవల జరుగుతున్న కొన్ని సంఘటనలు క్రూరమృగాల వేటను తలపిస్తున్నాయి. వీటికి అడ్డుకట్ట వేయాలి. మంచి చెడుల విచక్షణ నేర్పించాలి. సాంకేతిక నైపుణ్యాన్ని నవసమాజ నిర్మాణానికి వినియోగించాలి. విద్యను స్వీయ ప్రయోజనాల కోసం,పరపీడన కోసం వినియోగించడం వలన విద్యకున్న ప్రాశస్త్యం నశిస్తుంది. విద్యావంతుల శాతం పెరుగుతున్నా, సమాజంలో సరైన మార్పు రావడం లేదు. అరాచకాలు,హత్యలు విశృంఖలంగా కొనసాగుతున్నాయి. పూర్వకాలం నాటి చదువుల్లో ఉండే విలు



వలు నేటి చదువుల్లో లేవు. మనిషిని మనిషిగా గౌరవించే రోజులు పోయాయి. ఇలాంటి పరిస్థితులు ఏర్పడడానికి కారణం మంచి చెడుల గురించి చెప్పే వారు లేకపోవడమే. నేటి విద్యార్థులకు పుస్తకాలు బరువైనాయి.నేటి పుస్తకాల్లో నైతిక విలువలను బోధించే పాఠ్యాంశాలు కరువైనాయి. చదువుకు అందం సంస్కారం. వినయానికి విలువలు ఆభరణాలు. సకల సద్గుణాలకు ఆయువు పట్టు విద్య.అలాంటి చదువులను పుస్తకాల ద్వారా విద్యార్థుల మస్తకాల్లో ప్రేరేపించాలి. విద్యావ్యవస్థలో కాలానుగుణంగా అనేకమైన మార్పులు చోటు చేసుకుంటున్న మాట వాస్తవం.రాబోయే రోజుల్లో వీటి ఫలితాలు ఎలా ఉంటాయో వేచి చూడాలి. విద్యావ్యవస్థ సరిగా లేకపోవడమే సమాజం సరైన దిశలో నడవలేకపోవడానికి కారణమన్న వాదన అక్షరసత్యం.చదువు సమాజానికి ఉపయోగపడడం లేదు. స్వార్థానికి, ధనదాహానికి, ఇతరులను అణగద్రొక్కే నైజానికి నేటి విద్య జీవం పోస్తున్నదనడంలో సందేహం లేదు. నేటి సమాజంలో విద్యావంతులు పెరుగుతున్నారు.అయినా విద్యావంతులను గౌరవించే పరిస్థితి కూడా నేటి సంఘంలో కొరవడింది. కారణం విద్యావంతులలో కూడా సంస్కారం, వినయం కొరవడడమే. విద్యావంతుల కంటే విద్యావిహీనులే నయం అన్నభావన ఒక్కోసారి కలగకమానదు.ఇది చాలా దురదృష్టకరం. ధనానికి దాసోహమయ్యే పరిస్థితులు యథాతథంగా కొనసాగుతున్నాయి. ఈ పరిస్థితుల్లో కూడా మార్పు వచ్చి వివేకానికి, సంస్కారానికి విలువ పెరిగితేనే సమాజవికాసం 'మూడు పువ్వులు ఆరుకాయలు' అన్నట్టుగా వర్థిల్లుతుంది. ఈ మార్పు రావాలంటే విద్యావ్యవస్థ మెరుగుపడాలి.పెరిగిన సాంకేతిక పరిజ్ఞానం వలన ప్రపంచమంతా వేగంగా పరుగెడుతున్నది. విదేశీ సంస్కృతి స్వదేశీ విలువలను ధ్వంసం చేస్తున్నది. ఇతర దేశాల సంస్కృతిలోని మంచిని గ్రహించి, మన దేశ సంస్కృతిని కాపాడుకోవాలి. మన చదువుల్లో విలువలకు ప్రాధాన్యత పెరగాలి. పాతకాలం నాటి నైతిక విలువలతో కూడిన విద్యతో ఆధునిక విద్యావ్యవస్థ సమ్మిళితమై వెలుగొందాలి. "విద్యాదదాతి వినయం వినయాద్వాతి పాత్రతాం' అన్నాడు భర్తృహరి. విద్య వలన వినయం, వినయం వలన పాత్రత సిద్ధిస్తుంది. అయితే నేటి విద్యావ్యవస్థ కేవలం ధనార్జనకు, ఉద్యోగ సంపాదనకే అధిక ప్రాధాన్యత నివ్వడం వలన వినయమనే విశిష్టమైన ఆభరణం సమాజమనే కిరీటంలో చేరలేక పోతున్నది. సంస్కారం స్థానంలో కృత్రిమమైన నటనా వైదుష్యంతో కూడిన కుసంస్కారం వ్రేళ్ళూనుతున్నది.మంచికి వంచన జరుగుతున్నది. నిజమైన సంస్కారానికి, వినయానికి చోటు మృగ్యమైపోతున్నది. స్వకార్యాలను చక్కబెట్టుకోవడానికే చదువు ఉత్ప్రేరకంగా ఉపయోగపడుతుంది కాని సమాజ సేవకు కొరగావడం లేదు. కొద్దో గొప్పో సమాజంపై అవగాహన ఉన్నవారు ఆదిలోనే హంసపాదులా నేటివ్యవస్థలో పేరుకుపోయిన అహంకార జాఢ్యమనే మనో వికారాలతో అణగద్రొక్క బడుతున్నారు. 'చిన్నినా పొట్టకు శ్రీరామరక్ష' అనుకుంటూ మనం బ్రతికితే సంఘం బ్రతికినట్టే, మనకెందుకులే అనే ధోరణి ప్రబలిపోయింది. సచ్ఛరిత్ర గల ఎవరూ సమాజంలో ఇమడలేక నలిగిపోతున్నారు. ఆత్మాభిమానం చంపుకోలేక,అవకాశవాదానికి తలొగ్గడం ఇష్టంలేక మౌనముద్ర వహిస్తున్నారు. అరాచకాలు, అత్యాచారాలు, అసాంఘిక కార్యకలాపాలు నేటి వ్యవస్థలో పెచ్చుమీరిపోతున్నాయి. ధనం,అధికారం, అహంకారం ముందు మంచితనం వీగిపోతున్నది. దిగజారిపోతున్న విలువలు అణగారిపోతున్న మానవ సంబంధాల నేపథ్యంలో 'త్వంశుంఠ..త్వశుంఠ" అనుకుంటూ వారినీ వీరినీ తిట్టుకోవడం పరిపాటిగా మారిపోయింది. యాంత్రికమైన చదువుల వల్ల విలువలు పడిపోతున్నాయి. తల్లిదండ్రులు కూడా తమ పిల్లలను కేవలం ఉద్యోగాలు చేసే యంత్రాలుగా కరెన్సీ నోట్లకు ప్రతిరూపాలుగా చూడడం వలనే సమాజం అధోగతి పాలైపోతున్నది.ఒకరితో ఒకరికి సంబంధాలుండడం లేదు. మానవ సంబంధాలన్నీ ఆర్థిక సంబంధాలేనన్న నానుడి నిక్కమై కూర్చున్నది. మితిమీరిన ధనాపేక్ష, యుక్తాయుక్త విచక్షణ మరచిన అహంకారతత్వం కలుపుగోలుతనాన్ని, సంఘటితంగా మెసలేతత్వాన్ని మంటగల పడం బాధాకరం.అష్టవంకరలతో అడ్డదిడ్డంగా మారినసామాజికవ్యవస్థను సరిచేసే బాధ్యత ఉపాధ్యాయుల భుజస్కంధాలపైఉంది. అందుకు తగిన మార్పులను ప్రభుత్వాలు నేటి విద్యావ్యవస్థలో తీసుకురావాలి. సంస్కారాన్ని, వినయాన్ని, వివేకాన్ని, సామాజిక స్పృహను కలిగించే రీతిలో పాఠ్యాంశాలలో మార్పులు రావాలి.'ధనమే పరమావధి' అనే ధోరణి మారాలి.విలువల ఆధారంగా సమాజం నడవాలంటే విద్యావ్యవస్థపై తీవ్రమైన మేథోమథనం జరగాలి. దిగజారిపోతున్న విలువలను చదువులతో సంస్కరించాలి. ●

# అతి అన్ని విషయాల్లో అనర్థదాయకం!

ఐ.ప్రసాదరావు

కాశీబుగ్గలో జరిగిన దర్శన తోపులాటలో పలువురు ప్రాణాలు కోల్పోవడం మన అందరి హృదయాలను కలచివేసింది.ఇది ముమ్మాటికీ మానవ తప్పిదమే అని పలువురు పేర్కొంటున్నారు. ముఖ్యంగా మన దేశంలో ప్రమాదాలు జరగడానికి ప్రధాన కారణం 'క్రమశిక్షణ' పాటించకపోవడం. బస్సు ఎక్కాలన్నా, రైలు ఎక్కాలన్నా, చివరికి విమానం ఎక్కే సమయంలో కూడా చివరికి చదువుకున్న వారు కూడా ఒకరిని ఒకరు తోసుకుంటూ విమానం ఎక్కుతున్న పరిస్థితి. ఇక ఇటీవల కాలంలో దేవాలయాల్లో దర్శనాలు సందర్భంగా, నదుల్లో పుణ్య స్నానాలు చేసే సమయంలో అనేక మంది అకాల మరణం చెందడానికి ప్రధాన కారణం క్రమశిక్షణ పాటించకపోవడం. ఆత్రుతతో తోపులాటలు జరగడం వల్ల అనేకమంది భక్తుల ప్రాణాలు గాల్లో కలిసిపోతున్నాయి.ముఖ్యంగా ప్రజలు, యువత, భక్తులు, ప్రయాణికులు ప్రతీ సందర్భంలోనూ ఓర్పు ,సహనం, క్రమశిక్షణ పాటిస్తేనే, ఇటువంటి అకాల మరణాలు నివారించగలం అని గ్రహించాలి. కొంతమేరకు విజ్ఞతతో వ్యవహరించాలి. మూఢ నమ్మకాలు,మూఢ విశ్వాసాల విసర్జించాలి. పూర్వకాలంలోనూ,అంతగా చదువులేని కాలంలో ప్రజలు సంయమనంతో దర్శనాలు చేసుకునే వారు, సురక్షితంగా ఇంటికి చేరుకునే పరిస్థితి ఉండేది. నేడు అనేక మంది విద్యావంతులు, అనేక విషయాలపై అవగాహన ఉన్న వారు కూడా ప్రమాదాల్లో చిక్కుకోవడం, కొన్ని సందర్భాల్లో ప్రాణాలు కోల్పోవడం జరుగుతుంది..దీని అంతటికీ కారణం'అత్యుత్సాహం' మాత్రమే. ఇకప్రభుత్వాలు, వివిధ ఆధ్యాత్మికసంస్థలు, బాబాలు, స్వాములు ఇటీవల కాలంలో ప్రజల్లో మత పరమైన కార్యక్రమాలు ఎక్కువగా చొప్పించడం జరుగుతుంది. ఒక్క మాటలో చెప్పాలంటే 'భక్తిని పూర్తిగా వ్యాపారమయం చేయడం' జరుగుతుంది. దీనికితోడు సామాజిక మాధ్యమాల్లో, యూ ట్యూబ్‌లు, వివిధ ఛానెల్స్ మతపరమైన భావజాలం విచ్చలవిడిగా ప్రచారం చేస్తూ,ప్రజలను దైవ కార్యక్రమాల్లో మితిమీరి ముంచితేల్చడం జరుగుతుంది.ప్రభుత్వాలు సామాజిక మాధ్యమాలు ప్రజలను, యువతను సమాజంలో విజ్ఞానవంతులుగా, వివేకవంతులుగా, ఉద్యోగ ఉపాధి అవకాశాలు సాధించే విధంగా, నైపుణ్యాలు నేర్చుకునే విధంగా, అప్పుల ఊబిలో కూరుకుపోకుండా స్వయం సమృద్ధి సాధించే విధంగా మన రాష్ట్రాన్ని, దేశాన్ని అతి త్వరలో" వికసిత భారత్'గా తీర్చిదిద్దే విధంగా దిశానిర్దేశం చేయాలిగాని, మితిమీరిన భక్తిలో మునిగి తేలేటట్లు చివరికి ప్రాణాలు కోల్పోయే విధంగా ప్రోత్సహించడం ఏమాత్రం శ్రేయోష్కరం కాదు. ఇక మనదేశంలో ప్రాచీన కాలం నుండి ప్రాచుర్యం పొందిన అనేక పురాతన దేవాలయాలు ఉన్నాయి.అయితే, ఇటీవల కాలంలో భూస్వాములు, సంపన్నులు, కార్పొరేట్ వర్గాలు, బాబాలు, స్వాములు, ధనికులు 'పేరు' కోసం, రకరకాల కొత్త దేవాలయాలు, ఆశ్రమాలు నిర్మిస్తూ ప్రజలను ఆకర్షించడానికి ప్రయత్నాలు ముమ్మరం చేస్తున్నారు. ఒక్క మాటలో చెప్పాలంటే, 'ప్రైవేటు దేవాలయాలు, ఆశ్రమాలు' ఎక్కడబడితే అక్కడ నిర్మిస్తున్నారు. ప్రతీరోజూ,ప్రతీఘడియ రకరకాల పండుగలు, పర్వదినాలు అనేక పేర్లతో ప్రజలను మత భావోద్వేగానికి గురయ్యాటట్లు చేస్తున్నారు. ప్రజలు కూడా ఆ ప్రభావంలో పడిపోవడం శోచనీయం. ఇకనైనా ప్రజలు భగవంతుడు అన్ని చోట్లా ఉన్నాడు అని, మనసు మంచిదైతే అంతా మంచి జరుగుతుంది అని ఆలోచన చేయాలి.సెక్యులర్ భావంతో పనిచేయవలసిన ప్రభుత్వాలే మత క్రతువులు ప్రోత్సహించడం, కొన్ని సందర్భాల్లో ప్రత్యక్షంగా ప్రభుత్వాధినేతలే మత క్రతువుల్లో పాల్గొనడం వల్ల, ప్రజలు కూడా ఉద్వేగభరితంగా పాల్గొన్నడం జరుగుతుంది. దీంతో కొన్ని చోట్ల అమాయక ప్రజలు ప్రాణాలు కోల్పోవడం జరుగుతుంది. ప్రజలు ప్రభుత్వాల పనితీరును ప్రశ్నించకుండా ఉండటానికి కూడా ఈమత క్రతువులు ఉపయోగపడుతున్నాయి.'అధిక ధరలు,ప్రైవేటీకరణ,నిరుద్యోగం' వంటి పలు సమస్యలు ప్రజలు ప్రభుత్వాలను నిలదీయకుండా ఉండటానికి మాత్రం ఈమత క్రతువులు ఉపయోగపడుతున్నాయి అనే విషయం వాస్తవమే. ●

# ప్రజావాక్కు



## ప్రణాళిక అవసరం

**దేవాలయాలు,** యాత్రలు, ఉత్సవాలు ఇవి మనసును పవిత్రం చేసి,శాంతి నింపాల్సిన ప్రదేశాలు. కానీ ఇటీవలి రోజుల్లో రద్దీ,నిర్వాహణలో నిర్లక్ష్యం, భక్తుల్లోని ఆతురత కలిసి అవే ప్రదేశాలు విషాదానికి వేదికలవుతున్నాయి. కాశిబుగ్గ శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయంలో జరిగిన తొక్కిసలాటలో తొమ్మిది మంది ప్రాణాలు కోల్పోవడం మనను ఆలోచింపజేయాలి. ఈఏడాదిలోనే దేశవ్యాప్తంగా రద్దీ కారణంగా 100కి పైగా మంది మరణించడం అనేది కేవలం సంఖ్య కాదు. ప్రతి సంఖ్య ఒక కుటుంబ రోదన. ఈపరిస్థితిని మార్చడం ప్రభుత్వాలు, దేవాలయ నిర్వాహకులు, భక్తులు అందరి బాధ్యత. పుణ్యక్షేత్రాల్లో రద్దీని నియంత్రించేందుకు శాశ్వత భద్రతా బలగాలు, శిక్షణ పొందిన వాలంటీర్లు, వైద్య సిబ్బంది, అంబులెన్స్‌లు అందుబాటులో ఉండే విధంగా ప్రణాళిక కావాలి.

- సి.హెచ్.ప్రతాప్, శ్రీకాకుళం జిల్లా

## ఉపాధ్యాయ వృత్తికే అవమానం

**పిల్లలకు** పాఠాలుచెప్పాల్సిన పంతులమ్మ వారిచేత చాకిరీ చేయించుతూతానుఏంచేసినా అడిగేవారులేరని విర్రవీగిన టీచర్ దారుణంగా ప్రవర్తించారు. శ్రీకాకుళం జిల్లా మెళియాపుట్టి మండలం బందపల్లి బాలికల గిరిజన ఆశ్రమ పాఠశాలలో ఉపాధ్యాయురాలుసెల్‌ఫోన్‌లో మాట్లాడుతూ.. ఇద్దరు విద్యార్థినులతో కాళ్లు నొక్కించుకుంటున్న ఘటన అమానుషం. విద్యార్థులపై జులుం ప్రదర్శించిన టీచర్ బాలికల గిరిజన ఆశ్రమ పాఠశాలలో పిల్లలకు పాఠాలు చెప్పాల్సిన టీచర్ దర్జాగాకుర్చీలో కూర్చొని సెల్ఫోన్‌లో మాట్లాడుతూ ఉపాధ్యాయ వృత్తిని దెబ్బ తీశారు.

- కామిడి సతీష్ రెడ్డి, భూపాల్ పల్లి జిల్లా

## రాయితీ ఇవ్వాలి

**సాధారణంగా** సీనియర్ సిటిజన్ అన్న భావం కేవలం వయస్సు మాత్రమే60 దాటినవారే మాత్రంకాదు, ఉద్యోగం లేక కుటుంబ జీవితంలో ఎన్నో అవాంతరాలు, సమస్యలు ఎదుర్కొని నిలబడినవారు.వారికి మిగిలిన పౌరులతో పాటు ఏదైనా ప్రజా వ్యవహారాల్లో రాయితీ ఇవ్వడం ప్రభుత్వంవారికిచ్చే గౌరవం,ఉన్నతత్వం.గానీ మన రైల్వే సేఖ కోవిడ్ తర్వాత దాన్ని ఇచ్చేందుకు ఆర్థిక భారాన్ని చూపి నిరాకరించింది.

- బొల్లోజు మేఘనాథం, విశాఖపట్నం

## వ్యవసాయంపై వాతావరణ మార్పుల ప్రభావం

మన దేశఆర్థికవ్యవస్థలో వ్యవసాయం కీలక పాత్ర పోషిస్తుంది. కానీ ఇటీవలి కాలంలో వాతావరణ మార్పులు ఈ రంగంపై తీవ్రప్రభావాన్నిచూపుతున్నాయి.వర్షపాతం విధానం అస్థిరంగా మారడం, ఉష్ణోగ్రతలు పెరగడం,కరవు పరిస్థితులు ఏర్పడటం, వరదలు రావడం వంటి అంశాలు రైతులకు పెద్ద సవాలుగా మారాయి. వర్షాలు సమయానికి పడకపోవడం వలన పంటలు ఎండిపోతున్నాయి. మరోవైపు అధిక వర్షాలు పడి నీట మునిగే పరిస్థితులు ఏర్పడి పంటలు నష్టపోతున్నాయి. ఈ పరిస్థితులు పంటదిగుబడిని తగ్గించడమే కాకుండా రైతుల ఆర్థిక పరిస్థితిని కూడా దెబ్బతీస్తున్నాయి. మట్టి నాణ్యత తగ్గడం, కొత్త తెగుళ్ల వ్యాపించడం కూడా వాతావరణ మార్పుల ఫలితమే. ఈ సమస్యను ఎదుర్కొనడానికి ప్రభుత్వం, శాస్త్రవేత్తలు, రైతులు కలిసిపనిచేయాలి.నీటిసంరక్షణ,సేంద్రీయవ్యవసాయం, తక్కువ నీరు అవసరమయ్యే పంటలసాగు, వంటిచర్యలు తీసుకోవాలి.

- తిప్పర్తి శ్రీనివాస్, చొప్పదండి

## బీహార్ కుల రాజకీయాలు

**బీహార్** అనగానే కుల రాజకీయాలు వలస కార్మికులు మాత్రమే గుర్తొస్తారు.మరికులం,వలసలు మాత్రమే తమ బిడ్డలకు అన్నం పెట్టవని అక్కడ ప్రజలు గుర్తించాలి. బీహార్ అభివృద్ధికి కావాల్సిన వనరులు అన్ని ఉన్న అల్లుని నోట్లో శని అన్న చందంగా అక్కడి పరిస్థితి తయారు అయ్యింది. అక్కడ కావాల్సింది యువతకు ఉపాధి ఉద్యోగాలు కావాలె. కానీ ఇప్పటి వరకు అక్కడి పరిపాలకులు ఎవరైనా సరే కులం ఆధారంగా , వలస కార్మికులు ఆధారంగామాత్రమే రాజకీయాలు చేశారు కానీ వాళ్లకు ఒక అభివృద్ధి ప్రణాళికను ముందు ఉంచడంలో విఫలం అయ్యారు. అంటే ప్రణాళిక రహితమైన పరిపాలన ద్వారా మాత్రమే ఈ దుర్గతి ఆ రాష్ట్రానికి సంభవించింది.

-భారత అవినాష్, జనగామ

## విషాద సంఘటనలు

**ఈమధ్య** రహదారి ప్రమాదాలు, వాటి కారణంగా అనేక అమాయక ప్రాణాలు హరించుకుపోతున్నాయి.రోడ్లు నిర్మించకపోతే గతకులు గుంతలతో ప్రమాదాలు జరుగుతున్నాయని గోలగోల చేస్తారు. అద్దంలాంటి రోడ్లువేస్తే హద్దులేని వేగంతో ప్రమాదాలను సృష్టిస్తారు. ప్రమాదాలను సూచించే హెచ్చరికల బోర్డులుంటాయి.వాటినిపట్టించుకోరు.ఈ రెండు మూడురోజులలో రోడ్డు ప్రమాదాలలో పదుల సంఖ్యలో ప్రజలు మృతి చెందారు.

- ఎన్. రామలక్ష్మి, సికింద్రాబాద్

మనవి

ఎడిట్ పేజీకి..

ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్

(e-mail: editpage@vaartha.com)

# పర్యావరణ పరిరక్షణ సామాజిక బాధ్యత

రామ కిష్టయ్య సంగన భట్ల

అంతర్జాతీయ పర్యావరణ దోపిడీ అనేది ఒక దేశం లేదా సంస్థ తన ఆర్థిక లాభం కోసం సహజ వనరులను దోచుకోవడం, దుర్వినియోగం చేయడం. ఇది ప్రధానంగా అడవుల నరికివేత, ఖనిజ సంపదను పెద్ద స్థాయిలో తవ్వుకోవడం, నీటి వనరులను అతిగా వినియోగించడం వంటి రూపాలలో ఉంటుంది. ఈ దోపిడీవల్ల స్థానిక జీవజాలం, స్థానికజనాభా తీవ్రంగా ప్రభావితం అవుతుంది. తక్కువ అభివృద్ధి చెందిన దేశాలు లేదా అభివృద్ధి చెందుతున్న దేశాలు, తమ పర్యావరణం, వనరులను పరిరక్షించడానికి తగినవిధానాలను అనుసరించలేకపోతున్నాయి. ఇది ఆ దేశాల పర్యావరణాన్ని తీవ్ర స్థాయిలో నాశనం చేస్తోంది.ప్రపంచం మొత్తం పర్యావరణ సమస్యలతో కొట్టుమిట్టాడుతోంది. గ్లోబల్ వార్మింగ్, వాయు కాలుష్యం,నీటి ప్రదూషణ, జీవవైవిధ్యం నష్టం వంటి అనేక సమస్యలు మన జీవన విధానాన్ని తీవ్రంగా ప్రభావితం చేస్తున్నాయి. ఈ సమస్యలకు ప్రధాన కారణం అంతర్జాతీయ స్థాయిలో జరుగుతున్న పర్యావరణ దోపిడీ. ఒక దేశం లేదా సంస్థ తన ఆర్థిక ప్రయోజనాల కోసం ఇతర దేశాల సహజ వనరులను దోపిడీ చేయడం, తద్వారా స్థానికప్రజల జీవన విధానాలపై ప్రతికూల ప్రభావం చూపడం, పర్యావరణ దోపిడీకి ఉదాహరణలుగా చెప్పవచ్చు. ఈ సమస్యను అరికట్టేందుకు, పర్యావరణ పరిరక్షణను ప్రోత్సహించేందుకు ప్రతి సంవత్సరం ఒక నిర్దిష్టదినాన్ని పాటిస్తారు. ఈ సందర్భంలో అంతర్జాతీయ పర్యావరణ దోపిడీ అంటే ఏమిటి, దాని ప్రభావాలు, నివారణ చర్యలు,మన బాధ్యతలు వంటి అంశాలను పరిశీలించడం అవసరం.అడవుల నరికివేత,భారీ పరిశ్రమల నెలకొల్పటం, రసాయనాల వాడకం వంటివి అనేక జంతువుల, వృక్షజాలం నివాసాలను ధ్వంసం చేస్తాయి. వీటి వల్ల అనేక జీవజాతులు అంతరించిపోతాయి. జీవవైవిధ్యం కనుమరుగవడం వల్ల పర్యావరణ సమతుల్యతలో గణనీయమైన మార్పులు వస్తాయి. పరిశ్రమల నుంచి ఉద్గారాలు, వ్యవసాయ రసాయనాలు, ఇతర వ్యర్థ పదార్థాలు నదులు, సముద్రాలు, వాయు మండలాన్ని కలుషితం చేస్తాయి. ఇది పర్యావరణానికి మాత్రమేకాకుండా, మన ఆరోగ్యానికీ ప్రమాదకరం.దీనివలన వాయుకాలుష్యం, నీటి కాలుష్యం, భూసమర్థవంతత తగ్గిపోవడం వంటి సమస్యలు తలెత్తుతాయి. వనరులను అతిగా వినియోగించడం, చెట్లను నరికివేయడం, గ్రీన్‌హౌస్ వాయువుల ఉద్గారాలను పెంచడం వలన వాతావరణంలో వేడి పెరుగుతోంది.దీని కారణంగా గ్లోబల్ వార్మింగ్ అనే సమస్య పెరిగి వాతావరణంలో అతివృష్టి, కరవు వంటి ప్రతికూల మార్పులు చోటు




చేసుకుంటున్నాయి. వాతావరణ మార్పు వల్ల వరదలు, కరువులు, అగ్ని ప్రమాదాలు వంటి సహజ వైపరీత్యాలు ఎక్కువగా సంభవిస్తున్నాయి. ఈ ప్రక్రియలతో పర్యావరణ నాశనం తక్షణమే కనిపించకపోయినా,దీర్ఘకాలం లో వీటి ప్రతికూల ప్రభావం పెద్దస్థాయిలో ఉంటుంది. కాలుష్యంవల్ల మన ఆరోగ్యంపై ప్రతికూల ప్రభావాలు ఏర్పడతాయి. వాయు కాలుష్యం వల్ల శ్వాసకోశ వ్యాధులు, నీటికాలుష్యం వల్ల నీటి ద్వారా వ్యాప్తిచెందే వ్యాధులు ప్రబలు తున్నాయి. శరీరంలో విష పదార్థాలు చేరటంవల్ల కేన్సర్,జన్యువ్యాధులు వంటి తీవ్రమైన ఆరోగ్య సమస్యలు కూడా ఉత్పన్నం అవుతున్నాయి. అంతర్జాతీయ పర్యావరణ దోపిడీని అరికట్టడానికి ప్రయత్నాలు జరిగాయి. పర్యావరణ పరిరక్షణ కోసం పలు అంతర్జాతీయ ఒప్పందాలు కుదిరాయి. టోక్యో ప్రోటోకాల్, పారిస్ ఒప్పందం వంటి ఒప్పందాల ద్వారా వాయు కాలుష్యాన్ని తగ్గించేందుకు దేశాలు ఒక ప్రణాళికను అనుసరిస్తున్నాయి.ఈ ఒప్పందాలు పర్యావరణ పరిరక్షణకుదేశాల మధ్య సహకారాన్నిపెంపొందిస్తున్నాయి.ప్రతి దేశం పర్యావరణ పరిరక్షణ కోసం సొంత చట్టాలను రూపొంది స్తోంది. వనరులను అధికంగా వినియోగించే సంస్థలపై నియంత్రణ విధించేలా చట్టాలు అమలుచేస్తున్నాయి.కాలుష్యనియంత్రణ, వనరుల పరిరక్షణ, రక్షణాత్మక చర్యలు తీసుకునేలా ప్రభుత్వాలు చట్టాలను రూపొందిస్తున్నాయి పర్యావరణ పరిరక్షణపై ప్రజలలో అవగాహన పెంచేందుకు ప్రభుత్వం,స్వచ్ఛంద సంస్థలు, ఇతర సంస్థలు జాగృతి కార్యక్రమాలను నిర్వహిస్తున్నాయి. పర్యావరణ సమస్యలను ప్రజలకు వివరించడం, అవగాహన కల్పించడంవల్ల ప్రజలు తమ జీవనశైలినిసవరించుకోవడానికి ఆసక్తి చూపిస్తారు.శిలాజ ఇంధనాలకు ప్రత్యామ్నాయంగా సౌరశక్తి, పవనశక్తి వంటి పునరుత్పాదక ఇంధనాలను వినియోగించడాన్నిప్రోత్సహిస్తున్నారు. ఈ వనరులు పర్యావరణానికి హానికరమైన కర్బనఉద్గారాలను తగ్గించడంలో సహాయపడతాయి. ప్రతి వ్యక్తి పర్యావరణ పరిరక్షణలో తనవంతు బాధ్యతను నిర్వర్తించాలి.వాహనాలను తక్కువగా వినియోగించడం, పునర్వినియోగ పదార్థాలు ఉపయోగించడం, నీటి వనరులను ఆదా చేయడం ద్వారా కాలుష్యాన్ని తగ్గించవచ్చు. పర్యావరణానికి మేలుచేసే మొక్కలను నాటి, వాటిని సంరక్షించడం ద్వారా వాయుకాలుష్యం తగ్గించవచ్చు. పర్యావరణానికి హాని కలిగించని ఉత్పత్తులను ఎంచుకోవడం,ప్లాస్టిక్ వంటి పదార్థాల వాడకాన్ని తగ్గించడం,మన పరిసరాల్లోని వారికి పర్యావరణ పరిరక్షణప్రాముఖ్యతను వివరించడం చేపట్టాలి.అంతర్జాతీయ పర్యావరణ దోపిడీ ఒక తీవ్రమైన సమస్యగా మనముందుంది. దీనిని అరికట్టడానికి ప్రభుత్వాలు,సంస్థలు, ప్రజలు కలిసి కృషి చేయాలి. పర్యావరణాన్ని కాపాడడంలో ప్రతి ఒక్కరి బాధ్యత అత్యంత కీలకం. మనం పర్యావరణా న్ని కాపాడుకుంటేనే భవిష్యత్తు తరాలకు ఆరోగ్యకరమైన జీవనం అందించగలుగుతాం. ●

# టివికె పార్టీ ఒంటరి పోటీ



### సిఎం అభ్యర్థిగా పార్టీ చీఫ్ విజయ్

### పార్టీ సమావేశంలో ఏకగ్రీవ నిర్ణయం

**చెన్నై, నవంబరు 5:** తమిళనాడు రాజకీయాల్లో గత కొన్ని వారాలుగా నెలకొన్న ఉత్కంఠకు తెరపడింది. నటుడు విజయ్ స్థాపించిన 'తమిళగ వెట్రి కళగం' (టీవీకే) పార్టీ 2026 అసెంబ్లీ ఎన్నికల బరిలో ఒంటరిగానే దిగనున్నట్లు బుధవారం అధికారికంగా ప్రకటించింది. పార్టీ వ్యవస్థాపకుడైన విజయ్‌ను ముఖ్యమంత్రి అభ్యర్థిగా ఏకగ్రీవంగా ఎన్నుకుంది. మహాబలిపురంలోని ఓ ప్రైవేట్ హోటల్‌లో విజయ్ అధ్యక్షతన జరిగిన పార్టీ ప్రత్యేక జనరల్ కౌన్సిల్ సమావేశంలో ఈ కీలక నిర్ణయం తీసుకున్నారు. ఈ సమావేశానికి రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 2,000 మందికి పైగా జనరల్ కౌన్సిల్ సభ్యులు, జిల్లా కార్యదర్శులు, ఇతర ముఖ్య నాయకులు హాజరయ్యారు. సెప్టెంబర్ 27న కరూర్ ర్యాలీలో జరిగిన తొక్కిసలాటలో మరణించిన 41 మందికి నివాళిగా రెండు నిమిషాల మౌనం పాటించి సమావేశాన్ని ప్రారంభించారు. ఈ విషాద ఘటన తమకు ఒక బాధాకరమైన గుణపాఠం అని, భవిష్యత్తులో ఇలాంటివి పునరావృతం కాకుండా కఠినమైన భద్రతా చర్యలు తీసుకుంటామని పార్టీ పేర్కొంది. ఈ సమావేశంలో రాబోయే ఎన్నికల లక్ష్యంగా పార్టీ రాజకీయ, విధానపరమైన వైఖరిని స్పష్టం చేస్తూ మొత్తం 12 తీర్మానాలను ఆమోదించారు. ప్రస్తుతం జరుగుతున్న ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ (సర్) ప్రక్రియను వెంటనే నిలిపివేయాలని కేంద్ర ఎన్నికల సంఘాన్ని డిమాండ్ చేశారు. ఈ ప్రక్రియ వల్ల అర్హులైన ఓటర్లు తమ ఓటు హక్కును కోల్పోయే ప్రమాదం ఉందని ఆరోపించారు. శ్రీలంక నౌకాదళం పదేపదే తమిళ మత్స్యకారులను అరెస్ట్ చేస్తున్నా, రాష్ట్రంలోని డీఎంకే ప్రభుత్వం, కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం తమిళుల ప్రయోజనాలను కాపాడటంలో పూర్తిగా విఫలమయ్యాయని టీవీకే విమర్శించింది. తమిళనాడులో శాంతిభద్రతలు దారుణంగా క్షీణించాయని ఆరోపిస్తూ, కోయంబత్తూరు కళాశాల విద్యార్థినిపై జరిగిన లైంగిక దాడి ఘటనను ఉదాహరణగా చూపింది. మహిళా భద్రత కల్పించడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందని మండిపడింది. ధాన్యం సేకరణలో జాప్యం కారణంగా డెల్టా రైతులు పడుతున్న ఇబ్బందులపై, పంట పొలాల్లోనే మొలకెత్తుతున్న ధాన్యంపై ఆందోళన వ్యక్తం చేసింది. చెన్నై నేలల ఆక్రమణలపై ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని విమర్శించింది. రాష్ట్రంలో పారిశ్రామిక పెట్టుబడులు, ఉద్యోగ కల్పనపై శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేసింది. ఎన్నికల పొత్తులకు సంబంధించి ఎలాంటి నిర్ణయం తీసుకోవాలన్నా ఆ అధికారం కేవలం విజయ్‌కు మాత్రమే ఉంటుందని, 2026 ఎన్నికల్లో తమ పార్టీ సొంత కూటమికి నాయకత్వం వహిస్తుందని తీర్మానాల్లో స్పష్టం చేశారు. అయితే భద్రతా కారణాల దృష్ట్యా వేదిక వద్ద ఏర్పాటు చేసిన పార్టీ బ్యానర్లు, జెండాలను పోలీసులు తొలగించారు.

# న్యూయార్క్ మేయర్‌గా తొలి ముస్లిం డెమొక్రాట్!

## స్థానిక ఎన్నికల్లో ట్రంప్‌కు ఎదురు దెబ్బ



**న్యూయార్క్, నవంబరు 5:** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌కు స్థానిక ఎన్నికల్లో గట్టి ఎదురుదెబ్బ తగిలింది. ఆయన నేతృత్వంలోని రిపబ్లికన్ పార్టీ పలు కీలక రాష్ట్రాల్లో జరిగిన ఎన్నికల్లో ఘోర పరాజయం పాలైంది. ట్రంప్ ఏడాది పాలనపై ప్రజల్లో ఉన్న వ్యతిరేకత ఈ ఫలితాల్లో స్పష్టంగా కనిపించింది. మరోవైపు, డెమొక్రాటిక్ పార్టీ అభ్యర్థులు సంచలన విజయాలను నమోదు చేశారు. ఈ ఎన్నికల్లో అందరి దృష్టిని ఆకర్షించిన విజయం న్యూయార్క్ మేయర్ ఎన్నిక. ఇక్కడ భారత సంతతికి చెందిన ముస్లిం అభ్యర్థి జోహ్రాన్ మమ్దానీ (34) చారిత్రక విజయం సాధించారు. న్యూయార్క్ నగరానికి తొలి ముస్లిం మేయర్‌గా ఆయన రికార్డు సృష్టించారు. అంతేకాకుండా, గడిచిన శతాబ్ద కాలంలో ఇంత పిన్న వయసులో మేయర్‌గా ఎన్నికైన వ్యక్తిగా కూడా ఆయన చరిత్రకెక్కారు. మమ్దానీ వచ్చే ఏడాది జనవరి ఒకటవ తేదీ నగర మేయర్‌గా ప్రమాణ స్వీకారం చేయనున్నారు. కాగా, న్యూయార్క్ మేయర్ ఎన్నికల్లో ఓటింగ్ శాతం భారీగా నమోదైనట్లు నగర ఎన్నికల బోర్డు వెల్లడించింది. సుమారు 2 మిలియన్లకు పైగా నగరవాసులు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారని అధికారులు తెలిపారు. ఈ ఫలితాలు రిపబ్లికన్ పార్టీకి, ట్రంప్ ప్రభుత్వానికి పెద్ద షాక్‌గా మారాయి. విజయం అనంతరం తన మద్దతుదారులను ఉద్దేశించి జొహ్రాన్ ప్రసంగించారు. భారత తొలి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ చారిత్రక ప్రసంగం 'ట్రిస్ట్ విత్ డెస్టినీ' లోని వాక్యాలను గుర్తుచేసుకున్నారు. "ఒక శకం ముగిసి, నవశకం వైపు అడుగు వేస్తున్నప్పుడు చరిత్రలో ఇలాంటి క్షణాలు అరుదుగా వస్తాయి. సుదీర్ఘ అణచివేతకు గురైన జాతి గళం వినిపించిన సమయం ఇదీ" అని తన గెలుపును ఉద్దేశించి వ్యాఖ్యానించారు. ఈ సందర్భంగా డొనాల్డ్ ట్రంప్‌ను నేరుగా హెచ్చరించడం చర్చనీయాంశమైంది. ట్రంప్, మీరు ఇదంతా చూస్తున్నారని నాకు తెలుసు. మీకు చెప్పడానికి నా దగ్గర నాలుగు మాటలున్నాయి. మీరు మాలో ఎవరినైనా చేరుకోవాలంటే, మా అందరినీ దాటి రావాలని సవాల్ విసిరారు. సోషలిస్టు భావజాలం కలిగిన జొహ్రాన్, ఉగాండా జాతీయుడైన మహమూద్ మమ్దానీ, ప్రఖ్యాత భారతీయ సినీ దర్శకురాలు మీరా నాయర్‌ల కుమారుడు. తన ప్రసంగంలో తల్లిదండ్రులకు కృతజ్ఞతలు తెలుపుతూ, "నన్ను తీర్చిదిద్దింది మీరే. మీ కుమారుడినైనందుకు గర్వంగా ఉందని అన్నారు.

## వర్జీనియా గవర్నర్‌గా తెలంగాణ మూలాలున్న డెమొక్రాట్



**వర్జీనియా, నవంబరు 5:** అమెరికా రాజకీయాల్లో భారత సంతతికి చెందిన, అందులోనూ హైదరాబాద్ మూలాలున్న మరో మహిళ సత్తా చాటారు. డెమొక్రాట్ పార్టీకి చెందిన గజాలా హష్మి వర్జీనియా లెఫ్టినెంట్ గవర్నర్ ఎన్నికల్లో ఘన విజయం సాధించారు. హోరాహోరీగా సాగిన పోరులో ఆమె రిపబ్లికన్ పార్టీ అభ్యర్థి జాన్ రీడ్‌పై గెలుపొందారు. ఈ విజయంతో గజాలా గతంలో ప్రాతినిధ్యం వహించిన 15వ సెనెటోరియల్ డిస్ట్రిక్ట్ స్థానానికి ఇప్పుడు ప్రత్యేక ఎన్నిక నిర్వహించాల్సి ఉంటుంది. 2019లో రాజకీయాల్లోకి ప్రవేశించిన గజాలా హష్మి, అనూహ్య రీతిలో రిపబ్లికన్ల ఆధీనంలో ఉన్న స్టేట్ సెనేట్ సీటును గెలుచుకుని సంచలనం సృష్టించారు. వర్జీనియా సెనేట్‌కు ఎన్నికైన తొలి ముస్లిం, తొలి దక్షిణాసియా అమెరికన్‌గా ఆమె చరిత్ర సృష్టించారు. ఐదేళ్ల తర్వాత, 2024లో ఆమె సెనేట్ ఎడ్యుకేషన్ అండ్ హెల్త్ కమిటీకి ఛైర్‌గా నియమితులయ్యారు. ఇప్పుడు లెఫ్టినెంట్ గవర్నర్‌గా ఎన్నికై మరో ఉన్నత స్థాయికి చేరుకున్నారు. గజాలా హష్మి 1964లో హైదరాబాద్‌లోని మలక్‌పేట్‌లో జన్మించారు. ఆమె తల్లిదండ్రులు జియా హష్మి, తన్వీర్ హష్మి. తన నాలుగో ఏట తల్లి, సోదరుడితో కలిసి అమెరికాలోని జార్జియాకు ఆమె వలస వెళ్లారు. ఆమె తండ్రి ప్రొఫెసర్ జియా హష్మీ అలీగఢ్ ముస్లిం యూనివర్సిటీ పూర్వ విద్యార్థి కాగా, తల్లి తన్వీర్ హష్మీ కోఠిలోని ఉస్మానియా యూనివర్సిటీ మహిళా కళాశాలలో చదువుకున్నారు. రాజకీయాల్లోకి రాకముందు గజాలా సుమారు 30 ఏళ్ల పాటు ప్రొఫెసర్‌గా పనిచేశారు. ఎమోరీ యూనివర్సిటీ నుంచి అమెరికన్ లిటరేచర్‌లో పీహెచ్‌డీ పట్టా పొందారు.

# జెడియు సీనియర్‌నేత లలన్‌సింగ్‌పై కేసు నమోదు



**పాట్నా, నవంబరు 5:** బీహార్‌లో తొలిదశ అసెంబ్లీ ఎన్నికల పోలింగ్‌కు ముందు కేంద్ర మంత్రి, జేడీయూ సీనియర్ నేత రాజీవ్ రంజన్ సింగ్ (లలన్ సింగ్) తీవ్ర వివాదంలో చిక్కుకున్నారు. ఎన్నికల ప్రచారంలో రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేశారన్న ఆరోపణలపై ఆయనపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఈ ఎఫ్ఐఆర్ నమోదైంది. మొకామా అసెంబ్లీ నియోజకవర్గంలో ప్రచారం నిర్వహిస్తున్న సమయంలో లాలన్ సింగ్ చేసిన వ్యాఖ్యలకు సంబంధించిన వీడియో ఒకటి వైరల్ అయింది. "పోలింగ్ రోజు కొందరు నాయకులను ఇళ్ల నుంచి బయటకు రాకుండా చూడాలి. ఒకవేళ వాళ్లు మరీ బతిమాలితే, మీతోపాటే తీసుకెళ్లి ఓటు వేయించి, తిరిగి ఇంటికి తీసుకొచ్చి పడుకోబెట్టండి. వాళ్లను ఇంట్లోనే ప్యాక్ చేయాలి. సమయం లేదు, ఇప్పుడే బాధ్యతలు తీసుకోండని ఆయన కార్యకర్తలను ఉద్దేశించి మాట్లాడారు. ఆయన వ్యాఖ్యలపై ప్రధాన ప్రతిపక్షమైన రాష్ట్రీయ జనతా దళ్ (ఆర్జేడీ) తీవ్రంగా పరిగణించి ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేసింది. లలన్ సింగ్ ఎన్నికల సంఘం చాతీపై బుల్డోజర్ నడుపుతున్నారు. నేతలను ఇంట్లో బంధించి, బ్రతిమాలితే ఓటుకు తీసుకెళ్లమని చెబుతున్నారు. ఈసీ ఎక్కడుంది అని ఆర్జేడీ తీవ్రంగా విమర్శించింది. ఆర్జేడీ ఫిర్యాదుతో స్పందించిన ఈసీ కేసు నమోదు చేయాలని ఆదేశించింది. దీంతో భారతీయ న్యాయ సంహిత, ప్రజా ప్రాతినిధ్య చట్టంలోని పలు సెక్షన్ల కింద పోలీసులు ఆయనపై ఎఫ్ఐఆర్ నమోదు చేశారు.

# సిఎం కుర్చీ కోసం నేతల 'మ్యూజికల్‌చైర్'!




**బెంగళూరు, నవంబరు 5:** కర్ణాటక ప్రభుత్వంలో 'నవంబర్ విప్లవం' చోటుచేసుకోనుందని, దీనికోసం ఇప్పటికే కౌంట్ డౌన్ ప్రారంభమైందని బీజేపీ వ్యంగ్యంగా ట్వీట్ చేసింది. ముఖ్యమంత్రి కుర్చీ కోసం కాంగ్రెస్ పార్టీలో పలువురు నేతలు 'మ్యూజికల్ చెయిర్' ఆట ఆడుతున్నారని ఎద్దేవా చేసింది. ఈ నెలతో కర్ణాటకలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి రెండున్నర సంవత్సరాలు పూర్తికావొస్తోంది. అసెంబ్లీ ఎన్నికల ఫలితాల్లో మెజారిటీ సాధించిన కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వ ఏర్పాటులో తీవ్ర తాత్సారం చేసిన విషయం తెలిసిందే. ముఖ్యమంత్రి పీఠం కోసం సీనియర్ నేతలు సిద్దరామయ్య, డీకే శివకుమార్ లు పట్టుబట్టడం వల్లే ప్రభుత్వ ఏర్పాటు ఆలస్యమైందని అప్పట్లో ప్రచారం జరిగింది. దీంతో హైకమాండ్ మధ్యేమార్గంగా చెరో రెండున్నర సంవత్సరాలు సీఎం సీటును పంచుకోవాలంటూ ఇరువురు నేతలకు రాజీ కుదర్చినట్లు రాజకీయ వర్గాల్లో ప్రచారం జరిగింది. తాజాగా రెండున్నర సంవత్సరాలు పూర్తికావొస్తుండడంతో ఈ ఒప్పందం ప్రకారం ముఖ్యమంత్రి మార్పు జరగనుందని తాజాగా వార్తలు వెలువడుతున్నాయి. ఒప్పందం ప్రకారం ముఖ్యమంత్రి పదవిని డీకే శివకుమార్ కు అప్పగిస్తారని కర్ణాటకకు చెందిన కొంతమంది నేతలు అభిప్రాయపడుతున్నారు. అయితే, సీఎం కుర్చీని వదులుకునేందుకు సిద్దరామయ్య అంగీకరించడంలేదని, పూర్తికాలం తానే పదవిలో కొనసాగుతానని పేచీ పెడుతున్నారని సమాచారం. ఒకవేళ తప్పనిసరి పరిస్థితుల్లో తప్పుకోవాల్సి వస్తే తాను సూచించిన వ్యక్తికే సీఎం కుర్చీ అప్పగించాలని హైకమాండ్ ఎదుట డిమాండ్ పెట్టినట్లు సమాచారం. ఈ వార్తలపై బీజేపీ వ్యంగ్యంగా స్పందించింది. కర్ణాటకలో ప్రభుత్వ పెద్దలు ప్రజల సమస్యలను పక్కన పెట్టి కుర్చీ కోసం కొట్లాడుతున్నారని తీవ్ర విమర్శలు చేసింది. ముఖ్యమంత్రి పీఠం కోసం కాంగ్రెస్ పార్టీలో పలువురు నేతలు మ్యూజికల్ చెయిర్ ఆట ఆడుతున్నారని ఆరోపించింది. ఏఐ సాయంతో ఓ వీడియో తయారు చేసి పార్టీ అధికారిక ట్విట్టర్ ఖాతాలో పోస్ట్ చేసింది. ప్రస్తుతం ఈ వీడియో సోషల్ మీడియాలో వైరల్ గా మారింది.

# రాత్రికి రాత్రే రూ.11 కోట్ల జాక్‌పాట్



**అమృత్‌సర్, నవంబరు 5:** రాత్రికిరాత్రే లాటరీతో ఒక చిరువ్యాపారి కరోడ్‌పతి అయ్యాడు. తోపుడు బండిపై కూరగాయలు అమ్ముకుని జీవనం సాగించే ఓ పేద వ్యాపారి తలరాతను లాటరీ టికెట్ మార్చేసింది. స్నేహితుడి దగ్గర అప్పు చేసి కొన్న టికెట్‌కు ఏకంగా రూ.11 కోట్ల జాక్‌పాట్ తగిలింది. పంజాబ్‌లో జరిగిన ఈ ఘటనకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. రాజస్థాన్‌లోని జైపూర్ జిల్లా కోట్‌పుత్లికి చెందిన అమిత్ సెహ్రా బతుకుదెరువు కోసం తోపుడు బండిపై కూరగాయలు అమ్ముతుంటాడు. ఇటీవల పంజాబ్ పర్యటనకు వెళ్లిన ఆయన, భటిండాలోని ఓ దుకాణంలో పంజాబ్ రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించే "దీపావళి బంపర్ 2025" లాటరీ టికెట్‌ను చూశాడు. దానిని కొనడానికి తన వద్ద డబ్బు లేకపోవడంతో, తన స్నేహితుడి వద్ద అప్పు తీసుకుని కొనుగోలు చేశాడు. అక్టోబర్ 31న లాటరీ డ్రా ఫలితాలు వెలువడగా అమిత్ కొన్న టికెట్‌కే మొదటి బహుమతి అయిన రూ.11 కోట్లు దక్కింది. ఈ విషయం తెలుసుకున్న అమిత్ ఆనందానికి అవధుల్లేకుండా పోయాయి. తన సంతోషాన్ని పంచుకుంటూ, "లాటరీ బహుమతి అందుకోవడానికి చండీగఢ్ వెళ్లేందుకు కూడా నా దగ్గర డబ్బుల్లేని పరిస్థితి. దేవుడే కరుణించి చప్పర్ ఫాడ్ కే (ఊహించని విధంగా భారీ బహుమతి) ఇచ్చాడు అంటూ భావోద్వేగానికి గురయ్యాడు.

లాటరీలో గెలిచిన ఈ డబ్బును తన ఇద్దరు పిల్లల చదువుల కోసం వినియోగిస్తానని అమిత్ తెలిపాడు. అంతేకాకుండా,

కష్టకాలంలో లాటరీ టికెట్ కొనడానికి డబ్బులిచ్చి ఆదుకున్న తన స్నేహితుడు ముఖేశ్‌కు రూ.1 కోటి ఇస్తానని ప్రకటించి తన గొప్ప మనసును చాటుకున్నాడు. అదృష్టం, స్నేహితుడి సాయం తన జీవితాన్నే మార్చేశాయని సంతోషం వ్యక్తం చేశాడు.

# ఢిల్లీలో కాలుష్యనివారణకు సాయం చేస్తాం!

## భారత్‌లో చైనా ఎంబసి ప్రతినిధి వెల్లడి




**న్యూఢిల్లీ, నవంబరు 5:** ఢిల్లీలో గాలి నాణ్యత ప్రమాదకర స్థాయికి పడిపోయిన నేపథ్యంలో సహాయం చేయడానికి సిద్ధంగా ఉన్నామని చైనా ప్రకటించింది. ఢిల్లీ, ఎన్‌సీఆర్ ప్రాంతాలు తీవ్రమైన వాయు కాలుష్యంతో ఉక్కిరిబిక్కిరి అవుతున్నాయి. కేంద్ర కాలుష్య నియంత్రణ బోర్డు (సీపీసీబీ) గణాంకాల ప్రకారం చాలా ప్రాంతాల్లో గాలి నాణ్యత సూచి 400 మార్కును దాటింది. గాలి నాణ్యతను మెరుగుపరచడంలో చైనా గణనీయమైన విజయాలు సాధించిందని, ఈ విషయంలో భారత్‌కు సహకరించడానికి తాము సిద్ధంగా ఉన్నామని భారత్‌లోని చైనా ఎంబసీ అధికార ప్రతినిధి యూజింగ్ సోషల్‌మీడియాలో తెలిపారు. ఒకప్పుడు తమ దేశం కూడా తీవ్రమైన పొగమంచుతో ఇబ్బంది పడిందని, అలాంటి సమస్యలను ఎదుర్కొంటున్న వారితో తమ అనుభవాలను పంచుకోవడానికి తాము సిద్ధంగా ఉన్నామని యూజింగ్ పేర్కొన్నారు. భారత్ త్వరలోనే ఈ పరిస్థితి నుంచి బయటపడుతుందని ఆశిస్తున్నామని ఆయన అన్నారు. గతంలో పొగమంచుతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్న చైనా, గాలి నాణ్యతను మెరుగుపరుచుకోవడంలో అద్భుతమైన ఫలితాలు సాధించింది. ఒకప్పుడు బీజింగ్‌తో పాటు పలు చైనా నగరాలు, పారిశ్రామిక కేంద్రాల్లో కాలుష్యం తీవ్రంగా ఉండేది. దీనిని గుర్తించినా చైనా ప్రభుత్వం కఠినమైన నియంత్రణ చర్యలు చేపట్టింది. గాలి నాణ్యత ప్రమాణాలను నిర్దేశించి వాటిని తప్పనిసరిగా పాటించేలా చర్యలు తీసుకుంది. నిబంధనలు ఉల్లంఘించిన వారిపై కఠినమైన జరిమానాలు విధించడంతో పాటు శిక్షలు కూడా అమలు చేసింది. ఫలితంగా గాలి నాణ్యత గణనీయంగా మెరుగుపడింది. కాలుష్యాన్ని తగ్గించే క్రమంలో చైనా వేగంగా పునరుత్పాదక ఇంధన వనరుల వైపు మళ్లింది. విద్యుత్ వాహనాలు, పవన, సౌర విద్యుత్ ఉత్పత్తిపై భారీగా పెట్టుబడులు పెట్టింది. వాయు కాలుష్యం తీవ్రంగా ఉన్న సమయాల్లో కాలుష్య కారక కర్మాగారాలను తాత్కాలికంగా మూసివేయడంతో పాటు కొన్ని కర్మాగారాలను పట్టణాలు, నగరాలకు దూరంగా తరలించింది. ఈ చర్యల ద్వారా పట్టణ ప్రాంతాల్లో గాలి నాణ్యత మెరుగుపడింది. ఢిల్లీతో సహా భారత్‌లోని నగరాల్లో కూడా చైనా తరహా కఠిన చర్యలు తీసుకుంటే పరిస్థితి మెరుగుపడుతుందన్నారు.

# మంచుదుప్పటి కప్పకున్న గుల్మార్గ్

## భూతల స్వర్గంగా హిమాలయ ప్రాంతం



**శ్రీనగర్, నవంబరు 5:** భూతల స్వర్గం జమ్ము కశ్మీర్ లో గత రెండు రోజులుగా భారీగా మంచు కురుస్తోంది. దీంతో పలు ప్రాంతాలు కనుచూపు మేర శ్వేతవర్ణాన్ని సంతరించుకున్నాయి. కశ్మీర్‌లోని ప్రముఖ పర్యాటక ప్రాంతం గుల్మార్గ్ పూర్తిగా మంచుతో కప్పుకుపోయింది. నిరంతరం మంచు వర్షం కురుస్తోంది. దీంతో రోడ్లు, ఇళ్లను మంచు కప్పేసింది. స్కీయింగ్ సిటీ ఎటు చూసినా శ్వేత వర్ణం సంతరించుకుని పర్యాటకులను ఆహ్వానిస్తోంది. స్థానికులు, పర్యాటకులు శీతల వాతావరణాన్ని ఆస్వాదిస్తున్నారు. గుల్మార్గ్‌తోపాటూ ప్రముఖ పర్యాటక ప్రాంతాలు సోనామార్గ్, జోజిలా, గగాంగిర్, కుప్వారాలో కూడా మంచు పడుతోంది. శ్రీనగర్ వాతావరణ కేంద్రం ప్రకారం.. గడిచిన 24 గంటల్లో గుల్మార్గ్‌లో 7.6 సెంటీమీటర్ల మేర మంచు పడింది. దక్షిణ కశ్మీర్‌లోని పహల్గామ్‌లో కూడా గత 24 గంటల్లో 2.1 సెంటీమీటర్ల మంచు, 16.2 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది. సమ్మర్ క్యాపిటల్ శ్రీనగర్‌లో 8 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది. వర్షం, మంచు కారణంగా ఉష్ణోగ్రతలు పడిపోయాయి.

# రాజకీయాల్లోకి ఆర్మీని లాగొద్దు

### - సైన్యానికి కుల, మతాలు లేవు : రాహుల్ వ్యాఖ్యలపై రాజ్‌నాథ్ ఫైర్

**జముయి(బీహార్), నవంబరు 5:** సైన్యానికి కుల, మతాలుండవు, ఆర్మీని రాజకీయాల్లోకి లాగొద్దని రాహుల్‌గాంధీకి కేంద్ర రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ హితవు పలికారు. దేశం సంక్షోభాన్ని ఎదుర్కొన్నప్పుడల్లా, సైనికులు ధైర్యం, శౌర్యం ప్రదర్శించి భారత్‌ను ఉన్నత స్థాయికి తీసుకెళ్లారని పేర్కొన్నారు. భారత సైన్యం అగ్రవర్ణాల గుప్పిట్లో ఉందని రాహుల్ వ్యాఖ్యలను రక్షణమంత్రి తీవ్రంగా తప్పుబట్టారు. బీహార్‌లోని జముయిలో నిర్వహించిన ఎన్నికల సభలో రాజ్‌నాథ్ సింగ్ మాట్లాడుతూ... సాయుధ దళాల్లో రిజర్వేషన్ల డిమాండ్ చేయడం ద్వారా దేశంలో అరాచకత్వాన్ని సృష్టించడానికి రాహుల్ గాంధీ ప్రయత్నిస్తున్నారని మండిపడ్డారు. పహల్గాంలో పాక్ ప్రేరేపిత ఉగ్రవాదులు దాడికి పాల్పడితే ఆపరేషన్ సిందూర్ చేపట్టి పాక్‌లోని ప్రధాన ఉగ్రవాద స్థావరాలను తుదముట్టించామన్నారు. ఆపరేషన్ సిందూర్ ఇంకా ముగియలేదని, కాస్త విరామం ఇచ్చామన్నారు. భారత్ వైపు కన్నెత్తి చూస్తే, వారి అంతుచూస్తామని పాక్‌కు పరోక్షంగా హెచ్చరికలు చేశారు.

# జకీర్‌నాయక్‌కు బంగ్లాదేశ్‌లో అనుమతి నిరాకరణ



**ఢాకా, నవంబరు 5:** భారత్‌కు మోస్ట్ వాంటెడ్, వివాదాస్పద ఇస్లాం మత ప్రచారకుడు జకీర్ నాయక్‌కు బంగ్లాదేశ్ తాత్కాలిక ప్రభుత్వం గట్టి షాక్ ఇచ్చింది. ఆయన దేశంలోకి ప్రవేశించేందుకు అనుమతి నిరాకరించింది. నవంబర్ 28 నుంచి డిసెంబర్ 20 వరకు జకీర్ నాయక్ బంగ్లాదేశ్‌లో పర్యటించనున్నారని అక్టోబర్ చివరిలో వార్తలు వచ్చాయి. అయితే, కేవలం వారం రోజుల వ్యవధిలోనే ఈ పర్యటనను పూర్తిగా రద్దు చేస్తున్నట్లు ఆ దేశ విదేశీ వ్యవహారాల శాఖ స్పష్టం చేసింది. 2016లో బంగ్లాదేశ్ రాజధాని ఢాకాలోని హోలీ ఆర్టిజన్ కేఫ్‌పై జరిగిన ఉగ్రదాడిలో 29 మంది ప్రాణాలు కోల్పోయారు. ఈ దాడికి పాల్పడిన ఉగ్రవాదులు జకీర్ నాయక్ ప్రసంగాల ద్వారానే ప్రేరణ పొందారని దర్యాప్తులో తేలింది. దీంతో అప్పటి షేక్ హసీనా ప్రభుత్వం ఆయనకు చెందిన పీస్ టీవీ ఛానల్‌ను నిషేధించడంతో పాటు, జకీర్ నాయక్ బంగ్లాదేశ్‌లో అడుగుపెట్టకుండా నిషేధం విధించింది. ఇప్పుడు తాత్కాలిక ప్రభుత్వం కూడా పాత నిషేధాన్ని కొనసాగిస్తూ ఆయన పర్యటనకు అనుమతి నిరాకరించడం చర్చనీయాంశంగా మారింది. భారత్‌లో రెచ్చగొట్టే ప్రసంగాలు, ఉగ్రవాదులకు నిధులు సమకూర్చడం, మనీ లాండరింగ్ వంటి తీవ్రమైన ఆరోపణలు ఎదుర్కొంటున్న జకీర్ నాయక్ 2016లో దేశం విడిచి పారిపోయాడు. అప్పటి నుంచి ఆయన మలేషియాలో ఆశ్రయం పొందుతున్నాడు. ఆయనపై రెడ్ కార్నర్ నోటీసు జారీ చేయాలని భారత్ ఇంటర్‌పోల్‌ను ఆశ్రయించినప్పటికీ సరైన ఆధారాలు లేవంటూ ఆ అభ్యర్థన తిరస్కరణకు గురైన విషయం తెలిసిందే.

# సంక్షిప్తంగా..

### ఆధ్యాత్మికవేత్త రవిశంకర్‌కు 'వరల్డ్ లీడర్ ఫర్ పీస్ అండ్ సెక్యూరిటీ' అవార్డు!



**బోస్టన్, నవంబర్ 5:** ప్రముఖ ఆధ్యాత్మికవేత్త గురుదేవ్ శ్రీశ్రీ రవిశంకర్ '2025 వరల్డ్ లీడర్ ఫర్ పీస్ అండ్ సెక్యూరిటీ' అవార్డును అందుకున్నారు. బోస్టన్ గ్లోబల్ ఫోరం, ఎఐ వరల్డ్ సొసైటీ ఆధ్వర్యంలో అమెరికాలోని బోస్టన్‌లో ఆయన్ను ఘనంగా సన్మానించారు. భారత్‌తో పాటు ప్రపంచంలో శాంతి, పరిరక్షణ, నాయకత్వాన్ని ప్రోత్సహించడంలో ఆయన చేసిన కృషికి గాను ఈ పురస్కారంతో గౌరవించారు. వరల్డ్ లీడర్ ఫర్ పీస్ అండ్ సెక్యూరిటీ అవార్డు పదో వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని 2025 సంవత్సరానికిగాను గురుదేవ్‌ను ఎంపిక చేశారు. ఈ అవార్డును ప్రారంభించినప్పటి నుంచి ప్రపంచ శాంతికి సంబంధించి నైతిక, వ్యూహాత్మక మూలాలను బలోపేతం చేసిన అసాధారణ వ్యక్తులను సన్మానిస్తున్నారు.

### నడిరోడ్డుపై దేశాధ్యక్షురాలికి లైంగిక వేధింపులు!



**మెక్సికో, నవంబర్ 5:** మెక్సికోలో దిగ్భ్రాంతికర ఘటన చోటుచేసుకుంది. ఏకంగా దేశాధ్యక్షురాలే నడిరోడ్డుపై లైంగిక వేధింపులు ఎదుర్కోవడం కలకలం సృష్టించింది. మెక్సికో దేశాధ్యక్షురాలు క్లాడియా షీన్‌బామ్ మంగళవారం ఓ బహిరంగ కార్యక్రమానికి హాజరయ్యారు. అక్కడ ఆమె ప్రజలతో మాట్లాడుతుండగా వెనుక నుంచి వచ్చిన ఓ వ్యక్తి అధ్యక్షురాలిపై చేయి వేస్తూ ఆమెను ముద్దుపెట్టుకోబోయాడు. వెంటనే అధ్యక్షురాలి భద్రతా సిబ్బంది అతడిని పక్కకు నెట్టారు. అయినప్పటికీ అతడు క్లాడియాను అయినప్పటికీ అతడు క్లాడియాను అసభ్యంగా తాకుతుండటంతో ఆమె ఇబ్బంది పడుతూ అతడి చేతిని పక్కకు నెట్టిన దృశ్యాలు వీడియోలో కనిపిస్తున్నాయి. దృశ్యాలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారడంతో నెటిజన్లు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. దేశాధ్యక్షు రాలికే భద్రత లేకపోతే సాధారణ మహిళల పరిస్థితేంటంటున్నారు.

### టేకాఫ్ సమయంలోనే కుప్పకూలిన రవాణా విమానం

**లూయిస్ విల్లే, నవంబరు 5:** అమెరికాలో ఘోర విమాన ప్రమాదం సంభవించింది. లూయిస్‌విల్లే నగరంలో టేకాఫ్ తీసుకుంటున్న సమయంలో ఓ కార్గో విమానం కుప్పకూలింది. ఈ దుర్ఘటనలో ముగ్గురు అక్కడికక్కడే మరణించగా, మరో 11 మంది తీవ్రంగా గాయపడ్డారు. ఈ ప్రమాదాన్ని అమెరికా ఫెడరల్ ఏవియేషన్ అడ్మినిస్ట్రేషన్ (ఎఫ్ఎఎ) అధికారికంగా ధ్రువీకరించింది. యూపీఎస్‌కు చెందిన ఫ్లైట్ నంబర్ 2976 కార్గో విమానం లూయిస్‌విల్లే నుంచి హోనులులుకు బయలుదేరింది. స్థానిక కాలమానం ప్రకారం సాయంత్రం 5:15 గంటలకు టేకాఫ్ అవుతుండగా ఈ ప్రమాదం చోటుచేసుకుంది. గాల్లోకి ఎగురుతున్న సమయంలో విమానంలో ఒక్కసారిగా మంటలు చెలరేగి, అదుపుతప్పి కిందకు పడిపోయింది. మెక్‌డోనెల్ డగ్లస్ ఎండీ11 రకానికి చెందిన ఈ విమానం పూర్తిగా దగ్ధమైంది.

# ఉపాధిలేక నిట్టూరిస్తున్న పాక్ యువత!



**ఇస్లామాబాద్, నవంబరు 5:** పొరుగు దేశం పాకిస్థాన్‌లో నిరుద్యోగం తాండవిస్తోంది. దేశంలోని మూడింట ఒక వంతు యువత 15-35 ఏళ్ల మధ్యవయసు వారు ఎలాంటి ఉపాధి లేకుండా ఉన్నట్లు తాజా నివేదికలు స్పష్టం చేస్తున్నాయి. దేశంలో తొలిసారిగా నిర్వహించిన డిజిటల్ జనాభా లెక్కల ప్రకారం, నిరుద్యోగ రేటు 7.8 శాతంగా నమోదైంది.

అంటే, మొత్తం 24.15 కోట్ల జనాభాలో దాదాపు 1.87 కోట్ల మందికి పని లేదని అర్థం. ఈ సంక్షోభం కనిపించే దానికంటే చాలా లోతుగా ఉంది. చదువు, ఉద్యోగం లేదా శిక్షణ వంటివి ఏవీ లేకుండా ఖాళీగా ఉన్న యువత సంఖ్య లక్షల్లో ఉంది. వీరికి తోడు, మహిళల్లో ఉద్యోగ భాగస్వామ్యం ఈ ప్రాంతంలోనే అత్యంత తక్కువగా ఉండటం సమస్యను మరింత జఠిలం చేస్తోంది. దేశ ఆర్థిక వ్యవస్థకు అవసరమైన నైపుణ్యాలను అందించడంలో అక్కడి విద్యావ్యవస్థ విఫలమవుతోందని నిపుణులు విశ్లేషిస్తున్నారు.

## కార్తీక పౌర్ణమి శోభ

# ఆలయాలకు పోటెత్తిన భక్తులు



విజయవాడ: శివాలయంలో కార్తీక దీపారాధన



విజయవాడ కృష్ణానదీ తీరంలో మహిళల కార్తీక దీపారాధన

విజయవాడ, నవంబరు 5 ప్రభాతవార్త ప్రతినిధి: కార్తీక పౌర్ణమి సందర్భంగా బుధవారం ఉదయం నుండి ఆలయాలకు భక్తులు పోటెత్తారు. రాష్ట్రంలోని ప్రధాన ఆలయాలో పాటు అన్ని ఆలయాల్లో భక్తుల సందడి కనిపించింది. చాలా ఆలయాల్లో ఉదయం 4 గంటల నుంచి దర్శనం కోసం బారులు తీరారు. కార్తీక దీపాలు వెలిగిస్తూ ప్రత్యేక పూజలు చేశారు. మహాశైవ క్షేత్రాలన్నింటిలోను వేకువ జామునే కార్తీకదీపారాధ, సాయంత్ర జ్వాల తోరణం కార్యక్రమాలు జరిగాయి. పోలీసులు పటిష్టమైన ఏర్పాట్లను చేశారు. కార్తీక పౌర్ణమి కావడంతో దేవాలయాలు భక్తులు ప్రమీదల్లో తైల దీపాలను వెలిగించి లింగాకృతిలో అలంకరణ చేయడంతో కార్తీక శోభతో కళకళలాడాయి. రాజమండ్రిలోని గోదావరి నది ఒడ్డున ఉన్న పుష్కర్ ఘాట్‌కు వేల సంఖ్యలో భక్తులు పోటెత్తారు. గోదావరిలో కార్తీక స్నానం ఆచరించి, పవిత్రంగా దీపాలు వదిలారు. పుష్కర్ ఘాట్, దాని పక్కనే ఉన్న కోటి లింగాల ఘాట్లు శివనామస్మరణతో మార్మోగాయి. ఘాట్ సమీపంలోని శివాలయాలలో శివుడికి ప్రత్యేకంగా అభిషేకాలు నిర్వహించారు. కాశీబుగ్గ వెంకటేశ్వర స్వామి దేవాలయం వద్ద తొక్కిసలాట జరిగింది. ఈ నేపథ్యంలో ఎన్టీఆర్ జిల్లా పోలీసులు అప్రత్తమయ్యారు. కార్తీక పౌర్ణమి పురస్కరించుకొని కమీషనరేట్ పరిధిలోని దేవాలయాల వద్ద కట్టుదిట్టమైన భద్రతను ఏర్పాటు చేశారు. పోలీసు కమీషనర్ ఎస్వి రాజశేఖరబాబు ఆదేశాల మేరకు ఆలయాల వద్ద ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా జాగ్రత్తలను తీసుకున్నారు.

## శ్రీకాళహస్తీశ్వరాలయం

# భక్తులతో కిటకిట



శ్రీకాళహస్తీశ్వరాలయంలో సామూహిక పూజలు చేస్తున్న మహిళలు

శ్రీకాళహస్తి, నవంబరు 5 ప్రభాతవార్త: కార్తీక పౌర్ణమి సందర్భంగా శ్రీకాళహస్తీశ్వరాలయం, పట్టణం మహాశివ రాత్రికి కూడా రానంత మహిళా భక్తులు కదలి తరంగాల్లా కదలి వచ్చారు. ఆలయం చుట్టూ ఉన్న వీధు ల్లో జనమే జనం అన్నట్లు మారింది. ముఖ్యంగా మొదటి గేటు బిక్షాల గాలిగోపురం నుంచి అడుగువేయటానికి కూడా స్థలం లేకుండా మారింది. ఓ వైపు దీపాలు వెలిగించుట మరో వైపు స్వామి అమ్మవార్ల దర్శనాలకు విపరీతమైన రద్దీ చోటు చేసుకుంది. ఏర్పాట్లును ఇఓ డి.బాపిరెడ్డి పర్యవేక్షణలో డిప్యూటి ఇఓ ఎన్ఆర్ కృష్ణారెడ్డి, ఆలయాధికారులు ఎఇఓలు మోహన్, విద్యాసాగర్‌రెడ్డి టెంపుల్ ఇన్‌స్పెక్టర్ వవెంకటస్వామి, సుదర్శనం నాయుడు, పర్యవేక్షణాధికారి నాగభూషణం యాదవ్‌లు పర్యవేక్షించారు. అనంతరం ఆలయంలో నిర్వహించిన ప్రదోష నందిసేవలో ఆమె పాల్గొన్నారు. చిన్నవెండి నందివాహనంపై స్వామి వారిని ప్రతిష్టించి ఆలయంలో ఉత్సవాన్ని నిర్వహించారు. శ్రీకాళహస్తీశ్వ రాలయంతో పాటు చుట్టుపక్కల పురాణ ప్రసిద్ధి చెందిన శివాలయాల్లో విశేష పూజలు జరిగాయి. ముఖ్యంగా సువర్ణముఖి నదీ తీరాన వెలసిన అర్ధనారీశ్వ రాలయానికి భక్తులు తరలి వచ్చి పూజలు జరిపి దీపాలు వెలిగించారు. కైలాసగిరుల్లో వెలసిన వేయి లింగాలకోనలో కొండకొనల్లో వెలసిన స్వామి చెంతకు వచ్చిన భక్తులతో కిటకిట లాడింది. పనస కోనలో వెలసిన స్వామి వారికి రాజీవ్‌నగర్, కైలాసగిరికాలనీతో పాటు చుట్టుపక్కల గ్రామాల భక్తులు వరుస కట్టారు.

# కాణిపాకం గణనాధునికి ఘనంగా అన్నాభిషేకం

### ఆకట్టుకున్న ప్రత్యేక అలంకరణ... ఆలయానికి పోటెత్తిన భక్తులు



కాణిపాకం ఆలయంలో భక్తులను విశేషంగా ఆకట్టుకున్న బంగారు ధ్వజస్తంభానికి చేసిన ప్రత్యేక అలంకరణ

కాణిపాకం, నవంబరు 5 ప్రభాతవార్త: కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయక స్వామి దేవస్థానంలో బుధవారం స్వామివారికి అన్నాభిషేకంను అత్యంత ఘనంగా నిర్వహించారు. ప్రతి ఏటా ఆలయంలో కార్తీకపౌర్ణమి సందర్భంగా స్వామివారికి అన్నాభిషేకం నిర్వహించ దం ఆనవాయితీ. ఈమేరకు బుధవారం స్వామివారికి ఈ కార్యక్రమంను నిర్వహించారు. ఈకార్యక్రమానికి కాణిపాకంకు చెందిన దివంగత సల్లా సుబ్బరాయలు శెట్టి కుమారులు సల్లా వాసు, సల్లా హరిలు ఉభయదారులుగా వ్యవహరించారు. ఈమేరకు వీరు ఉదయం మంగళవాయిద్యాల నడుమ వరుస ఉభయం తీసుకు రాగా ఆలయంలో అర్చక స్వాములు స్వామివారి మూలవిరాట్‌కు వేదపండితుల మంత్రోచ్చారణ నడుమ శాస్త్రోక్తంగా పంచామృ తాభిషేకం నిర్వహించారు. అనంతరం స్వామివారిని అన్నంతో శోభాయమానంగా అలంకరించి ధూపదీప నైవేద్యాలను సమర్పించి భక్తులకు దర్శనం కల్పించారు. ఈసందర్భంగా వివిధ రకాల పిండి వంటలు, పండ్లను స్వామివారికి నైవేద్యంగా సమ ర్పించారు. అనంతరం భక్తులకు స్వామివారి దర్శనం కల్పించారు. అన్నాభిషేకం సందర భంగా ఉభయ దారులచే ఆలయంలో చేపట్టిన ప్రత్యేక అలంకరణ ఎంతో అకట్టుకుంది. ఈమేరకు ప్రధాన ఆలయంతో పాటు బంగారు ధ్వజ స్థంభం, అన్వేటి మండపం, సుపథమండపంలను వివిధ రకాల పుష్పాలతో అలంకరించిన తీరు ఎంతో ఆకట్టుకుంది. ఈ కార్య క్రమంలో ఆలయ ఈఓ కె.పెంచల కిషోర్, ఏఈఓ రవీంద్రబాబు, సూపరెండెంట్ కోదండపాణి, శ్రీధర్ బాబు, టెంపుల్ ఇన్స్‌పెక్టర్‌లు బాలాజి నాయుడు, చిట్టిబాబు, ఉత్సవ ఉభయదారులు, అర్చకులు, వివిధ ప్రాంతాల నుండి వచ్చిన భక్తులు పాల్గొన్నారు.

# కోనలో శ్రీవారికి వైభవంగా ఏకోత్తర సహస్ర కళశాభిషేకం

రాపూరు (నెల్లూరు), నవంబరు 5 ప్రభాతవార్త: ప్రముఖ పుణ్యక్షేత్రమైన పెంచలకోనలో శ్రీశ్రీశ్రీ పెనుశిల లక్ష్మీనరసింహ స్వామి వారికి బుదవారం కార్తీక పౌర్ణమి పర్వదినాన్ని పురస్కరించుకోని ఏకోత్తర సహస్ర కళశాభిషేకం (1001) వైభవంగా నిర్వహించారు. ఇందులో బాగంగా ఉదయం ప్రతిష్టించిన కళాశాలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం స్వామి వారికి హోమం నిర్వహించారు. తదుపరి కళాశాలలోని జళాలతో స్వామి వారికి సహస్ర కళాశాభిషేకం వేదమంత్రోచ్ఛరణలతో శాస్రోక్తంగా భక్తి శ్రద్దలతో నిర్వహించారు. పెద్ద ఎత్తున భక్తులు ఈ కార్యక్రమంలో పాల్గోని స్వామి వారిని దర్శించుకోని పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఉప కమీషనర్ పోరెడ్డి శ్రీనివాసుల రెడ్డి, సినీయర్ సహాయుడు పాలవల్లి లక్ష్మీ నారాయణ, ప్రధానార్చకులు గుండ్లూరు రామయ్య స్వామి, పెంచల పెంచలయ్య స్వామి, ముఖ్య అర్చకుడు గుండ్లూరు శశి స్వామి, అర్చక స్వామలు మధు స్వామి, వినోధ్ స్వామి, వెంకట బాలాజీ స్వామి,వర్ధన్ స్వామి, నాగరాజు స్వామి, సాయి స్వామి, మోక్షజ్ఞ స్వామి తదితరులున్నారు.



# గుడిమల్లం ఆలయంలో బారులు తీరిన భక్తులు



శ్రీకాళహస్తిరూరల్, నవంబరు 5 ప్రభాతవార్త: ఏర్పేడు మండలంలోని గుడిమల్లం అతి పురాతనమైన ఆలయం. కార్తీక పౌర్ణమి సందర్భంగా బుధవారం ఆలయం భక్తులతో కిటకిట లాడింది. అనందవల్లి సమేత పరశురామేశ్వరాలయంలో మాజీ ధర్మకర్తల మండలి చైర్మన్ బత్తల గిరిబాబునాయుడు పర్యవేక్షణలో ధార్మిక కార్యక్రమాలు చేపడుతున్నారు. ఈనేపథ్యంలో బుధవారం ఏకదినసాధ్య లక్ష్య బిల్వార్చన కార్యక్రమాలను ఏర్పాటు చేసారు. చుట్టుపక్కల అడువుల్లోంచి బిల్వ పత్రాలను సేకరించి స్వామి వారికి సమర్పించుటకు ఊరే గింపుగా తీసుకొని వచ్చారు. బిల్వాలతో స్వామి అమ్మ వారిని పూజించారు. అలాగే ఆలయ ఆవరణలో లక్ష దీపో త్సవం నిర్వహించి దీపాల వెలుగుతో నింపారు. అలాగే ఆలయానికి చుట్టుపక్కల గ్రామాల నుంచి వచ్చిన భక్తులకు సహపంక్తి వన భోజనాలు ఏర్పాటు చేసారు. భక్తులు ఇబ్బంది పడకుండా ఆలయ కార్యనిర్వహణాధికారి రామచంద్రారెడ్డి, మాజీ చైర్మన్ బత్తల గిరిబాబు నాయుడు పర్యవేక్షించారు.



## బీహార్- కర్ణాటక మధ్య ప్రత్యేక రైళ్లు

గుంతకల్లు రైల్వే, నవంబరు 5 ప్రభాతవార్త: సాధరణ తరగతి ప్రయాణీకుల డిమాండ్ మేరకు ఆంధ్రప్రదేశ్ మీదుగా బీహార్‌లోని బాగల్‌పూర్- యశ్వంతపూర్ మధ్య వేర్వేరు మార్గాల మీదుగా అన్ రిజర్వుడు ప్రత్యేక ఎక్స్‌ప్రెస్ రైలు సర్వీసులను నడుపుతున్నట్లు రైల్వే వర్గాలు తెలిపాయి. బాగల్ పూర్ నుంచి యశ్వంతపూర్ వెళ్ళే నంబర్ 03403 అన్ రిజర్వుడ్ ప్రత్యేక ఎక్స్‌ప్రెస్ రైలు ఈనెల 7 శుక్రవారం రాత్రి 10:30 గంటలకు బీహార్‌లోని బాగల్‌పూర్ నుంచి బయలుదేరి, 9వ తేది ఆదివారం రాత్రి 11:50 గంటలకు యశ్వంతపూర్ చేరు కుంటుంది. రాష్ట్రంలోని పలస, విజయనగరం, కొత్తవలస, దువ్వాడ, రాజమండ్రి, విజయవాడ, ఒంగోలు, నెల్లూరు, గూడూరు, రేణిగుంట, కర్ణాటక రాష్ట్రాలలోని ముఖ్యమైన స్టేషన్‌లలో నిలువనుంది. తిరుగు ప్రయాణంలో యశ్వంతపూర్ నుంచి బాగల్ పూర్ వెళ్ళే నంబర్ 03404 అన్ రిజర్వుడు ప్రత్యేక ఎక్స్‌ప్రెస్ రైలు ఈనెల 10న సోమవారం ఉదయం 07:00 గంటలకు యశ్వంతపూర్ నుంచి బయలుదేరి ఈనెల 12న బుధవారం ఉదయం 07:30 గంటలకు బాగల్ పూర్ చేరుకుంటుంది. మార్గమధ్యంలో ఈరైలు రాష్ట్రంలో యలహంక, హిందూపురం, ధర్మవరం, డోన్, గుంటూరు, విజయవాడ, దువ్వాడ, కొత్తవలస, విజయ నగరంలతో పాటు బీహార్, జార్ఖండ్, పశ్చిమ బెంగాల్, ఒడిశా రాష్ట్రాలలోని ముఖ్యమైన స్టేషన్లలో నిలుస్తాయి.

### జర్నలిజంలో డిప్లమా కోర్సు

## 'సప్లిమెంటరీ పరీక్షలో 14 మంది ఉత్తీర్ణత

విజయవాడ, నవంబరు 5 ప్రభాతవార్త ప్రతినిధి: సిఆర్ మీడియా అకాడమీ అధ్వర ంయలో నిర్వహించిన జర్నలిజంలో డిప్లమో కోరు ్స సప్లిమెంటరీ పరీక్షల్లో 14 మంది ఉత్తీర్ణత సాధించారని మీడియా అకాడమి చైర్మన్ ఆలపాటి సురేష్ కుమార్ ఒక ప్రకటనలో వెల్లడించారు. ఆచార్య నాగార్జున యూనివర్సిటీ ఆగస్టు నెలలో నిర్వహించిన ఈ పరీక్షలకు గతంలో ఉత్తీర్ణులు కాని 50 మంది అభ్యర్థులు ధరఖాస్తు చేసుకున్నారని, వీరిలో 28 మంది పరీక్షలకు హాజరుకాలేదని ఆ ప్రకటనలో పేర్కొన్నారు. పరీక్షలకు హాజరైన వారిలో 8 మంది ఉత్తీర్ణులు కాలేదని ఆ ప్రకటనలో తెలిపారు. ఫలితాలు నాగార్జున యూనివర్సిటీ వెబ్‌సైట్ (హెచ్‌టిటిపిఎస్//డబ్ల్యు.డబ్ల్యు.డబ్ల్యు. నాగార్జునయూనివర్సిటీ.ఎసి.ఇన్)లో 'రిజల్ట్స్'లో అభ్యర్థులు తమ రిజిష్టర్ నెంబరును ఎంటర్ చేసి తెలుసుకోవచ్చని తెలిపారు. సిఆర్ మీడియా అకాడమీ చైర్మన్ ఆలపాటి సురేష్ కుమార్ ఉత్తీర్ణులైన అభ్యర్థులకు అభినందనలు తెలిపారు.

# రెండేళ్లలో బిటిపి పూర్తి చేసి చెరువులకు నీరిస్తాం

- కళ్యాణదుర్గం నియోజకవర్గ అభివృద్ధికి ప్రత్యేక చర్యలు
- ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు వెల్లడి

అనంతపురం, నవంబరు 5 ప్రభాతవార్త బ్యూరో: అనంతపురం జిల్లాలో వెనుకబడిన కళ్యాణదుర్గం నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేయాలన్న లక్ష్యంతో ప్రణాళికలు రూపొందిస్తు న్నామని, అందులో భాగంగా బిటిపి ప్రాజెక్టును రెండేళ్లలో పూర్తి చేసి చెరువులకు నీరు ఇస్తామని స్థానిక శాసనసభ్యులు అమిలినేని సురేంద్రబాబు ధీమా వ్యక్తం చేశారు. రహదారులు, స్కూళ్ల అభ్యు న్నతికి కూడా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని వివరించారు. ప్రభాత వార్త ప్రతినిధికి ఇచ్చిన ఇంటర్వ్యూలో కళ్యాణదుర్గం అభివృద్ధికి తాను తీసుకుంటున్న చర్యలను ఎమ్మెల్యే సురేంద్రబాబు వెల్లడించారు. బిటిపి ప్రాజెక్టు అనేది కళ్యాణదుర్గం నియోజకవర్గ ప్రజల చిరకాల కోరిక. ఎన్నికల సమయంలో నాతోపాటు మంత్రి నారా లోకేష్ తదితరులు హామీలు ఇచ్చామన్నారు. అసెంబ్లీ సమావేశాల్లో కూడా రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు బిటిపి ప్రాజెక్టును పూర్తి చేస్తామని హామీ ఇచ్చినట్లు ఆయన వెల్లడించారు. కూటమి ప్రభుత్వం బిటిపి ప్రాజెక్టును పూర్తి చేసేందుకు చర్యలు తీసు కుంటోందన్నారు. ప్రస్తుతం బిటిపి ప్రాజెక్టు పనులు శరవేగంగా జరుగుతున్నాయని ఆయన వెల్లడించారు. భూ సేకరణ సమస్య పెండింగ్‌లో ఉండటం వల్ల కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత 14, 16 నెలలు ఆలస్యమైందని ఇందుకు సంబంధించి అన్ని చర్యలు తీసుకుంటున్నామని రాబోయే రెండేళ్లలో బిటిపి ప్రాజెక్టును పూర్తి చేస్తామన్నారు. సివిల్ పనులు చురుగ్గా సాగుతున్నాయని ఇందుకు సంబంధించి కాంట్రాక్టర్లకు డబ్బులు ఇవ్వలేదని ఓ ప్రశ్నకు సమాధానంగా ఎమ్మెల్యే సురేంద్ర బాబు వెల్లడించారు.

### పిఎం జిఎస్‌వై కింద 24 రోడ్లు మంజూరు

అనంతపురం జిల్లాలో పిఎస్‌ఓ కింద 39 రోడ్లు మంజూరు అయితే ఒక్క కళ్యాణదుర్గం నియోజకవర్గానికే రూ.100 కోట్లతో 24 రోడ్లు మంజూరు అయ్యాయని ఎమ్మెల్యే సురేంద్రబాబు వెల్లడించారు. రోడ్ల అభ్యున్నతికి ఎక్కువ దృష్టి పెట్టినట్లు ఆయన వెల్లడించారు. రఘువీరారెడ్డి కళ్యాణదుర్గం శాసనసభ్యునిగా ఉన్నప్పుడు చుట్టూ రింగు రోడ్లు మాత్రమే వేశాదని, నియోజకవర్గంలో రోడ్లు గురించి పట్టించు కోలేదన్నారు. అయితే కూటమి ప్రభుత్వంలో రోడ్ల అభివృద్ధికి కూడా చర్యలు తీసుకుంటున్నామని, అందులో భాగంగా సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి 24 రోడ్లను కొత్తగా నిర్మించేందుకు పిఎం జిఎస్‌వై కింద మంజూరు చేయించినట్లు ఆయన వెల్ల డించారు. అదే సమయంలో స్కూళ్ల అభివృద్ధిని కూడా దశల వారీగా చర్యలు తీసుకుంటామని ఆయన వెల్లడించారు. కళ్యాణదుర్గం రూరల్ మండలం పాలవాయి స్కూల్‌లో దాదాపు 70 లక్షలతో మౌలిక సదుపాయాలు కల్పించేందుకు చర్యలు తీసుకున్నామని, బాస్కెట్‌బాల్ కోర్టు, టాయిలెట్లు, ఇతర పనులు చేసినట్లు ఆయన వెల్లడించారు. అదే విధంగా కళ్యాణదుర్గం నియోజకవర్గానికి పరిశ్రమలు తీసుకొచ్చేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు ఎమ్మెల్యే సురేంద్ర బాబు వెల్లడించారు.



తిమ్మసముద్రం వద్ద పరిశ్రమల కోసం 1000 ఎకరాలను ఏపిఐఐసికి అప్పగించి నట్లు ఆయన వెల్లడించారు. ఇందులో భాగంగా ఎంఎస్ఎంఈ కింద 300 ఎకరాలను రూ.4 కోట్ల సివిల్ పనులతో అభివృద్ధి చేస్తున్నట్లు ఆయన వెల్లడించారు. కళ్యాణ దుర్గానికి రెండు డిఫెన్స్ కంపెనీలు వచ్చాయన్నారు. 150 ఎకరాల్లో ఎయిర్ స్ట్రిప్ పరిశ్రమ వస్తోందన్నారు.

### కళ్యాణదుర్గం మున్సిపాలిటీ అభివృద్ధికి చర్యలు

ఎమ్మెల్యేగా తాను గెలిచిన తర్వాత కళ్యాణదుర్గం మున్సిపాలిటీపైన కూడా దృష్టి పెట్టినట్లు సురేంద్ర బాబు తెలిపారు. ప్రస్తుతం రోడ్ల అభివృద్ధికి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని, వాల్మీకి సర్కిల్‌ను అభివృద్ధి చేస్తున్నాం, అక్కడ 10 అడుగల హంస విగ్రహాన్ని కూడా ఏర్పాటు చేస్తున్నామని ఆయన వెల్ల డించారు. వాల్మీకి సర్కిల్‌లో రూ.80 లక్షల ఖర్చుతో వివిధ కార్యక్రమాలు చేస్తున్నట్లు ఆయన వెల్లడిం చారు. ఆర్ అండ్ బి సర్కిల్‌లో ఆక్రమణలను తొల గించి రోడ్ల విస్తరణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటు న్నామని వివరించారు. 7, 8 తేదీల్లో మంత్రి లోకేష్ వస్తున్నందున మంత్రి కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు సన్నాహాలు చేస్తున్నట్లు ఆయన వెల్ల డించారు. ఈ కార్యక్రమంలో మంత్రులు, ఎమ్మెల్యేలు, నాయకులు పాల్గొంటారని ఆయన వివరించారు.



## జీవ ఎరువులతో భూమాతకు రక్ష

విజయవాడ, నవంబరు 5 ప్రభాతవార్త ప్రతినిధి: రసాయన ఎరువుల స్థానంలో జీవ ఎరువులకు (బయో ఫెర్టిలైజర్స్) ప్రోత్సహించాలని, వీటిని విరివిగా వాడేలా రైతుల్ని చైతన్యపర్చాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ లక్ష్మీశ అధికారులకు సూచించారు. బుధవారం స్థానిక కలెక్టరేట్‌లో నిర్వహించిన జిల్లా స్థాయి భూమాత రక్షణ కమిటీ (మదర్ ఎర్త్ ప్రొటక్షన్ కమిటీ) సమావేశానికి జిల్లా కలెక్టర్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేలఆరోగ్యాన్ని కాపాడేందుకు, సుస్థిర వ్యవసాయ పద్దతులను ప్రోత్సహించేందుకు కేంద్ర ప్రభుత్వం భూమాత రక్షణ కార్యక్రమాన్ని (మదర్ ఎర్త్ ప్రొటెక్షన్ ప్రోగ్రాం) చేపట్టిందని చెప్పారు. ఇందులో భాగంగా జిల్లా సబ్ డివిజన్, గ్రామ స్థాయిలలో వివిధ శాఖల అధికారులతో భూమాత రక్షన కమిటీలు ఏర్పాటు చేయాలన్నారు. 12వ తేదీ నాటికి కమిటీలను ఏర్పాటు చేసి గ్రామసభలు నిర్వహించాలని సూచించారు. గ్రామాల వారీగా సొసైటీల వారీగా ఎరువుల వినియోగాన్ని పరిశీలించాలన్నారు. రైతులకు రసాయన ఎరువుల వల్ల కలిగే నష్టాలపై అవగాహన కల్పించాలని చెప్పారు. రసాయన ఎరువులకు ప్రత్యామ్నాయంగా జీవ ఎరువుల వాడకాన్ని ప్రోత్సహించాల న్నారు. డ్రోన్లు ఉన్న గ్రామాల్లో లిక్విడ్ యూరియా/ నానో యూరియా వినియోగించాలని చెప్పారు. ఎరువులు పక్కదారి పట్టకుండా ఈ కమిటీలు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఈ సమావేశంలో జిల్లా స్థాయి భూమాత రక్షణ కమిటీ సభ్యులైన జడ్పీ సీఈఓ జె.కన్నమనాయుడు, జిల్లా వ్యవసాయ అధికారి డిఎంఎస్ విజయకుమార్, పోలీస్ అధికారి తిరుమలేశ్వరరెడ్డి, జిల్లా సహకార శాఖ అధికారి త్రినాథ్, ప్రోగ్రాం కో-ఆర్డినేటర్ రవికిషోర్, ఏడిఏ అనిత, ఎరువుల కంపెనీల ప్రతినిథులు పాల్గొన్నారు.

## చెప్పిందే చేస్తాం.. చేసేదే చెప్తాం

కోవూరు (నెల్లూరు), నవంబర్ 5, ప్రభాతవార్త: రాష్ట్రంలో చేనేతల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి అన్నారు. కోవూరు మండలం గుమ్మలదిబ్బ చేనేత కాలనీలో బుధవారం సాయంత్రం ఇటీవల కురిసిన మొంథా తుపాన్ కారణంగా ఇబ్బందులు పడ్డ 214 చేనేత కుటుంబాలకు ప్రభుత్వం ద్వారా వచ్చిన బియ్యం, నిత్యావసర వస్తువులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తాము చెప్పిందే చేస్తామని.. చేసేదే చెప్తామన్నారు. ఇటీవల కురిసిన తుపాన్‌లో కూటమి నాయకులు సమిష్టిగా కృషి చేసి తనకు మరింత పేరు తెచ్చారని ఇందుకు వారికి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేస్తున్నానన్నారు. ఏమైనా సమస్యలు ఉంటే నేరుగా తనను సంప్రదించాలని మధ్యవర్తుల ప్రమేయం లేదన్నారు.

## మహిళా హాస్టల్ బాత్రూమ్‌లో సిసి కెమెరా



### ఉద్యోగినుల ఆందోళన... ఓ యువతి అరెస్ట్

కుప్పం, నవంబరు 5 ప్రభాతవార్త: ఓ ప్రముఖ సంస్థకు చెందిన మహిళల హాస్టల్ భవనంలోని బాత్రూమ్‌లో సిసి కెమెరా ఉ ండడంతో మహిళా ఉద్యోగినులు ఆందోళన చేసిన సంఘటన తమిళనాడు రాష్ట్రం హోసూరులో చోటు చేసుకుంది. ఈ సంఘటనకు సంబంధించి కృష్ణగిరి జిల్లా పోలీసులు ఓ మహిళను అరెస్ట్ చేశారని సమాచారం. స్థానికులు తెలిపిన మేరకు వివరాలిలా.. హోసూరు నగరంలోని కెలమంగళం వద్ద ఓ ప్రముఖ కంపెనీ హాస్టల్ ఉంది. ఈ హాస్టల్‌లో పలువురు మహిళా ఉద్యోగులు ఉంటున్నారు. అయితే హాస్టల్‌లోని బాత్రూమ్‌లో సిసి కెమెరాలను చూసిన మహారాష్ట్రకు చెందిన ఓ మహిళ ఆందోళనకు గురై సహచర ఉద్యోగులకు తెలిపింది. దీంతో హాస్టల్‌లోని ఉద్యోగినులు పెద్ద ఎత్తున మంగళవారం రాత్రి ఆందోళనకు దిగారు. విషయం తెలుసుకున్న పోలీసులు హుటాహుటిన అక్కడకు చేరుకుని హాస్టల్‌లో తనిఖీలు చేశారు. కాగా ఈ సంఘటనకు సంబంధించి కృష్ణగిరి పోలీసులు ఒడిశాకు చెందిన 22 ఏళ్ల యువతిని అరెస్ట్‌చేసి విచారిస్తున్నట్లు సమాచారం.

# ఆదరణ 3.0 ద్వారా బిసిలకు ఆధునిక పనిముట్లు

- చైర్మన్లు, డైరెక్టర్ల సలహాలు, సూచనలు పరిగణనలోకి తీసుకుంటాం
- బిసి సంక్షేమ శాఖ మంత్రి ఎస్.సవిత




విజయవాడ, నవంబరు 5 ప్రభాతవార్త ప్రతినిధి: బిసిలు ఆర్థికంగా నిలదొక్కుకునేందుకు ఆదరణ 3.0 ద్వారా ఆధునిక పనిముట్లు అందిస్తామని రాష్ట్ర బిసి సంక్షేమ శాఖ మంత్రి ఎస్.సవిత అన్నారు. గొల్లపూడిలోని బిసి సంక్షేమ భవన్‌లో రాష్ట్ర వెనుకబడిన తరగతుల సహకార ఆర్థిక సంస్థ లిమిటెడ్ ఆధ్వర్యంలో బుధవారం బిసి కార్పొరేషన్ చైర్మన్లు, కుల సంఘాలు, డైరెక్టర్లతో ఆదరణ 3.0 పథకం అమలుపై మూడు రోజుల వర్క్ షాప్ ముగింపు కార్యక్రమానికి మంత్రి ఎస్.సవిత హాజరయ్యారు ఈ సందర్భంగా మంత్రి ఎస్. సవిత మాట్లాడుతూ బిసి కార్పొరేషన్ చైర్మన్లు, కుల సంఘాలు, డైరెక్టర్లు అందించిన సలహాలు, సూచనలను పరిగణనలోకి తీసుకుని ఆదరణ 3.0 పథకాన్ని అమలు చేసేలా కృషి చేస్తామన్నారు. కుల, చేతివృత్తులు వారికి ఆధునిక పరికరాలతో శాశ్వత ఉపాధి కల్పన కల్పించేలా కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు. క్షేత్రస్థాయి నుంచి యూనిట్ల ఏర్పాటుల్లో ఆధునిక పరికరాల అందజేసే అంశంపై వివరాలు సేకరించటం జరిగిందన్నారు. ఏ వృత్తిదారుడు ఎటువంటి పరికరాలు ఆశిస్తున్నారనే విషయమై సర్వే రూపంలో ఒక నివేదిక రూపొందించటం జరిగిందని, దానిని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకు అందిస్తామన్నారు. అంతకుముందు 17 బిసి కార్పొరేషన్ల చైర్మన్లతో మంత్రి సవిత సమావేశమయ్యారు. ఆదరణ 3.0 అమలుపై వారి అభిప్రాయాలను తెలుసుకున్నారు. కార్పొరేషన్లకు నిధులు కేటాయించడంతో పాటు చైర్మన్లు, డైరెక్టర్లకు వారి గౌరవాన్ని పెంపొందించేలా చర్యలు తీసుకుంటున్నట్లు మంత్రి సవిత తెలిపారు. 16 నెలల కాలంలో కూటమి ప్రభుత్వం చేస్తున్న మంచిని ప్రజల్లోకి తీసుకెళ్లాల్సిన బాధ్యత చైర్మన్లపైనా, డైరెక్టర్లపైనా ఉందన్నారు. అనంతరం ఆయా కార్పొరేషన్ల వారీగా మంత్రి ముఖాముఖి సమావేశం నిర్వహించి, వారి అభిప్రాయాలు తెలుసుకున్నారు. కార్యక్రమంలో రాష్ట్ర బిసి సంక్షేమ శాఖ కార్యదర్శి ఎస్. సత్యనారాయణ, ఆయా బిసి కులాల కార్పొరేషన్ చైర్మన్లు, డైరెక్టర్లు, బిసి సంక్షేమ శాఖాధికారులు, తదితరలు పాల్గొన్నారు.

# తుది దశకు జిల్లాల పునర్విభజన!

● 7 నుంచి 8 కొత్త జిల్లాలు కావాలని ప్రజలు వినతి ● ఎన్టీఆర్ జిల్లాలోకి నూజివీడు, గన్నవరం నియోజకవర్గాలు ● మార్కాపురం కేంద్రంగా కొత్త జిల్లా... శ్రీశైల పుణ్యక్షేత్రాన్ని చేర్చాలంటూ వినతులు ● మంత్రి మండలి ఉప సంఘం సమావేశంలో పలు తాజా ప్రతిపాదనలపై చర్చ



విజయవాడ, నవంబరు 5 ప్రభాతవార్త ప్రతినిధి: రాష్ట్రంలో జిల్లాల పునర్ వ్యవస్థీకరణ సమస్యల పరిష్కారంపై ఏర్పాటైన మంత్రి వర్గ ఉపసంఘం అధ్యయనం తుదిదశకు వచ్చింది. అతి త్వరలోనే సీఎం చంద్రబాబుకు తుది నివేదిక ఇవ్వాలని మంత్రులు నిర్ణయించారు. కొత్త జిల్లాలు, రెవెన్యూ డివిజన్ల ఏర్పాటు సహా మండలాలు, గ్రామాల సరిహద్దుల మార్పులకు సంబంధించి తీసుకోవాల్సిన చర్యలు సిఫార్సు చేయనున్నారు. జిల్లాల పునర్విభజన సమస్యల పరిష్కారంపై ఏర్పాటైన మంత్రివర్గ ఉపసంఘం సచివాలయంలో సమావేశమై సుదీర్ఘంగా చర్చించింది. సీఎం చేసిన సూచనల మార్గదర్శకాల మేరకు ఆయా అంశాలపై సమగ్రంగా చర్చించారు. మదనపల్లి, మార్కాపురం కేంద్రాలుగా కొత్త జిల్లాలుగా చేయాలని ప్రతిపాదనలపై ఇప్పటికే ఆమోద ముద్ర వేయగా మరిన్ని కొత్త జిల్లాల ఏర్పాటు ప్రతిపాదనలపై లోతుగా చర్చించారు. 78 కొత్త జిల్లాలు కావాలని ప్రజలు వినతి పత్రాలివ్వగా పరిశీలించారు. ఈ క్రమంలోనే మరో చిన్న జిల్లాలు ఏర్పాటు చేస్తే ప్రయోజనం ఉందని మంత్రి వర్గం అభిప్రాయపడింది. పీలేరు, అద్దంకి, గిద్దలూరు, మడకశిర కొత్త రెవెన్యూ డివిజన్ల ఏర్పాటు ప్రతిపాదన పై చర్చించి రూట్ మ్యాప్ ఖరారు చేశారు. కృష్ణా జిల్లాలోని నూజివీడు, గన్నవరం నియోజకవర్గాలను ఎన్టీఆర్ జిల్లాలో కలిపే ప్రతిపాదనలు, కైకలూరు నియోజకవర్గాన్ని కృష్ణా జిల్లాలో కలిపే ప్రతిపాదలపైనా చర్చించారు. రెవెన్యూ డివిజన్లు కావాలని ఎక్కువ వినతులు వచ్చాయని మంత్రివర్గ ఉపసంఘం తెలిపింది. అల్లూరి జిల్లా కేంద్రానికి వెళ్లాలంటే ప్రజలు 200- 300 కిలోమీటర్ల దూరం వెళ్లాల్సి వస్తోందని ఎఎస్ఆర్ జిల్లా అభివృద్ధి కోసం ప్రత్యేక అథారిటీ ఏర్పాటు అంశాన్ని పరిశీలించాలన్న సీఎం ఆదేశాలపై చర్చించామన్నారు. పోలవరం ముంపు మండలాలను ఎక్కడ కలపాలనే విషయం పైనా చర్చించినట్లు తెలిపారు. త్వరలోనే మరో సమావేశం ఏర్పాటు చేసుకుని జిల్లాలు, రెవెన్యూ డివిజన్ల ఏర్పాటుపై తుది నివేదిక రూపొందిస్తామన్నారు. సీఎంకు తుది నివేదిక ఇచ్చాక తదుపరి చర్యలు తీసుకుంటారని మంత్రులు స్పష్టం చేశారు. రెవెన్యూ డివిజన్లు కావాలని ఎక్కువ వినతులు వచ్చాయని మంత్రి వర్గ ఉపసంఘం తెలిపింది. ఈ సమావేశంలో శ్రీశైలం పుణ్యక్షేత్రాన్ని మార్కాపురం కేంద్రంగా ఏర్పడే జిల్లా పరిధిలోకి తేవాలని ప్రజా వినతులపైన చర్చ జరిగినట్లు సమాచారం! ఇలా చేయడం వలన శ్రీశైలం నుంచి జిల్లా కేంద్రానికి చేరుకునేందుకు దూరాభారం భారీగా తగ్గుతుందని ప్రజలు విజ్ఞప్తి చేసినట్లు సమాచారం. ఈ క్షేత్రం జిల్లా నంద్యాలలో ఉంటే అక్కడ నుంచి దగ్గర, 200 కిలో మీటర్లు ప్రయాణించి జిల్లా కేంద్రానికి చేరుకోవాల్సి ఉంటుందని వినతుల్లో వివరించారంటున్నారు. నంద్యాల జిల్లా వాసులు శ్రీశైలం తమ జిల్లాలోనే ఉండాలని గట్టిగా కోరినట్లు సమాచారం. ఈ భేటీలో మంత్రులు అనగాని సత్యప్రసాద్, వంగలపూడి అనిత, నిమ్మల రామానాయుడు, నాదెండ్ల మనోహర్, బీసీ జనార్దన్ రెడ్డి పాల్గొన్నారు. భేటీ అనంతరం రాష్ట్ర రెవెన్యూ, రిజిస్ట్రేషన్ మరియు స్టాంప్స్ మంత్రి అనగాని సత్యప్రసాద్ మాట్లాడుతూ పరిపాలనా సౌలభ్యం కోసం అందిన వివిధ ప్రతిపాదనలపై సుదీర్ఘంగా చర్చించామని చెప్పారు. ఈ చర్చల ఆధారంగా సీసీఎల్ఎ నివేదిక రూపొందిస్తుందని, దీనిపై చివరి సారి చర్చించి సీఎంకు అందిస్తామని, ఆ తర్వాత తుది నిర్ణయాలు వెలువడతాయని చెప్పారు. కొత్తగా ఏనిమిది జిల్లాల ఏర్పాటుపై ప్రజల నుండి వినతులు వచ్చాయని, కానీ పరిపాలనా పరంగా సౌలభ్యంగా ఉండే వాటిపైనే నిర్ణయం ఉంటుందని, ఎన్నికల్లో ఇచ్చిన హామీల మేరకు సానుకూల నిర్ణయాలు ఉంటాయని చెప్పారు. సబ్ రిజిస్ట్రార్ ఆఫీసుల్లో ఏసీబీ తనిఖీలు మంచి సంకేతం. సబ్ రిజిస్ట్రార్ ఆఫీసుల్లో బుధవారం ఏసీబీ తనిఖీలు చేయడం మంచి సంకేతమన్నారు. కూటమి ప్రభుత్వ పారదర్శక పాలనకు నిదర్శనమన్నారు. సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో అవినీతిపై ప్రజల నుండి ఫిర్యాదులు అందాయని, అక్రమాలకు పాల్పడిన వారిపై చర్యలు తీసుకుంటామని, అధికారుల్లోనూ భయం ఉంటుందని అన్నారు. గతంలోనూ కూడా రిజిస్ట్రేషన్ శాఖలో వచ్చిన అవినీతి ఆరోపణలపై చర్యలు తీసుకున్నామని, కొంత మందిని సస్పెండ్ కూడా చేశామని రెవెన్యూ, రిజిస్ట్రేషన్ మరియు స్టాంప్స్ మంత్రి అనగాని సత్యప్రసాద్ చెప్పారు.

## కుప్పంలో రూ.40 కోట్లతో కంప్రెస్డ్ బయోగ్యాస్ ఉత్పత్తి పరిశ్రమ

కుప్పం, నవంబరు 5 ప్రభాతవార్త: ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ప్రాతినిధ్యం వహిస్తున్న కుప్పం నియోజకవర్గంలో కంప్రెస్ట్ బయోగ్యాస్ ఉత్పత్తి పరిశ్రమ ఏర్పాటుకానుంది. ఈ ప్లాంట్‌ను కుప్పం మండల ం కృష్ణదాసనపల్లి వద్ద ఏర్పాటు చేయబోతున్నారు. శ్రేష్ట రెన్యూవబుల్ ప్రై.లిమిటెడ్ సంస్థ ఈ పరిశ్రమ స్థాపనకు ముందుకు వచ్చింది. సుమారు రూ.40 కోట్లు పెట్టుబడులు పెడుతోంది. తాజాగా ప్రభుత్వ విప్, కడ పిఎసి చైర్మన్ డా॥ కంచర్ల శ్రీకాంత్ , కడ ప్రాజెక్ట్ డైరెక్టర్ వికాస్ మర్మత్ కృష్ణదాసనపల్లి గ్రామం వద్ద ఈ పరిశ్రమ ఏర్పాటుకు సంబంధించి భూమి కేటాయింపుపై పరిశీలించారు. సాధ్యమైనంత త్వరగా పరిశ్రమ ఏర్పాటుకు స్థలం కేటాయించేలా అధికారులను ఆదేశించారు. ఈ పరిశ్రమ ద్వారా ఘన వ్యర్థాలు (సాలిడ్ వేస్ట్) నుంచి కంప్రెస్ట్ బయోగ్యాస్‌ను ఉత్పత్తి చేయనున్నారు.



## రేణిగుంట సబ్ రిజిస్టార్ కార్యాలయంలో ఎసిబి అధికారుల సోదాలు

రేణిగుంట, నవంబరు 5 ప్రభాతవార్త: రేణిగుంట సబ్ రిజిస్టర్ కార్యాలయంలో బుధవారం ఎసిబి అధికారులు సోదాలు చేశారు. డిఎస్పీ మల్లికార్జున్ ఆధ్వర్యంలో అధికారులు సిబ్బంది తనిఖీల్లో పాల్గొని అనేక రికార్డులను పరిశీలించారని సమాచారం. కార్యాలయం లోపలికి ఎవరిని వెళ్లనివ్వకుండా తాళాలు పెట్టి అధికారులు సోదాలు చేశారు. ఎసిబి తనిఖీలు జరుగుతున్న నేపథ్యంలో లేఖకులు తమ కార్యాలయాలకు తాళాలు వేసి వెళ్లిపోయారు. లోపల ఏమి జరుగుతుందన్న సమాచారం సాయంత్రం వరకు బయటకు రాలేదు. ఇటీవల కాలంలో సబ్ రిజిస్టర్ కార్యాలయంలో జరుగుతున్న విభిన్న వాదనలకు ఏసీబీ దాడులు ప్రాధాన్యత సంతరించుకుంది. ఓ మహిళ డబ్బులు బ్యాగుతో లోపలకు వెళ్లి అధికారులను చూసి బ్యాగును అక్కడే వదిలి వెళ్ళిపోయినట్లు తెలిసింది. బ్యాగును అధికారులు స్వాధీనం చేసుకున్నట్లు అనుకుంటున్నారు. ఆ బ్యాగులో ఎంత నగదు ఉందన్న విషయం తెలియ రాలేదు. ఎసిబి సోదాలు రాత్రి వరకు కొనసాగుతూనే ఉన్నాయి. తనిఖీలు పూర్తయ్యే వరకు సమాచారం బహిర్గతమయ్యే అవకాశాలు కనిపించడం లేదు.

## ఒంగోలు జిల్లాలోనూ తనిఖీలు



ఒంగోలు, నవంబరు 5 ప్రభాతవార్త: ఒంగోలు సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంపై ఎసిబి సీఐ రమేష్ ఆధ్వర్యంలో సోదాలు చేశారు. జిల్లాలోని పలు సబ్ రిజిష్టర్ కార్యాలయాలకు సంబంధించి ఇటీవల ఫిర్యాదులు వెల్లువెత్తుతూ అవినీతికి పాల్పడుతున్నట్లు ఆరోపణలు రావడంతో ఎసిబి అధికారులు మెరుపు దాడులు నిర్వహించారు. కార్యాలయ తలుపులు మూసివేసి కీలక దస్త్రాలను స్వాధీనం చేసుకుని విచారణ చేపట్టారు. కొంత నగదు సొమ్ము కూడా దొరికినట్లు సమాచారం. సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలోకి ఎసిబి అధికారులు రాగానే కిటికిలో నుంచి రూ.30 వేలు విసిరేసినట్లు తెలిసింది. ఆఫీసు బాత్రూమ్‌లో పది వేలు స్వాధీనం చేసుకున్నారు. సబ్ రిజిస్టర్ -2 ఒక వ్యక్తి వద్ద నుంచి రూ.3 లక్షలు డిమాండ్ చేసినట్లు ఆరోపణలు రావడంతో ఈ దాడులు నిర్వహిస్తున్నట్లు తెలిసింది. సబ్‌రిజిస్ట్రార్-2కు సంబంధించిన దస్తావీజు విభాగం లావాదేవీలపై సమగ్రంగా తనిఖీలు చేసినట్లు సమాచారం. ఆఫీసుకు ఎసిబి అధికారులు రాగానే డాక్యుమెంట్ రైటర్లు పరారయ్యారు. సింగరాయకొండతో పాటు మార్కాపురం పలు సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో దాడులు కొనసాగుతున్నట్లు తెలిసింది. ఇప్పటి వరకు జిల్లాలో ఏ కార్యాలయంలో అవినీతి జరిగినట్లు ఎటువంటి ఆధారాలు దొరకలేదు. ఒక్క ఒంగోలు సబ్ రిజిస్ట్రార్ ఆఫీసులోనే సుమారు రూ.40వేలు దొరికినట్లు తెలిసింది. ఇంకా తనిఖీలు కొనసాగుతున్నాయని అధికారులు అంటున్నారు.

## టెక్స్‌టైల్స్‌లో 9 ఎంవోయూలు

### రాష్ట్ర చేనేత, జౌళి శాఖ మంత్రి సవిత




అమరావతి, నవంబరు 5 ప్రభాతవార్త ప్రతినిధి: రాష్ట్రంలోని టెక్స్‌టైల్స్ రంగంలో పెట్టుబడులు పెట్టడానికి తొమ్మిది కంపెనీలు ఆసక్తి చూపుతున్నట్లు రాష్ట్ర చేనేత, జౌళి శాఖ మంత్రి ఎస్.సవిత తెలిపారు. ఈ నెల 14, 15 తేదీల్లో విశాఖలో జరిగే పార్టనర్ షిప్ సమ్మిట్‌లో రాష్ట్ర ప్రభుత్వంతో ఈ కంపెనీల ప్రతినిధులతో ఎంవోయూలు కుదుర్చుకోనున్నట్లు తెలిపారు. అమరావతిలోని వెలగపూడి రాష్ట్ర సచివాలయంలోని తన ఛాంబర్‌లో తొమ్మిది కంపెనీల ప్రతినిధులతో మంత్రి సవిత సమావేశం నిర్వహించారు. వారిలో అయిదుగురు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమావేశంలో పాల్గొన్నారు. ఈ మేరకు బుధవారం ఆమె ఒక ప్రకటన విడుదల చేశారు. మేటరెస్ మాన్యూఫ్యాక్చరింగ్, అపెరిల్ ప్రొడక్షన్, గార్మెంట్స్ తయారీ, పోలిస్టర్ వేడింగ్ యూనిట్ల ఏర్పాటుకు ఆ కంపెనీ ప్రతినిధులు ఆసక్తి చూపారన్నారు. ఈ నెల 14, 15 తేదీల్లో విశాఖలో జరిగే పార్టనర్ షిప్ సమ్మిట్‌లో పాల్గొని, టెక్స్ టైల్స్ రంగంలో పెట్టుబడులు పెట్టడానికి రాష్ట్ర ప్రభుత్వంతో ఒప్పందం కుదుర్చుకోడానికి ఆయా కంపెనీ ప్రతినిధులు సంసిద్ధం వ్యక్తంచేశారన్నారు. తమ కంపెనీలను రాయలసీమలో ఏర్పాటు చేయడానికి వారు ముందుకొచ్చారన్నారు. ఏయే ప్రాంతాల్లో పరిశ్రమలు ఏర్పాటు చేయబోయేది పార్టనర్ షిప్ సమ్మిట్‌లో ఖరారు కానుందని మంత్రి సవిత తెలిపారు. సీఎం చంద్రబాబు నాయుడు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం తీసుకొచ్చిన నూతన టెక్స్‌టైల్స్ పాలసీతో ఏపీలో పెట్టుబడులకు పలువురు పారిశ్రామికవేత్తలు ఆసక్తి చూపుతున్నారన్నారు. రాబోయే కాలంలో మరికొందరు పెట్టుబడుదారులు ఏపీలో తమ కంపెనీల ఏర్పాటుకు ముందుకొచ్చే అవకాశముందన్నారు. సమావేశానికి హాజరైన నలుగురు పెట్టుబడుదారులను మంత్రి సవిత సత్కరించారు. ఈ సమావేశంలో రాష్ట్ర చేనేత, జౌళి శాఖ ముఖ్య ప్రధాన కార్యదర్శి ఆర్పీ సోసిడియా, కమిషనర్ రేఖారాణి తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్ర పండుగగా 8న భక్త కనకదాస జయంతి

అమరావతి, నవంబరు 5 ప్రభాతవార్త: భక్త కనకదాస జయంతిని ఈ నెల 8వ తేదీన రాష్ట్ర పండుగగా నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు ప్రభుత్వం బుధవారం ఉత్తర్వులు జారీ చేసినట్లు రాష్ట్ర బిసి, ఈడబ్ల్యూఎస్ సంక్షేమ, చేనేత మరియు జౌళి శాఖ మంత్రి ఎస్.సవిత తెలిపారు. భక్త కనకదాస జయంతిని రాష్ట్ర స్థాయి ఉత్సవాన్ని అనంతపురం జిల్లా కల్యాణదుర్గంలో నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ఈ ఉత్సవానికి రాష్ట్ర విద్య, ఐటీ శాఖ మంత్రి నారా లోకేశ్ హాజరుకానున్నట్లు తెలిపారు. అన్ని జిల్లాల్లోనూ భక్త కనకదాస జయంతిని రాష్ట్ర పండుగ నిర్వహించాలని ఆ ఉత్తర్వులు ప్రభుత్వం పేర్కొనట్లు మంత్రి సవిత వెల్లడించారు. సామాజిక తత్వవేత్తగా, స్వరకర్తగా భక్త కనకదాస తన కీర్తనలు, రచనలతో సమాజంలో అసమానతులపైనా, కుల వ్యవస్థపైనా ప్రజల్లో చైతన్యం తీసుకొచ్చారన్నారు. సామాజిక రుగ్మతల నిర్మూలనకు కనకదాస చేసిన సేవలు శ్లాఘనీయమన్నారు. అటువంటి మహనీయుని జయంతిని రాష్ట్ర పండుగగా నిర్వహించడం ఆనందకరమన్నారు. గతేడాది అనంతపురంలో భక్త కనకదాస రాష్ట్ర స్థాయి జయింతిని నిర్వహించిన విషయాన్ని మంత్రి సవిత గుర్తు చేశారు.

## ప్రభుత్వంపై జగన్ రెడ్డి నిందలు వేయడం హాస్యాస్పదం



విజయవాడ, నవంబరు 5 ప్రభాతవార్త ప్రతినిధి: తుపాను వచ్చిన పది రోజుల తర్వాత వచ్చిన జగన్ రెడ్డి ప్రభుత్వంపై నిందలు వేయడం హాస్యాస్పదమని రాష్ట్ర గనులు, భూగర్భ వనరులు, ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర ఆరోపించారు. ఆయన మీడియాతో మాట్లాడుతూ.. జగన్ రెడ్డి వ్యవహార శైలిపై మండి పడ్డారు. తుపానుతో దెబ్బతిన్న ప్రతి రైతును ఆదుకునేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంది. పంట పరిశీలన నెపంతో వచ్చిన జగన్‌రెడ్డి బల ప్రదర్శన చేయాల నుకోవడం హేయం. జగన్ రెడ్డి పచ్చి అబద్దాలు మాట్లాడుతూ యాత్ర చేశాడు. తుపానుతో రైతులు అవస్థలు పడుతున్నపుడు కనీసం పట్టించుకోకుండా.. ఎక్కడున్నావని ప్రశ్నించారు. తుపాను సమయంలో కూటమి ప్రభుత్వం రైతులకు ఏమీ చేయలేదంటే ప్రజలే నమ్మడం లేదు. అందుకే డబ్బులిచ్చి జనాల్ని రప్పించుకుని విమర్శించే ప్రయత్నం కూడా బెడిసి కొట్టిందన్నారు. ఐదేళ్ల పాలన వదిలి పబ్జీ ఆడుకున్న జగన్ రెడ్డి కూడా విమర్శలు చేయడం సిగ్గుచేటన్నారు. పది రోజుల తర్వాత తీరిగ్గా వచ్చి ప్రభుత్వంపై విమర్శలు చేయడానికి జగన్ రెడ్డి సిగ్గుపడాలి. ప్రజలకు కష్టం వచ్చినపుడు బాధ్యతగా వ్యవహరించాల్సింది పోయి.. రాజకీయం మాట్లాడడం సిగ్గుచేటన్నారు. ఇంత ఉపద్రం వచ్చినపుడు ప్రజలకు అండగా ఉండాల్సింది పోయి రాజకీయం చేయడమా? జగన్ రెడ్డి దిక్కుమాలిన ఆరోపణలు చేస్తూ పోతే.. ప్రజలే ఏకమై తొక్కి పడేస్తారని మంత్రి కొల్లు రవీంద్ర హెచ్చరించారు.

## 24గంటల్లో రైతుల ఖాతాల్లో డబ్బు జమ

● 51 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు లక్ష్యం ● పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్



విజయవాడ, నవంబరు 5 ప్రభాత వార్త ప్రతినిధి: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం తీసుకువచ్చిన సంస్కరణల తోనే రైతుకు న్యాయం జరిగిందని పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ వెల్లడించారు. బుధవారం విజయవాడ సివిల్ సప్లయ్ భవన్‌లో మంత్రి నాదెండ్ల మనోహర్ మీడియాతో మాట్లాడుతూ ఈ సారి ఖరీఫ్ మాసానికి 51 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనేందుకు సిద్ధం అయ్యామని మంత్రి నాదెండ్ల తెలిపారు. అంటే రూ.12,200 కోట్లు విలువైన ధాన్యం కొనుగోలుకు సిద్ధం అయినట్లు చెప్పారు. ఈ ఏడాది ధాన్యం కొనుగోలుకు 4041 రైతు సేవా కేంద్రాలు, 3803 ధాన్యం కొనుగోలు కేంద్రాలు, 16,700 మంది సిబ్బందితో ధాన్యం కొనుగోలుకు సిద్ధమవుతున్నట్లు నాదెండ్ల మనోహర్ తెలిపారు. గత ఏడాది అనుభవాల దృష్ట్యా కోట్ల గోతాలను సిద్ధం చేసినట్లు తెలిపారు. గత ప్రభుత్వం దాదాపు రూ.1570 కోట్ల బకాయిలు వదిలి వెళ్ళిందని, కొన్ని సందర్భాలలో రైతులకు చెల్లించాల్సిన బకాయలను 6 నెలల నుంచి 9 నెలల వరకు ఇవ్వలేదని గుర్తు చేశారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత దాదాపు 87 శాతం ధాన్యం కొనుగోలు డబ్బులు 48 గంటల్లో రైతు ఖాతాల్లో జమ చేశామని తెలిపారు. ఈ సారి 24 గంటల్లోనే రైతు బజార్లో నగదు జమ చేసేందుకు ప్రయత్నం చేస్తున్నామన్నారు. తేమ శాతం రీడింగ్ విషయంలో రైతులకు ఇబ్బంది లేకుండా ఒకే రకమైన కంపెనీ మిషన్లు వాడాలని నిర్ణయించినట్లు నాదెండ్ల మనోహర్ తెలిపారు. అవసరమైన చోట బ్లూ టూత్ ద్వారా లెక్కించేలా చర్యలు తీసుకుంటామన్నారు. ఇక నుంచి ప్రతి నెల, ప్రతి వారం ధాన్యం కొనుగోలుపై సమీక్షిస్తామన్నారు. నవంబర్ మాసంలో వర్ష సూచనల కారణంగా రైతులకు ఇబ్బంది లేకుండా 50 వేలు టార్పాలిన్‌లు ఉచితంగా అందిస్తామని మంత్రి అన్నారు. ఈ సమావేశంలో సివిల్ సప్లై విసి,ఎండి ఢిల్లీరావు, డైరెక్టర్ గోవింద్‌లు పాల్గొన్నారు.

## 9.13 లక్షలమంది కౌలు రైతులకు గుర్తింపు కార్డులు

● ఉల్లి, మామిడి, కోకో రైతులకు రూ.81 కోట్ల తుపాను సాయం ● రాష్ట్ర సమాచార శాఖ మంత్రి పార్థసారథి



నూజివీడు/ఏలూరు, నవంబరు 5 ప్రభాతవార్త: మొంథా తుపాన్ కారణంగా నష్టపోయిన ప్రతీ రైతుని, ప్రతీ కుటుంబాన్ని ఆదుకుంటామని రాష్ట్ర సమాచార శాఖ మంత్రి పార్థసారధి చెప్పారు. నూజివీడులో బుధవారం పాత్రికేయులతో మంత్రి పార్థసారధి మాట్లాడుతూ తుపాన్ కారణంగా నష్టం జరగకుండా ఎటువంటి పరిస్థితినైనా ఎదుర్కొనేందుకు రాష్ట్ర ప్రభుత్వంలోని ముఖ్యమంత్రి, మంత్రులు, ఎమ్మెల్యేలు, అధికార యంత్రాంగం, ప్రజాప్రతినిధులు, నాయకులు తుపాన్‌కు మూడు రోజుల ముందు నుండి ప్రజలను అప్రమత్తం చేసి, తుపాన్ తరవాత సహాయక చర్యలు చేపట్టామన్నారు. తుపాన్ కారణంగా జరిగిన పంట నష్టాలు, ఆస్థి నష్టాలను వెంటనే గుర్తించి రైతు లకు, బాధిత కుటుంబాలకు పరిహారం అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తున్నదన్నారు. మొంథా తుపాన్ కారణంగా రాష్ట్రంలో 1,63,366 హెక్టార్లలో పంటల నష్టం జరిగిందన్నారు. గత సంవత్సర కాలంలో రాష్ట్రంలో తుపానులు, వరదలు కారణంగా నష్టపోయిన రైతులకు 310.30 కోట్ల రూపాయలు పరిహారంగా అందించామన్నారు. రైతుల పండించిన ప్రతీ ధాన్యం గింజను ప్రభుత్వం కొనుగోలు చేస్తుందన్నారు.

తుపాన్ ముందు 10 రోజులు, తరవాత వారంరోజుల వరకు ప్రజలకు కనీసం ప్రజలకు మొఖం కూడా చూపించకుండా బెంగుళూరులో సేదదీరుతున్న ప్రతిపక్ష నాయకుడు తుపాన్ పూర్తిగా వెలిసిన తరవాత కలుగులోంచి ఎలుకలాగా బయటకు వచ్చి భీభత్సం చేసి, రైతులు, ప్రజలపై కపట ప్రేమ చూపుతూ, మొంథా తుపాన్ కారణంగా 15 లక్షల ఎకరాలలో తుపాన్ నష్టం జరిగిందని, ప్రభుత్వం నష్టాన్ని తక్కువ చేసి చూపిస్తోందని ప్రభుత్వంపై విషం చిమ్ముతున్నారని మంత్రి పార్థసారధి ఎద్దేవా చేశారు. ప్రతిపక్ష నాయకులూ 10 మంది, తమ పార్టీల నుండి తాను, మరో పది మంది నాయకులూ రాష్ట్రంలో పర్యటించి పంట నష్టాలను పరిశీలిస్తామని, తమ ప్రభుత్వం చెప్పిన లెక్కలు తప్పు రుజువైతే తాము దేనికైనా సిద్ధమని, ప్రతిపక్ష పార్టీ వాళ్ళు చెప్పింది తప్పు అయితే కనీసం క్షమాపణకు చెప్పాలని మంత్రి ప్రతిపక్ష నాయకులను మంత్రి డిమాండ్ చేశారు.

## ఎపికి రండి.. పర్యాటక రంగంలో పెట్టుబడులు పెట్టండి

● లండన్‌లో వరల్డ్ ట్రావెల్ మార్కెట్ (డబ్ల్యూటీఎం)2025 ప్రదర్శన వేదికగా ఇన్వెస్టర్లకు మంత్రి దుర్గేష్ ఆహ్వానం ● సింగిల్ విండో విధానంలో అనుమతులిస్తామని వెల్లడి



విజయవాడ, నవంబరు 5,ప్రభాతవార్త ప్రతినిధి: ఏపీ పర్యాటక రంగానికి అంతర్జాతీయ స్థాయిలో ప్రచారం కల్పించేందుకు వరల్డ్ ట్రావెల్ మార్కెట్ 2025 ఎగ్జిబిషన్ చక్కని వేదికగా దోహదపడిందని టూరిజం శాఖా మంత్రి కందుల దుర్గేష్ తెలిపారు. ఏపీ పర్యాటక రంగంలో పెట్టుబడులు పెట్టాలని ఇన్వెస్టర్లను సాదరంగా ఆహ్వానించారు. రెండో రోజు లండన్ పర్యటనలో భాగంగా వరల్డ్ ట్రావెల్ మార్కెట్ 2025లో మంత్రి దుర్గేష్ పాల్గొన్నారు. పర్యాటక రంగంలో పెట్టుబడులు పెట్టేందుకు ఆంధ్రప్రదేశ్ నే ఎందుకు ఎంచుకోవాలి, ఏపీకి ఉన్న ప్రత్యేకతలేమిటి, ఏపీలో పెట్టుబడులు పెడితే ఎన్డీయే ప్రభుత్వం కల్పించే రాయితీలు ఏమిటి అన్న విషయాలను అక్కడికి వచ్చిన అంతర్జాతీయ ప్రతినిధులతో పంచుకున్నారు. ఈ మేరకు వారికి ఏపీ ప్రభుత్వం పెట్టుబడులకు ముందుకు వచ్చే వారికి ఇచ్చే రాయితీలు ఇతరంశాలను వివరిస్తూ పత్రాలను అందజేసారు. ఏపీ స్టాల్ ద్వారా పర్యాటక రంగంలో అమలు చేస్తున్న నూతన పర్యాటక పాలసీ విధానాలను, పర్యాటక హోదా కల్పన తదితర అంశాలను కూలంకషంగా వివరించారు. ఈ సందర్భంగా ఏపీకి వచ్చి పర్యాటక ప్రదేశాలను చూడండి అని, రాష్ట్ర సహజ సౌందర్యాలను ఆస్వాదించాలని తెలిపారు. అనంతరం ప్రభుత్వ సహకారంతో పర్యాటక రంగంలో పెట్టుబడులు పెట్టాలని ఆహ్వానించారు. ఈ సందర్భంగా ట్రాన్స్ ఇండస్ కంపెనీకి చెందిన యూకే లీడింగ్ ఏషియా ట్రావెల్ స్పెషలిస్ట్ హరి దర్శనలి, ఏకే ఇండస్ ఫౌండర్ ఆంథోని కింగ్స్లే, యూరోప్, నార్త్ ఆఫ్రికాకు చెందిన సీఎంసీవో సంస్థ మైస్ స్పెషలిస్ట్ క్రిస్ ఫోర్డ్, తమిళనాడు టూరిజం బోర్డు డైరెక్టర్ జెక్కు కురియన్ కురియాకోస్ తదితర ప్రతినిధులతో మంత్రి కందుల దుర్గేష్ ప్రత్యేకంగా భేటీ అయ్యారు. లికా రేడియో ఛానల్ ప్రజెంటర్ రూబిరాజ, ట్రావెల్ అండ్ టూర్ వరల్డ్ ఆన్ లైన్ ట్రావెల్ పబ్లికేషన్ ఎడిటర్ లకు ఇంటర్వ్యూ ఇచ్చారు. అనేక మంది అంతర్జాతీయ మీడియా ప్రతినిధుల ద్వారా ఏపీ పర్యాటక వాణిని వినిపించారు.

ఏపీ ప్రభుత్వం పర్యాటక రంగంలో అమలు చేస్తున్న విధి విధానాలను వెల్లడించి పలువురు ఇన్వెస్టర్లను ఆకర్షించేందుకు డబ్ల్యూటీఎం సరైన వేదికగా భావిస్తున్నామన్నారు. పీపీపీ విధానంలో ఏపీ పర్యాటక రంగాన్ని వృద్ధి చేస్తున్నామని తెలిపారు. ఇక్కడికి వచ్చిన ఇన్వెస్టర్లు ఏపీ పర్యాటక రంగంలో పెట్టుబడులు పెడితే మరింత వృద్ధి సాధించి స్థానిక యువతకు ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పించేందుకు వీలు కలుగుతుందన్నారు. ఏపీలో ఎన్డీయే ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఏడాది కాలంలోనే తాము రూ.12,000 కోట్ల పర్యాటక పెట్టుబడులను ఆకర్షించామన్నారు. ఈ క్రమంలో క్యారవాన్, హోమ్ స్టే, టెంట్ సిటీ, ల్యాండ్ అలాట్‌మెంట్ పాలసీలను వివరించారు. పర్యాటక పెట్టుబడిదారులను ఆకర్షించేందుకు పలు రాష్ట్రాల్లో, దేశాల్లో రోడ్ షోలను నిర్వహిస్తున్నామన్నారు. పర్యాటక రంగంలో పెట్టుబడి పెట్టే ఇన్వెస్టర్లకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా సింగిల్ విండో విధానంలో అనుమతులు జారీ చేస్తున్నామన్నారు. ఈ నేపథ్యంలో ప్రఖ్యాత స్టార్ హోటళ్లు, బీచ్ రిసార్ట్స్ ఏపీకి వచ్చాయన్నారు. ఈ క్రమంలో ప్రైవేట్ పార్ట్ నర్స్ పర్యాటక రంగాన్ని వృద్ధి చేసేందుకు తమదైన శైలిలో ముందుకు వస్తున్నారన్నారు.

### ఏపీలో రవాణా వ్యవస్థ పటిష్టం


ఇతర రాష్ట్రాలతో, దేశాలతో అనుసంధానం చేసేందుకు ఏపీకి రోడ్డు, జల, వాయు, రైలు తదితర మార్గాలు అనేకం ఉన్నాయన్నారు. కడప, కర్నూలు, తిరుపతి, విశాఖ, విజయవాడ, రాజమహేంద్రవరం తదితర ప్రాంతాల్లో ఎయిర్ పోర్ట్స్ ఉన్నాయన్నారు. త్వరలోనే ఏపీలోని ప్రతి జిల్లాల్లో ఒక ఎయిర్‌పోర్ట్ నెలకొల్పేందుకు సంకల్పించామన్నారు. తద్వారా మరిన్ని ప్రాంతాలకు నేరుగా అనుసంధానం ఉంటుందని భావిస్తున్నామన్నారు. విభిన్న మార్గాలతో ఇండియాలోనే ఏపీ అత్యధిక కనెక్టివిటీ ఉన్న ప్రాంతంగా నిలిచిందన్నారు. సీఎం చంద్రబాబునాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ లు ఇద్దరూ పర్యాటక రంగానికి అధిక ప్రాధాన్యతనిస్తున్నారని, వారి సారథ్యంలోని ఏపీ ప్రభుత్వం కేంద్రం సహకారంతో రాష్ట్ర పర్యాటక రంగంలో వినూత్న కార్యక్రమాలు చేపట్టిందన్నారు. రాష్ట్ర పర్యాటక రంగానికి పారిశ్రామిక హోదా కల్పించారని, పారిశ్రామిక రంగానికి ఇచ్చే అన్ని రకాల రాయితీలు పర్యాటక రంగంలో పెట్టుబడులు పెట్టేవారికి అందిస్తున్నామని వెల్లడించారు. నూతన పర్యాటక పాలసీ 2024-29తో పర్యాటక రంగానికి ఊతం వచ్చిందన్నారు.

విభిన్నమైన పర్యాటక ప్రదేశాలతో కూడిన ప్రదేశం ఆంధ్రప్రదేశ్ అన్నారు. ఇక్కడ ఎకో, అడ్వెంచర్, వెల్ నెస్, హెరిటేజ్, బీచ్, క్రూజ్ తదితర పర్యాటక ప్రక్రియల్లో పెట్టుబడులు పెట్టేందుకు అనుకూలమని అన్నారు. రాష్ట్రంలో సందర్శనకు వచ్చే పర్యాటకులకు ఆహ్లాదకరమైన అనుభవాలు అందిస్తున్నామన్నారు. సుదీర్ఘమైన సముద్ర తీరం, విశాఖ, కాకినాడ, మచిలీపట్నం, సూర్యలంక, నెల్లూరులో అందమైన బీచ్‌లు, తిరుపతి, విశాఖపట్నం, అమరావతి (విజయవాడ) లాంటి మూడు ప్రధాన నగరాలు పర్యాటకులను విశేషంగా ఆకట్టుకుంటున్నాయన్నారు. విశాఖకు సమీపంలో దట్టమైన అడవులతో కూడిన అరకువ్యాలీ, లంబసింగి, అనంతగిరి లాంటి అందమైన ప్రకృతి రమణీయ ప్రదేశాలను మరింత వృద్ధి చేయాలని భావిస్తున్నట్లు తెలిపారు. తొట్లకొండ, బావి కొండ, బొజ్జనకొండ, నాగార్జునకొండ, అమరావతి, ఘంటసాల, విజయవాడ తదితర ప్రదేశాల్లో బుద్ధిస్ట్ సర్క్యూట్‌లు ఉన్నాయని పేర్కొ న్నారు. ఇప్పటికే విశాఖ చెన్నై పాండిచ్చేరికి క్రూజ్ టూరిజంను ప్రారంభించి పర్యాటకులకు సముద్రతీర అనుభవాలను అందిస్తున్నామని మంత్రి కందుల దుర్గేష్ తెలిపారు.అదే విధంగా రాష్ట్రంలో చాలా సంఖ్యలో టైగర్ రిజర్వ్లు, దట్టమైన అడవులు, గిరిజన ప్రాంతాలు ఉన్నాయన్నారు. వీటన్నింటిని పీపీపీ విధానంలో మరింత అభివృద్ధి చేయాలనుకుంటున్నట్లు వివరించారు. ఈ సందర్భంగా నవంబర్ 14,15 తేదీల్లో విశాఖపట్నంలో జరిగే భాగస్వామ్య సదస్సుకు హాజరుకావాలని ఇన్వెస్టర్లకు మంత్రి కందుల దుర్గేష్ పిలుపునిచ్చారు.




# కన్నుల పండుగగా 'జ్వాలా తోరణం'

జగ్గయ్యపేట, నవంబరు 5 ప్రభాతవార్త: ఎన్‌టిఆర్ జిల్లా జగ్గయ్యపేట ప్రాంతంలో కార్తీక పౌర్ణమి వేడుకలు, పుణ్యస్నానాలు, అభిషేకాది అర్చనలు, సంప్రదాయ సిద్ధమైన జ్వాలా తోరణ కార్యక్రమాలు కన్నుల పండుగగా జరిగాయి. పట్టణంలోని చంద్రమౌళీశ్వరాలయం (పెద్దశివాలయం), క్షేమేశ్వరాలయం, శ్రీకాశీ అన్నపూర్ణ విశ్వేశ్వరాలయం మఠం శివాలయం, రుద్రభూమి శివాలయం, మఠం బజార్‌లో శ్రీబ్రహ్మానందస్వామివారి మఠం, శ్రీసత్యభామ సమేత రుక్మిణీ సంతాన వేణుగోపాలస్వామి ఆలయం, బలుసుపాడు గ్రామంలోని శ్రీగురుధామ్, ముక్త్యాల భవానీ ముక్తేశ్వరాలయం, శ్రీకోటిలింగ మహాక్షేత్రంలలో బుధవారం తెల్లవారు జామునుండే స్వామివారికి అభిషేకాధి అర్చనలు, ప్రత్యేక పూజలు వైభవంగా నిర్వహించారు. బలుసుపాడు గ్రామంలోని శ్రీగురుధామ్‌లో ప్రముఖ తాత్వికులు, శ్రీగురుధామ్ వ్యవసాపకులు, డాక్టర్ అబ్దుల్ కలాం అంతర్జాతీయ పురస్కార గ్రహీత గెంటేల వెంకటరమణ- వసంతలక్ష్మి గురుదంపతుల ఆధ్వర్యంలో శ్రీశివానందగురు ఎడ్యుకేషనల్- కల్చరల్ ట్రస్టు ప్రతినిధులు ఏర్పాటుచేసిన జ్వాలా తోరణ ప్రవేశం, క్షీర అమృతపానం, సద్గురు పల్లకీసేవ వేడుకలు పండు వెన్నెల్లో అద్వితీయంగా జరిగాయి. వెంకటరమణ-వసంతలక్ష్మి గురుదంపతులు, గెంటేల ఆనంద శంకర- వెంకట హర్షిత జ్వాలా తోరణ ప్రవేశ తోరణం వెలిగించారు. కార్తీక దీపోత్సవం, క్షీరామృతపాన కార్యక్రమాలను భక్తులు నిర్వర్తించి సద్గురు మూర్తిని దర్శించుకున్నారు. వెంకటరమణ భక్తులకు కార్తీక పౌర్ణమి సందేశం అందిస్తూ అనుగ్రహభాషణ చేశారు. కాగా సద్గురు సన్నిధానంలో పల్లకీ సేవ, కైలాసగిరిపై కార్తీక జ్యోతి ప్రజ్వన కార్యక్రమాలు ఘనంగా జరిగాయి. కార్యక్రమాల్లో ఉభయ తెలుగు రాష్ట్రాల నుండి వందలాది మంది భక్తులు పాల్గొన్నారు. పట్టణంలోని శివాలయంలో జ్వాలా తోరణ కార్యక్రమంలో ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్ పాల్గొన్నారు.



ఓం రంగవల్లికతో అలరిస్తున్న దుర్గమ్మవారి ఆలయ ప్రాంగణం



కోటిదీపకాంతుల్లో దుర్గమ్మవారి ఆలయ శోభలు

# కోటి దీపకాంతులతో అపర కైలాసంలా శోభిల్లిన దుర్గమ్మవారి ఆలయం

ఇంద్రకీలాద్రి, నవంబర్ 5, ప్రభాతవార్త: దుర్గమ్మవారి ఆలయంలో కార్తీకమాస పౌర్ణమి పర్వదినాన కోటి దీపార్చన నిర్వహించగా కోటి దీపకాంతులతో అపర కైలాసంలా కాంతులీనింది. శ్రీ మల్లేశ్వర స్వామివారల ప్రాంగణంలో జ్వాలాతోరణం, అనంతరం అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో ఇఓ వికె శీనా నాయక్, చైర్మన్ రాధాకృష్ణ, పాలకమండలి సభ్యులు, వేదపండితులు, అర్చకులు, ఆలయ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు. బుధవారం ఉదయం 5.55లకు గిరి ప్రదక్షణను శ్రీ కామథేను మాత ఆలయం వద్ద ప్రారంభించి కుమ్మరిపాలెం, విద్యాధంపురం, నాలుగుస్తంబాల సెంటర్, సితార, పాలఫ్యాక్టరి, కెబిఎన్ కాలేజ్, బ్రాహ్మణ వీధిలో శ్రీ స్వామి అమ్మవార్ల గిరి ప్రదక్షణ ను నిర్వహించారు. భక్తులు కోలాట భజనలు, నృత్యాలు, డప్పు, డమరుక, డక్కలతో శ్రీ స్వామి అమ్మవార్లతోపాటు గిరిప్రదక్షణ చేశారు.

### వేదోక్తంగా కార్తీకమాస పూజలు

దుర్గమ్మవారి ఆలయంలో బుధవారం కార్తీకమాస పూజలు వేదోక్తంగా నిర్వహించారు. ఇఓ, చైర్మన్లు కార్యక్రమంలో పాల్గొనగా వేదపండితులు అర్చనలు చేశారు. కార్తీకమాస పూజల్లో భక్తులు పాల్గొనాలని ఇఓ చైర్మన్లు తెలిపారు. సహస్ర దీపకాంతులతో శ్రీ స్వామి అమ్మవారు భక్తులను ఊంజల్ సేవలందుకుని అనుగ్రహించారు. పవిత్ర కార్తీకమాసం సందర్భంగా సహస్ర లింగార్చన సేవలో పాల్గొనాలని భక్తులకు ఇఓ వికె శీనా నాయక్, చైర్మన్ బొర్రా రాధాకృష్ణలు తెలిపారు. అర్చకస్వాములు వేదమంత్ర పఠనాలతో శ్రీ స్వామివారికి సేవలు నిర్వహించి ధూప, దీప



గిరి ప్రదక్షణలో అనుగ్రహిస్తున్న శ్రీ స్వామి అమ్మవార్లు

నైవేద్యాలు సమర్పించారు. సాయంసంధ్యాకాలంలో శ్రీ స్వామి అమ్మవార్లు ఊంజల్‌పై భక్తుల సేవలందుకుని అనుగ్రహించారు. ఈ సందర్భంగా చతుర్వేద పఠనాలు పండితులు చేశారు.

దుర్గమ్మవారి ఆలయంలో జరిగే నిత్యాన్నదాన పథకానికి విజయవాడకు చెందిన మన్నె సాయిచరణ్ రు.1లక్ష 1వెయి, 116ల విరాళాన్ని బుధవారం అందించారు. వారికి దుర్గమ్మవారి ప్రసాదాలు, శేషవస్త్రం, మెమొంటోలు అందించారు. వేదపండితులు వేదాశీర్వచనాలు పలికారు.

దుర్గమ్మవారిని ఏపి హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ శ్రీనివాసరెడి బుధవారం తమ కుటుంబసభ్యులతో కలిసి దర్శించుకున్నారు. వారికి దుర్గమ్మవారి ప్రసాదాలు, శేషవస్త్రం, మెమొంటోలు అందించారు. వేదపండితులు వేదాశీర్వచనాలు పలికారు. దుర్గమ్మవారి భక్తుల సేవకోసం కొత్త అంబులెన్స్ బుధవారం ఇఓ, చైర్మన్లు ప్రారంభించారు. హైదరాబాద్‌కు చెందిన ఒక ఫార్మశీ సంస్థ విరాళంగా అందించింది.

### దుర్గమ్మ సేవలో నారా రోహిత్



దుర్గమ్మవారిని బుధవారం సినీహీరో సతీసమేతంగా దర్శించుకున్నారు. దుర్గమ్మ వారి ఆలయానికి విరాళాలందించే భక్తుల సౌకర్యార్థం కొండకింద నూతన విరాళాల సేకరణ కేంద్రాన్ని ఇఓ వికె శీనా నాయక్, చైర్మన్ రాదాకృష్ణ బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఇఓ మాట్లాడుతూ ఇక్కడినుండి కొండపైకి రాలేని వృద్దులు, వికలాంగులకు బ్యాటరీ వాహనాలు ఏర్పాటు చేస్తామన్నారు. అలాగే నూతన లగేజ్ భద్రపరిచే కేంద్రం ప్రారంభించారు.

# మూడు దశల్లో 175 ఎంఎస్‌ఎంఈ పార్కుల అభివృద్ధి

విజయవాడ, నవంబరు 5 ప్రభాతవార్త ప్రతినిధి: రాష్ట్రం లోని 175 నియోజక వర్గాల్లో దశల వారీగా ఎంఎస్‌ఎంఈ పార్కులు/ ప్లాటెడ్ ఫ్యాక్టరీ కాంప్లెక్స్‌లను అభివృద్ధి చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. యువతకు,మహిళలకు విస్తారంగా స్వయం ఉపాధి కల్పన. ఉత్పత్తులకు మార్కెటింగ్ తదితరంశాల్లో ప్రోత్సాహించే దిశలో ప్రభుత్వం దశల వారిగా ఈ పార్కులు ఏర్పాటు చేస్తుంది.మొదటి దశలో 56 పార్కులను అభివృద్ధి చేస్తోంది. మిగిలిన వాటి అభివృద్ధికి అందుబాటులో ఉన్న ప్రభుత్వ భూములను గుర్తించి ఏపీఐఐసీకి అప్పగించాలని ప్రభుత్వం ఆదేశించింది. అవసరమైన చోట ప్రైవేటు భూములను కూడా సేకరించాలని కలెక్టర్లను కోరింది. మొత్తం 175 పార్కుల్లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిధులతో 122, ప్రైవేటు భాగస్వామ్యంతో 53 పార్కులను అభివృద్ధి చేయాలని నిర్ణయించింది. ఇక్కడ మౌలిక సదుపాయాల కల్పనకు అవసరమైన నిధులను రుణంగా తీసుకునేందుకు ఏపీఐఐసీకి ప్రభుత్వం అనుమతించింది. మొదటి దశలో 56 పార్కులను ప్రభుత్వం అభివృద్ధి చేస్తోంది. ఇందులో 11 పార్కులను ముఖ్యమంత్రి ప్రారంభించారు. 39 పార్కులకు ఆయన శంఖుస్థాపన చేశారు. మూడు నియోజక వర్గాల్లో ఇప్పటికే ఎంఎస్‌ఎంఈలకు ప్రత్యేక పార్కులు ఉన్నాయి. మూడు చోట్ల మౌలిక సదుపాయాలను కల్పించింది. మిగిలిన పార్కుల అభివృద్ధికి అవసరమైన భూములను సేకరించడంతో పాటు ప్రైవేటు భాగస్వామ్యంతో అభివృద్ధి చేసే పార్కులకు ప్రోత్సాహకాలు అందిస్తుంది.మిగిలిన 119 పార్కులను రెండు దశల్లో అభివృద్ధి చేస్తారు. వీటిలో 102 పార్కులకు అవసరమైన భూములకు సంబంధించి వివిధ జిల్లాల కలెక్టర్ల నుంచి ప్రతిపాదనలు ప్రభుత్వానికి అందాయి. పూర్తిగా ప్రభుత్వ భూములు అందుబాటులో ఉన్న 25 పార్కులను రెండో దశలో పూర్తి చేస్తారు. మూడో దశలో పార్కులను అభివృద్ధి చేయాలని ప్రభుత్వం భావిస్తోంది. ప్రైవేటు పార్కుల విధానం కింద 3 పార్కులను అభివృద్ధి చేసేందుకు అధికారులు అనుమతించారు. 14 పార్కుల కోసం భూములను గుర్తించాల్సి ఉంది. మౌలిక సదుపాయాలు కల్పించే భాధ్యత ఏపీఐఐసీ అప్పగించింది., ఎంఎస్‌ఎంఈ పారిశ్రామిక పార్కుల్లో మౌలిక సదుపాయాల కల్పన, భూసేకరణకు హడ్కో నుంచి రూ.5వేల కోట్ల రుణం తీసుకునేందుకు ఏపీఐఐసీకి ప్రభుత్వం అనుమతించింది. ఈ మేరకు రుణాన్ని ఇచ్చేందకు హడ్కో కూడా అంగీకరించింది.

# ఏపీ నైపుణ్యాభివృద్ధి కోసం ఏఐ పోర్టల్

విజయవాడ,డిసెంబరు 5,ప్రభాతవార్తప్రతినిధి: రాష్ట్రం లోని యువతకు నైపుణ్యాభివృద్ధి కోసం ఏఐ పోర్టల్‌ను రాష్ట్ర ప్రభుత్వం తీసుకొస్తోంది. దేశం లోనే తొలి ఏఐ టెక్నాలజీ ఆధారిత పోర్టల్‌గా ఇది నిలవనుంది. 'నైపుణ్యం' పేరిట అందుబాటులోకి రానున్న ఈ పోర్టల్ రాష్ట్రంలో యువతకు నైపుణ్యం శిక్షణ,ఉపాధి కల్పించేందుకు వేదిక కానుంది. అభ్యర్థుల సామర్థ్యాలను అంచనా వేసేందుకు కృత్రిమ మేథతో ఇంటర్వ్యూను ప్రవేశపెడుతోంది. ప్లంబర్ నుంచి బీటెక్ టెక్నాలజీ విద్య వరకు ప్రతి అభ్యర్థి సామర్థ్యాన్ని పోర్టల్ లోని ఏఐ అంచనా వేస్తుంది. నిరుద్యోగులు తమ అర్హతలతో ఏఐని వినియోగించి రెజ్యూమ్‌ను సైతం ఇందులో తయారు చేసుకోవచ్చు. నవంబరు 14,15 తేదీల్లో విశాఖలో జరుగనున్న సీఐఐ భాగస్వామ్య సదస్సులో ఈ పోర్టల్‌ను ఆవిష్కరించనున్నారు. కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాల వద్ద నున్న అన్ని రకాల డేటాను ఈ పోర్టల్‌తో అనుసంధానం చేస్తున్నారు. కేంద్ర ప్రభుత్వ 'ఈ-శ్రమ్,ఆధార్,డిజి లాకర్,ఈపీఎఫ్,ఆదాయ పన్ను చెల్లింపుదారుల వివరాలను పోర్టల్‌కు అనుసంధానించనున్నారు. అంటే వీటి ద్వారా ఎవరైనా ఇప్పటికే ఉద్యోగంలో ఉంటే ఆ వివరాలు కూడా తెలుస్తాయి. రాష్ట్ర ప్రభుత్వం వద్ద నున్న పాఠశాల స్థాయి నుంచి ఉన్నత స్థాయి విద్య వరకు ఉన్న వివిధ విభాగాల డేటాను అనుసంధానిస్తారు. ఆర్థికశాఖ వద్ద నున్న ఉద్యోగుల డేటాను కూడా దీనికి లింక్ చేస్తారు. ఉద్యోగాల కల్పన సంస్థల నౌకరీ,విజన్ ఇండియా వంటి సంస్థలు,ఇన్ఫోసిస్,యునిసెఫ్ వంటి అభ్యాసన ప్లాట్‌ఫాంలు ఈ పోర్టల్‌లో అందుబాటులో ఉంటాయి. వాటి వద్ద ఉండే జాబ్ ఖాళీల వివరాలు ఈ పోర్టల్‌లో కనిపిస్తాయి.

# రెండేళ్ల కుమార్తెతో కలిసి గృహిణి ఆత్మహత్య

## ట్యాంక్‌బండ్ నుంచి దూకి మృతి



కార్తీక అగర్వాల్(ఫైల్)

**హైదరాబాద్ (బేగంపేట), నవంబరు 5,ప్రభాతవార్త:** కుటుంబ కలహాలతో ఒక వివాహిత తన రెండేళ్ల కుమార్తెతో కలిసి ట్యాంకు బండ్ లో దూకి ఆత్మహత్య చేసుకున్న సంఘటన ఆలస్యంగా వెలుగుచూసింది. బహదూర్‌పురాలో నివాసం ఉంటూ వ్యాపారం చేస్తున్న పృధ్వీ లాల్,ఛార్డెడ్ అకౌంటెంట్‌గా పనిచేస్తున్న కార్తీక అగర్వాల్ (28) దంపతులకు రెండేళ్ల కుమార్తె బియ్యారా ఉంది. అయితే దంపతులిద్దరి మధ్య గొడవలు తలెత్తడంతో గడచిన రెండేళ్లుగా వీరు విడివిడి గా ఉంటున్నారు.కార్తీక బహదూర్‌పురాలో నివాసం ఉంటున్న తల్లి దండ్రులవద్ద కుమార్తెతో కలిసి ఉంటుంది. ఇంతలో ఏమి జరిగిందో తెలియదు గానీ ఈ నెల 2వ తేదీన కార్తీక అగర్వాల్ తన రెండేళ్ల కుమార్తెతో కలిసి ట్యాంకు బండ్‌లో దూకి ఆత్మహత్యకు పాల్పడింది.నెక్లెస్ రోడ్డులోని నీరా కేఫ్ సమీపంలో మృతదేహాన్ని గుర్తించిన స్థానికులు పోలీసులకు సమాచారం అం దించారు.మృతురాలి వివరాలు లభ్యం కాకపోవడంతో మృతదేహాన్ని మార్చు రీకి తరలించి భద్రపరిచారు. అయితే తమ కుమార్తె, మనుమరాలు కనిపిం చడంలేదంటూ కార్తీకఅగర్వాల్ తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేయ డంతో ఆత్మహత్యకు పాల్పడిన మహిళ కార్తీక అగర్వాల్‌గా పోలీసులు గుర్తిం చారు.దీంతో వెంటనే ఆమె తల్లి దండ్రులకు లేక్ పోలీసులు సమాచారం అం దించారు.మంగళవారం పాపమృతదేహాన్ని గుర్తించారు.తల్లి కుమార్తె మృత దేహాలకు గాంధీ ఆస్పత్రిలో పోస్ట్‌మార్టం నిర్వహించిన పోలీసులు అనంతరం కుటుంబసభ్యులకు అప్పగించారు.కేసును బహదూర్‌పురా పోలీసుస్టేషన్ కు బదిలీ చేస్తామని లేక్‌పోలీసులు తెలియజేసారు. కుమార్తె మనుమరాలి మృత దేహాలను చూసిన కుటుంబ సభ్యులు కన్నీరు మున్నీరుగా విలపించారు.

# గడ్డిమందు తాగి నవవధువు ఆత్మహత్య

## అత్తింటి వేధింపులే కారణం!



వనం వసంత(ఫైల్)

**గజ్వేల్, నవంబరు 5 ప్రభాతవార్త:** పెళ్లి అయ్యి మూడు నెలలు కాకముందే అత్త, మామ, భర్త వేధింపులు తాళలేక ఓ నవ వధువు గడ్డి మందు తాగి ఆత్మ హత్య చేసుకున్న సంఘటన ఇది. గజ్వేల్ పట్టణానికి చెందిన వనం సుగు ణమ్మ, నర్సింలు దంపతుల పెద్ద కుమార్తె వనం వసంత (22)నుపట్టణంలోని కండెల దుర్గమ్మ, గంగయ్యల కుమారుడు కండెల రోహిత్‌కు ఆగస్టు 10వ తేదీన 18తులాల బంగారం, రూ.10 లక్షల నగదు ఇచ్చి ఘనంగా వివాహం జరిపించారు. ఈనెల 1వ తేదీన సాయంత్రం 4 గంటలకు సుగుణమ్మ ఆమె కూతురు వసంతకు ఫోన్‌చేసి బాగున్నావా అని అడగడంతో కడుపునొప్పి వస్తుందని, వాంతులు అవుతున్నా యని, తలతిరిగినట్లుగా ఉందని చెప్పడంతో తల్లి సుగుణమ్మ ఏమైంది నీకు అని మందలించి అడగడంతో గడ్డిమందు తాగినట్లు చెప్పడంతో సుగుణమ్మ వెంటనే తన కుమారుడు సింహాద్రికి ఫోన్ చేసి అక్క ఫోన్‌లో ఏదోలా మాట్లాడుతుందని నీవు వెంటనే అక్క వద్దకు వెళ్ళమని చెప్పడంతో అక్కడికి వెళ్ళే సరికి వసంత అపస్మారక స్థితిలో ఉండడం చూసి కంగుతిన్న సింహాద్రి వెంటనే ప్రభుత్వా సుపత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో ఆర్‌విఎం ఆసుపత్రికి, అక్కడి నుండి నిమ్స్‌కు తరలించారు. గత నాలుగురోజుల నుండి చికిత్స పొందుతున్న వసంత బుధవారం ఉదయం మృతిచెందడంతో పోస్టుమార్టం నిమిత్తం గజ్వేల్ ప్రభుత్వా సుపత్రికితీసుకువచ్చారు.

# బాలికపై లైంగిక దాడి

## మద్యం తాగించి పలుమార్లు అత్యాచారం

### సహకరించిన తల్లి, ప్రియుడికి 180 యేళ్లు చొప్పున కఠిన జైలు

### రూ.11.75 లక్షలు జరిమానా విధించిన కేరళ పోక్సో కోర్టు

కోజికోడ్, నవంబరు 5: కేరళలోని కోజికోడ్‌లో జరిగిన దారుణ ఉదంతంపై కేరళ పోక్సోకోర్టు తీవ్రస్థాయిలో స్పందించింది. 12 ఏళ్ల మైనర్ బాలికపై పదేపదే అత్యాచారంచేసి హింసించి నందుకుగాను మహిళ, ఆమె బాగస్వామికి 180 ఏళ్లచొప్పున కఠిన కారాగార శిక్ష విధిం చింది. పోక్సోకోర్టు న్యాయమూర్తి అష్రాఫ్ ఎఎం బుధవారం తన తీర్పును వెలువరించారు. పోక్సో చట్టంలోని అనేక సెక్షన్లకింద వీరిపై కేసునమోదుచేసారు. ప్రతిసెక్షన్‌పరిధిలో 40 ఏళ్లచొప్పున కఠిన కారాగారశిక్ష ఉంటుందని, అలాగే 11.75 లక్షల రూపాయలు జరిమానా కూడా విదిం చారు. ఈ మొత్తాన్ని బాలికకు చెల్లించాలని ఆదేశించారు. జరిమానా చెల్లించనిపక్షంలో మరో 20 నెలలపాటు జైలుశిక్ష అనుభవిం చాల్సి ఉంటుందని వెల్లడించారు. పోక్సో కేసులో ఒకమహిళకు ఇంత భారీ ఎత్తునజైలుశిక్ష జరిమానా విధించడం బహుశా దేశ చరిత్రలో ఇదే మొదటిసారి అవుతుందని స్పెషల్‌పబ్లిక్‌ప్రాసి క్యూటర్ సోమశేఖరన్ అన్నారు. తన భర్త కుమార్తెతో తిరువనంత పురంలో జీవిస్తూనే ఈ నిందితురాలు మరొకరితో లేచిపోయిందని, వెళుతూ తన కుమార్తెను కూడా తీసుకు వెళ్లినట్లు పోలీసులు ఛార్జిషీటులో వెల్లడించారు. పాలక్కడ్, మాలాప్పురం ప్రాంతాల్లో అద్దెఇళ్లలో నివసిం చినట్లు తేలింది. 2019 డిసెంబరునుంచి 2021 అక్టోబరుమధ్యకాలంలో వీరంతా అద్దెఇళ్లలో నివసిస్తూ తరచూ మకాం మార్చే వారని ప్రాసిక్యూషన్ అభియోగంమోసింది. ఈ కాలంలోనే మహిళ ప్రియుడు పదేపదే 12 ఏళ్లమైనర్ బాలికపై అత్యాచారంచేసాడని, అందుకు బాలిక తల్లికూడా సహకరించి బాలికను బెదిరించి లైంగిక దాడికి మద్దతిచ్చిందని ప్రాసిక్యూషన్ అభియోగాలు నమో దుచేసింది. వ్యతిరేకిస్తే బాలిక మెదడులో చిప్ ఒకటి పెట్టామని, ఈ సంఘటన ఎవరికి చెప్పినా మాకు తెలిసిపోతుందని బెదిరిం చేందని ఆ బాలిక వాంగ్మూలం కూడా ఇచ్చిం ది. అంతేకాకుండా అత్యాచారానికి ముందు బాలికచేత బలవంతంగా మద్యం తాగించే వారని కూడా విచారణలో రుజువయింది. కేసును విచారించిన పోక్సోకోర్టు జరిమానా బాలికకు చెల్లించాలని, జిల్లా న్యాయసేవల అథారిటీ కూడా ఆమెకు అదనపు సాయం అందించాలని, బాదితురాలి సహాయ పథకం కింద మంజూరుచేయాలని ఆదేశాలిచ్చింది. ఈకేసులో పోక్సోచట్టం లోని సెక్షన్లు, జువనైల్ జస్టిస్ చట్టం, ఐపిసి కింద



విభిన్న అభియో గాలు నమోదుచేసి విచారణ చేసారు. ప్రియు డితో లేచిపోయిన ఈ మహిళ ఆతడితోకలిసి మైనర్‌బాలికసమక్షంలోనే లైంగికకార్యకలా పాలు చేసేవారని విచారణలో తేలింది. కోర్టు కు జరిమానా చెల్లిస్తే బాలికకు అందచేయాలని కోర్టు న్యాయ మూర్తి ఆదేశించారు. శిక్ష అను భవించేందుకుగాను ఇద్దరు దోషులను తవనూర్ జైలుకు తరలించారు.



# హైదరాబాద్ శివార్లలో నడిరోడ్డుపై హత్య

హైదరాబాద్ (జగద్గిరిగుట్ట), నవంబరు 5, ప్రభాతవార్త: నగర శివార్లలోని జగద్గిరిగుట్ట పోలీస్ స్టేషన్ పరిధిలో బుధవారం సాయం త్రం నాలుగు గంటలకు రౌడీషీటర్ ఓ యువ కుడిపై కత్తితో దాడి చేసి విచక్షణారహితంగా గాయపరిచి పారిపోయాడు. తీవ్ర గాయా లపాలైన బాధిత యువకుడిని స్థానికులు చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. స్థానికులు, జగద్గిరిగుట్ట పోలీసుల కథనం ప్రకారం జగదిరిగుట్ట సమీపంలోని రంగారెడ్డి నగరకు చెందిన రోషన్ సింగ్ (24), అతని స్నేహితుడు బుధవారం సాయంత్రం సుమారు నాలుగు గంటల సమయంలో జగద్గిరిగుట్ట బస్టాండ్ సమీపంలో ఉన్నారు. ఇద్దరు వ్యక్తులతో ద్విచక్ర వాహనంపై వేగంగా దూసుకు వచ్చిన స్థానిక రౌడీషీటర్ బాల శివారెడ్డి (34) అక్కడే ఉన్న రోషన్ సింగ్ వద్దకు వెళ్లి ఏదో విషయమై గొడవకు దిగాడు. ఇద్దరి మధ్య వాగ్వాదం జరగడంతో తీవ్ర ఉన్మాదంతో రెచ్చిపోయిన బాల శివారెడ్డి తాను తెచ్చుకున్న కత్తితో రోషన్ సింగ్‌ను కడుపులో, వీపు భాగంలో ఎనిమిది సార్లు పొడిచి తీవ్రంగా గాయపరిచాడు.


సంఘటన జరుగుతున్న సమయంలో బాధితుడు రోషన్ సింగ్‌ను కదలకుండా నిందితుడు బాల శివరెడ్డితో కలిసి వచ్చిన అతని స్నేహితుడు మహమ్మద్ ఒడిసి పట్టుకో వడంతో బాలశివరెడ్డి కత్తితో పదేపదే రోషన్ సింగ్‌పై పలుమార్లు కత్తితో దాడి చేశాడు. అకస్మాత్తుగా ఓ రౌడీ షీటర్ యువకుడిపై కత్తితో దాడి చేయడం చూసిన స్థానికులు భయంతో అక్కడి నుండి పారిపోయారు.

తీవ్ర గాయాలు పాలైన రోషన్ సింగ్ కడుపునుండి తీవ్ర రక్తస్రావం జరిగింది. బాలశివరెడ్డి రోషన్ సింగ్‌పై దాడి చేస్తున్న సమయంలో మహ మ్మద్ రోషన్ సింగ్ చేతులు పట్టుకొని కదలకుండా చేసి బాలశివరెడ్డికి దాడి చేయడానికి సహకరించాడు. అనంతరం దాడి పూర్తి అయిన తర్వాత మహమ్మద్‌తో కలిసి పారిపోవడానికి ఆదిల్ అనే స్నేహితుడు తన ద్విచక్ర వాహనం సిద్ధంగా ఉండడంతో దానిపై ముగ్గురు పారిపోయారు. తీవ్ర గాయాల పాలైన రోషన్ సింగ్‌ను స్థానికులు చికిత్స నిమిత్తం హుటాహుటిన ఆసుపత్రికి తరలించి పోలీసులకు సమాచారం అందిం చారు.

# అటు కార్తిక మాస పౌర్ణమి, ఇటు సూపర్ మూన్ కనువిందు

## దుబాయ్ సహా గల్ఫ్ దేశాలలో ప్రకాశవంతంగా కనిపించిన చంద్రుడు

**హైదరాబాద్, నవంబరు 5, ప్రభాతవార్త:** ఖగోళం లో బుధవారం మరో అద్భుతం ఆవిష్కృత మయ్యింది. కార్తిక పౌర్ణమి రోజున ఓవైపు వైష్ణవ, శివాలయాలలో పూజలు జరుగుతుం డడంతో పాటు లక్షల సంఖ్యలో భక్తులు నదుల్లో స్నానాలు చేసి, జపాలు చేస్తున్న తరుణంలో బీవర్ సూపర్ మూన్‌గా చంద్రుడు పెద్దదిగానూ ప్రకాశవంతంగానూ కనిపించాడు. బీవర్ సూపర్ మూన్ దుబాయ్ సహా పలు గల్ఫ్ దేశాలలోనే బాగా కనిపించగా భారత్‌లో ఢిల్లీ, ఈశాన్య రాష్ట్రాలలో సాయంత్రం ఆరున్నర గంటల సమయంలో చీకటి పడిన తరువాత పౌర్ణమి చంద్రుడు తరహాలో పరిపూర్ణంగా కనువిందు చేశాడు. తెలుగు రాష్ట్రాలలో కొన్నిచోట్ల మాత్రమే చంద్రుడు కని పించగా ఆకాశంలో మబ్బులు పట్టడంతో చాలాచోట్ల కనిపించలేదు. బీవర్ సూపర్ మూన్ ప్రభావంతో సాధారణ పౌర్ణమి చంద్రుడి కంటే ఎనిమిది శాతం పెద్దగా 16 శాతం అధిక కాంతితో చంద్రుడు ప్రకాశవం తంగా కనువిందు చేయడం గమనార్హం. ఈ ఏడాది అత్యంత ప్రకాశవంతమైన సూపర్ మూన్‌గా బీవర్ సూపర్ మూన్ నిలిచిందని శాస్త్రవేత్తలు తెలిపారు. బీవర్ సూపర్ మూన్ సమయంలో చంద్రుడు భూమికి సాధారణ సమయంలో కంటే 30 వేల కిలోమీటర్ల తక్కువ దూరంలో అంటే సుమారు మూ డు లక్షల 56 వేల కిలోమీటర్ల దూరంలో వుంటాడని శాస్త్రవేత్తలు తెలిపారు. కాగా బీవర్ సూపర్ మూన్‌ను దుబాయ్ సహా గల్ఫ్ దేశాల ప్రజలు వీక్షించారు. అక్కడ ఆకాశం నిర్మలంగా వున్నట్లు దుబాయ్‌లో బీవర్ సూపర్ మూన్‌ను వీక్షించిన ప్రజలు చెప్పడం గమనార్హం ఇందుకోసం దుబాయ్‌లో ని అస్ట్రానమి గ్రూప్ ఆపరేషన్స్ భారీగా ఏర్పాట్లు చేశారు.



# స్వయంకృషి పట్టుదల ఉంటే..



**నువ్వేమైనా సంపాదిస్తున్నావా? ఇంట్లో ఖాళీనేగా... చాలామంది గృహిణులు అనేక సందర్భాల్లో ఎదుర్కొనే మాటే ఇది. రితికా సింగ్కి ఆ ప్రశ్న ఎదురైంది. ఆ మాటకు బాధపడుతూ కూర్చోలేదామె. తనను తాను నిరూపించుకున్నారు. సీఓగా ఎదిగారు. ఆమె స్ఫూర్తిదాయక కథనమిది.**

తండ్రి ఎయిర్‌ఫోర్స్ అధికారి, ఇంట్లో విపరీతమైన క్రమశిక్షణ. దీనికితోడు తండ్రి ఉద్యోగరీత్యా తరచూ ప్రాంతాలు మారాల్సి వస్తుంది. దీంతో రితికకి స్నేహితులే ఉండేవారు కాదు. పుస్తకాలతోనే సావాసం చేసేవారు. ఈమెది చండీగఢ్. తండ్రి యుద్ధంలో మరణించాక మరింత ఒంటరిగా రితిక. అప్పటికి ఆమెకు 15 ఏళ్లు. ఆ బాధనుంచి బయటపడటానికి చదువుపై దృష్టి పెట్టారు. లిటరేచర్లో ఇంగ్లీష్ మాస్టర్స్ చేశారు. వెంటనే పెళ్లి, ఇద్దరు పిల్లలు. కొన్నేళ్లు గృహిణిగానే మిగిలిపోయారు. ఓరోజు కుటుంబమంతా ఎక్కడికో వెళ్తూ సర్దడం, వంట వంటి పనులన్నీ ఆమెకే అప్పగించారు. ఒక్కదానికే కష్టమంటే ఖిసంపాదన ఖాళీగా ఉన్నావంటూ మాట్లాడారు. ఆ మాటలు ఆమె మనసుని గాయపరిచాయి. దీంతో ఉద్యోగం సంపాదించి అందులో చేరారు రితిక ఆదామెలో ఆత్మవిశ్వాసం నింపింది. ఇంతలో భర్త నుంచి పొరపొచ్చాలు వచ్చాయి. ఒంటరిగా పిల్లల్ని పెంచాల్సిన పరిస్థితి. ఇంట్లో ఉంటూ కంటెంట్ రైటర్ ఫ్రీలాన్సర్గా మారారు. అప్పుడే ఆమెకు వ్యాపారం మొదలు పెట్టాలి అనిపించింది. అలా 2013లో ఖికంటెంట్ ఫ్యాక్టరీఖి. బ్రాండ్ స్ట్రాటజీ, సంస్థలకు సోషల్మీడియా పేజీలు, వెబ్‌సైట్‌లను నిర్వహించడం, ఈమెయిల్ మార్కెటింగ్ వంటివెన్నో సేవలు అందిస్తోంది. వేల సంస్థలతో కలిసి పనిచేసింది. ప్రపంచవ్యాప్తంగా 25 రకాల పరిశ్రమలతో పనిచేస్తోంది. ఖితొలిరోజుల్లో ఆన్‌లైన్ సేవలు, కనీసం ఎవరైనా ఆఫీస్ లేరని చాలామంది అనుమానిస్తున్నారు. అవకాశం ఇవ్వడానికి సంకోచించేవారు. అయినా కుంగిపోకుండా ప్రయత్నించా. ఇప్పుడు చాలా పెద్ద సంస్థలు మా కస్టమర్లుఖీ రీతిక అంటారు. తన సంస్థలో కీలక పదవుల్లో ఉన్నదంతా మహిళలే. గృహిణులు, తల్లులకు అవకాశాలిస్తూ వాళ్ల అభివృద్ధికీ సాయపడుతున్నారామె. టీఐఐకి జనరల్ సెక్రటరీ, ఇండియన్ విమెన్ నెట్‌వర్క్, చండీగఢ్కి చైర్మన్ కూడా. టెడెక్స్ వేదికల మీద స్ఫూర్తి పాఠాలూ చెబుతుంటారు. ఈమె ప్రయాణం... స్వయంకృషి, పట్టుదల ఉంటే ఎవరైనా సాధించగలరనడానికి నిదర్శనం... కదూ!

# పెళ్లికి ఉల్లి, వెల్లుల్లికి సంబంధం లేదు !

వ్యథ

**ప్రశ్న:** మా అమ్మ చాదస్తం వల్ల మా చెల్లికి పెళ్ళి కావడం లేదు. ఆమెకు 31 సంవత్సరాలు పూర్తి అయ్యాయి. చెన్నైలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తోంది. అయినా పెళ్ళికాక, తోడు లేక బాధ పడుతున్నది. కొన్నాళ్ళకు డిప్రెషన్‌లోకి వెళ్ళేలా కనిపిస్తోంది. చెల్లికి కుజ దోషం ఉన్నందున చాలా జాగ్రత్తలు తీసుకుంటున్నది. జాతకాలు కుదరలేదని కొన్ని సంబంధాలు తిరస్కరించింది. అబ్బాయికి తండ్రి ఉన్నాడని కొన్నింటిని వద్దని చెప్పింది. ఆస్తిలేదని, జీతం తక్కువని, ఉద్యోగం లేదని ఏదో ఒక కారణం చెప్పి సంబంధాలు తప్పించి వేస్తోంది. ఇప్పుడు ఎవరో జ్యోతిష్యుని మాట విని ఉల్లి పాయలు, వెల్లుల్లి తినకూడదని చెల్లిపై నిషేధం విధించింది. దాదాపు ఐదేళ్లుగా తిరగని గుడి, చేయని పూజ లేదు. మా అమ్మ ఇంటర్ చదివింది. నాన్న డిగ్రీ చదివి ప్రభుత్వ ఉద్యోగం చేస్తున్నారు. మేము ముగ్గురం ఆడ పిల్లలం. నేను పెద్దదాన్ని, బిటెక్ చదివి ఉద్యోగం చేస్తున్నాను. నాకు నచ్చిన ఒక అబ్బాయి జాతకం మార్పించి మా అమ్మను నమ్మించి పెళ్ళి చేసుకున్నాను. నాకు ఇద్దరు అబ్బాయిలు పుట్టారు. మా వారు మంచి వ్యాపార వేత్తగా ఎదుగుతున్నారు. పెద్ద చెల్లెలు జాతకాలు సరిపోవడంతో పెళ్లి చేసుకుంది. ఆమెకు ఒక ఆడ పిల్ల పుట్టింది. వారికి కొంత అప్పులు, సమస్యలు ఉన్నాయి. నేను, మా నాన్న, బంధువులు ఎవరు ఎన్ని చెప్పినా మా అమ్మ వినడం లేదు. ఆమెను మార్చే మార్గం చెప్పండి.

**- ఒక సోదరి, విశాఖపట్నం**




**ఎన్.బి.సుధాకర్‌రెడ్డి**
**సైకాలజిస్టు**

**జవాబు :** మీ అమ్మ అతి జాగ్రత్త పాటిస్తున్నట్టు అర్థం అవుతోంది. దీర్ఘకాలం ఒత్తిడి, సమస్యలకు గురయిన వారిలో మూఢ విశ్వాసాలు బలపడతాయి. ఆమె చిన్న చిన్న కూతురిపై అమితమైన ప్రేమతో అతిగా ఆలోచిస్తోంది. మన సమాజంలో కొందరు జాతకులకు ప్రాధాన్యత ఇస్తున్నారు. అది వారి నమ్మకం, విశ్వాసం అనడంలో సందేహం లేదు. అయితే వివాహ బంధం బలపడటానికి భార్యా భర్తల ఆలోచనలు, ప్రవర్తన, సర్దుబాటు, ప్రేమ, అనురాగం ముఖ్యం. జాతకాలు కలిసినంత మాత్రాన జీవితం బాగుంటుందన్న గ్యారంటీ లేదు. కుజ దోషానికి శాస్త్రీయత లేదు. మీ అమ్మను చులకనగా చూడకుండా ఫ్యామిలీ కౌన్సిలర్ ద్వారా ఆమెలో వివేకం కలిగించే ప్రయత్నం చేయండి. పెళ్లిలో జాతకాల ప్రభావం ఏమీ ఉండదన్న శాస్త్రీయ దృక్పథం కలిగించండి. దీనికి తగిన ఉదాహరణలు చూపి అర్థం అయ్యేలే చెప్పండి. పెళ్లి కాక పోవడానికి ఉల్లి, వెల్లుల్లికి సంబంధం ఉండదన్న విషయం వివరించండి. తల్లి, తండ్రి లేని అబ్బాయిలంటే ఉన్న వారికి కలిగే ప్రయోజనాలు వివరించండి. ఆమెలో ఏవైనా మానసిక సమస్యలు ఉన్నాయేమో గమనించండి. ఇలాంటి వారిలో ఆలోచనా పరమైన అబ్సెసివ్ కంపల్సివ్ డిజార్డర్ ఉండే అవకాశం ఉంది. ఫ్యామిలీ కౌన్సిలర్ అన్నీ పరిశీలించి ప్రవర్తనలో మార్పు తీసుకుని రావడానికి ప్రయత్నిస్తారు.



# ఉన్నది చాలును..

ఒకసారి బొంబాయి నుండి మే, 1917లో కాకా సాహెబ్ దీక్షిత్, తన భార్య షిరిడీలోని సాయి సన్నిధికి వెళుతు న్నారని తెలుసుకున్న సాయి శరణానంద రైల్వేస్టేషన్‌కు వెళ్లి వారి ద్వారా సాయికి పూల మాల, పండ్లు, కొంత దక్షిణ పంపదలచి తన బావతో స్టేషన్‌కు వెళ్లాడు. ఆయన మనసంతా ఆధ్యాత్మిక విషయాలతోనే నిండిపోయింది. తానే స్వమయంగా వెళ్లి, సాయిబాబాకు సమర్పిస్తే బాగుండును అనిపించింది. సాయిబాబాకు అర్పించిన వెంటనే తిరిగి రావచ్చనే ఆలోచనతో, వారితో షిరిడీకి బయలు దేరాడు. కాని, ఆయన చాల రోజులు సాయి సన్నిధిలో ఉండిపోయాడు. ఇక బయలుదేరదామనే సంకల్పం సాయి భక్తులు చేసుకోలేరు. నిర్ణయించేది సాయియే. ఆయన అలా షిరిడీలో 21 రోజులు ఉన్నాడు. ఆ సమయంలో అనేక అమూల్య అనుభవాలను సాయి కలిగించారు సాయి శరణానందకు. అందులో ఒక అనుభవం: ఒకసారి సాయి శరనానంద శనగపప్పు, మసాలా, కొబ్బరి మొదలైన వాటితో చేసిన పచ్చడి తిన్నారు. అది చాలా కారంగా ఉంది. అందువలన ఆయన శరీరంలో వికారం కలిగి, అది వమనం ద్వారా బయటకు వెళ్లిపోయింది. మరునాడు సాయి దర్శనానికి వెళ్ళగా ఏ వస్తువు మన వాటాలో లేదో, దాన్ని తింటే ఇలాగే తెరలు, తెరలుగా బయటకు వస్తుంది అన్నారు సాయి. మనది ఏదో మన వద్దనే ఉంటుంది. మనది కానిది మన నుంచి దూరంగా వెళ్లిపోతుంది. ఇది ఆహారానికే పరిమితం కాదు. అన్నిటికి వర్తించే సూత్రం. ఈ సూత్రం గ్రహిస్తే, ఉన్నది పోతుందే మోనన్న భయము, అనుకున్నది రాదేమో అనే ఆందో ళన కలుగవు. దీనినే సాయి శ్యామారావ్ జయకర్‌కు కూడా తెలిపారు అనుభవం ద్వారా. ఒకసారి జయకర్ ఒక మహమ్మదీయ స్త్రీకి నాలుగు వేల రూపాయ లిచ్చాడు అప్పుగా, ఎంతకూ ఆమె ఆ డబ్బును ఇవ్వటం లేదు. బాబాను అడిగారాయన పాపిష్టి సొమ్ము కొరకు కష్టపడనేల అన్నారు సాయి. ఆయనకు సాయి మాటలు అర్థం కాలేదు. 2,3 సంవత్సరాలు గడిచాయి. ఆమె సంపదంతా పోగొట్టుకుంది. అప్పుడు అర్థమైంది జయ కర్‌కు. తాను ఒకవేళ ఆ సొమ్మును పొందినా, అది తన వద్ద నిలవదని. ఉన్నదానితో సంతృప్తి చెందితే చాలు అనేది సాయి బోధ.



# ప్లాస్టిక్‌తో ముప్పు

ప్లాస్టిక్ వినియోగం విషయంలో చాలామందికి ఈ సందేహం ఉంటుంది. ప్లాస్టిక్, క్యాన్సర్ మధ్య గల సంబంధాన్ని పరిశీలిస్తే.. ప్లాస్టిక్ తయారీ వాడే రసాయన సమ్మేళనాలు ఇందుకు కారణమవుతుంటాయి. ప్లాస్టిక్ తయారీ పరిశ్రమల్లో ఈ సమ్మేళనాలు గ్యాస్ రూపంలో బయటకు వస్తాయి. వాటిని పీల్చినప్పుడు కొంత ప్లాస్టిక్ కరిగి జీర్ణకోశంలోకి ప్రవేశించే అవకాశం ఉంది. ఇది ఆరోగ్యానికి మంచిది కాదు. కాబట్టి, ఫుడ్ గ్రేడ్ కాని ప్లాస్టిక్ వస్తువుల్లో వేడి పదార్థాలను పెట్టకపోవడం, అవెన్‌లో పెట్టి వేడి చేయకపోవడం, అలాంటి వస్తువులను వాడకపోవడం మంచిది.




అలాగే క్యాన్సర్‌ను కారణమయ్యే రసాయనాలను విడుదల చేసే పరిశ్రమలకు దూరంగా ఉండడం అన్ని రకాలుగానూ మంచిది. ఏ రకంగా ఇనా సర్వే ప్లాస్టిక్ వినియోగానికి సాధ్యమైనంత వరకు దూరంగా ఉన్నప్పుడే ఇటు క్యాన్సర్ అటు ఇతర ఆరోగ్యాల ముప్పును తగ్గించు కోవచ్చు.

# ఆఫీసులో నిద్రా?

**కొంతమంది ఉద్యోగినులకు ఆఫీసుకెళ్లగానే నిద్ర ముంచుకొస్తుంది. ఇంకొందరికేమో కాస్త అన్నం తినగానే ఆవలింతలు మొదలై పోతాయి. ఎందుకిలా?**

దీనెలా అదుపు చేసుకోవాలి. మధ్యాహ్న భోజనం తరవాత శరీరంలో ఇన్సులిన్ స్థాయి పెరిగి రక్తంలో చక్కెర స్థాయులు ఎక్కువుతాయి. ఇది నిద్రపోయే హార్మోన్లు సెరటోనిన్, మెలటోనిన్‌ను పెంచుతుంది. దీంతో కాస్త మగతగా నిపిస్తుంది. ఇలాంటప్పుడు తిన్న వెంటనే పనిలో పడిపోకుండా. కాసేపు అంటూ ఇటూ నడవండి లేదా మెట్లెక్కి దిగండి.



శరీరానికి తగినన్ని నీళ్లు అందనప్పుడు అలసటకు గురవుతుంది. ఇది నిద్రకూ కారణం అవ్వొచ్చు. ఎప్పుడైనా కళ్లు మూతలు పడుతున్నా యంటే ఓ గ్లాసు వాటర్ తాగి చూడండి. ★ మీరు శక్తినిచ్చే ఆహారం తీసుకోకపోయినా నిద్ర ముంచుకొస్తున్నట్లు అనిపిస్తుంది. సాయంత్రం అయ్యేసరికి ఈ సమస్య ఎదురవుతుంటే మీరు నిససత్తువతో ఉన్నట్లే. ఈ పరిస్థితి అదుపులోకి రావాలంటే గుప్పెడు నట్స్, సీడ్స్‌ని డబ్బాలో వేసుకుని వెంట తీసుకెళ్లండి. మీకు తీసుకునే ఆహారంలో ఇనుము, ప్రోటీన్లు పిండిపదార్థాలు ఎక్కువగా ఉండేలా చూసుకోవాలి. ఇవన్నీ మిమ్మల్ని ఉత్సాహంగా ఉంచేవే. ★ పగటి పూట నిద్ర వెంటాడటానికి మరో కారణం రాత్రిళ్లు మీరు గాఢ నిద్ర లేకపోవడమే. ఇందుకు పనివేళలు, గ్యాడ్జెట్స్ కారణం ఏదైనా సరే.. వాటిని నియంత్రించుకోండి. కనీసం ఆరుగంటలైనా కలత నిద్రలేకుండా చూసుకోండి. ఇది మీ సమస్యను అదుపులో ఉంచుతుంది.

# 'శివ' రీ రిలీజ్ ట్రైలర్ లాంచ్



తిరగరాస్తూ ఇండియన్ సినిమాను 'బిఫోర్ శివ', 'ఆఫ్టర్ శివ'గా రీడిఫైన్ చేసింది. రామ్ గోపాల్ వర్మ దర్శకత్వంలో 1989లో విడుదలైన శివ చిత్రాన్ని అన్నపూర్ణ స్టూడియోస్ బ్యానర్ లో నిర్మాతలు అక్కినేని వెంకట్ సురేంద్ర యార్లగడ్డ నిర్మించారు. అన్నపూర్ణ స్టూడియోస్ 50 ఇయర్స్ సందర్భంగా శివ చిత్రాన్ని 4కె డాల్బీ ఆట్మాస్ లో నవంబర్ 14న థియేటర్లలో గ్రాండ్ గా రిలీజ్ చేస్తున్నారు. ఈ సందర్భంగా ఫ్యాన్స్ సమక్షంలో శివ రీరిలీజ్ ట్రైలర్‌ని లాంచ్ చేశారు. ఈ కార్యక్రమంలో కింగ్ నాగార్జున, దర్శకుడు రామ్ గోపాల్ వర్మ పాల్గొన్నారు. అద్భుతమైన 4కె విజువల్స్, డాల్బీ ఆట్మాస్ సౌండ్ తో ట్రైలర్ అదిరిపోయింది. ప్రతి సీన్‌లో టెన్షన్, ఎమోషన్ ఆడియన్స్‌ని కట్టిపడేసింది. ట్రైలర్ చివర్లో నాగర్జున సైకిల్ చైన్ లాగిన సీన్ గూస్బంప్స్ క్రియేట్ చేసింది. శివ మ్యాజిక్ ని 4కె డాల్బీ ఆట్మాస్ లో థియేటర్స్‌లో చూడాలనే ఎక్సయిట్మెంట్ ట్రైలర్ మరింతగా పెంచింది. ట్రైలర్ లాంచ్ ఈవెంట్‌లో కింగ్ నాగార్జున మాట్లాడుతూ... ఎంతో ప్రేమతో వచ్చిన మీ అందరికీ థాంక్యూ. ఈ సినిమాని మీ నాన్నగారు, అమ్మగారు థియేటర్స్‌లో చూసుంటారు వాళ్ళందరికీ థాంక్యూ. ఇప్పుడు అదే ప్రేమతో మీరు వచ్చారు. మీకు థాంక్యూ. డైరెక్టర్ రాంగోపాల్ వర్మ మాట్లాడుతూ.. అందరికీ హాయ్. 36 ఏళ్ల క్రితం తీసిన ఈ సినిమా.. 36 ఏళ్ల తర్వాత మా ఇద్దరం కూడా ఒకే స్టేజ్ పై ఇలా మీ ముందు రీరిలీజ్ ట్రైలర్ లాంచ్ చేస్తూ మాట్లడతామని నేను ఎప్పుడూ కూడా ఊహించలేదు. ఇది వెరీ గ్రేట్ ఫీలింగ్. ఆరోజు నాగర్జున నాకు విజువల్‌గా సౌండ్ పరంగా చాలా క్రియేటివ్ ఫ్రీడమ్ ఇచ్చారు. ఈ రోజు కూడా అంతే ఫ్రీడమ్ ఇచ్చారు. రీ రిలీజ్ కోసం సౌండ్ ని చాలా బెటర్‌గా డిజైన్ చేశాం.

'శివ'డాల్బీ ఆట్మాస్ సౌండ్ తో స్టన్నింగ్ గా అనిపించింది. నవంబర్ 14న థియేటర్స్‌లో మైండ్ బ్లోయింగ్ ఎక్స్ పీరియన్స్ ఉంటుంది: శివ రీరిలీజ్ ట్రైలర్ లాంచ్ ఈవెంట్ లో కింగ్ నాగార్జున చిరంజీవి గారు చెప్పినట్టు సినిమా ఉన్నంతవరకు శివ చిరంజీవిలా చిరస్మరణీయం: డైరెక్టర్ రాంగోపాల్ వర్మకింగ్ నాగార్జున ఆల్ టైం కల్ట్ క్లాసిక్ 'శివ' బాక్సాఫీసు రికార్డులుని

# 'శంబాల' ఏ ఒక్కరినీ నిరాశపర్చదు: ఆది

వెర్సటైల్ హీరో ఆది సాయి కుమార్ నటిస్తున్న సూపర్ నేచరల్ థ్రిల్లర్ 'శంబాల: ఎ మిస్టికల్ వరల్డ్ ట్రైలర్ ఒక్కసారిగా అంచనాల్ని పెంచేసిన సంగతి తెలిసిందే. .హీరో ఆది సాయి కుమార్ మాట్లాడుతూ.. .. మా టీజర్‌ను రిలీజ్ చేసిన దుల్కర్ గారికి, మాకు సపోర్ట్ చేసిన థమన్, నా స్నేహితుడు సందీప్ కిషన్, ట్రైలర్ రిలీజ్ చేసిన డార్లింగ్ ప్రభాస్ గారికి థాంక్స్. మా ప్రమోషనల్ కంటెంట్‌కు అన్ని చోట్లా పాజిటివ్ రెస్పాన్స్ వస్తుండటం ఆనందంగా ఉంది. మేం సినిమా మీద బజ్‌ను క్రియేట్ చేసే క్రమంలోనే ట్రైలర్‌ను ఇంత త్వరగా రిలీజ్ చేశాం. ప్రభాస్ ఫ్యాన్స్, సినీ లవర్స్ అందరూ కూడా మా ట్రైలర్‌ను మెచ్చుకుంటున్నారు. ఈ క్రమంలో మాకు సహకరించిన వంశీ, ప్రమోద్, ప్రసాద్ అన్నలకు థాంక్స్. ట్రైలర్ చూసి కిరణ్ అబ్బవరం అభినందించారు. రానా కూడా మా ట్రైలర్ చూసి మెచ్చుకున్నారు. ఈ మూవీకి తనవంతు సాయం చేస్తానని రానా మాటిచ్చారు. హిందీ రిలీజ్ గురించి కూడా అందరూ అడుగుతున్నారు. మీడియా నుంచి కూడా మాకు మంచి సపోర్ట్ లభిస్తోంది.



# తెర

## సంతృప్తిని ఇచ్చింది "ది గర్ల్ ఫ్రెండ్' : అల్లు అరవింద్..



నేషనల్ క్రష్ రశ్మిక మందన్న, టాలెంటెడ్ హీరో దీక్షి త్ శెట్టి జంటగా నటిస్తున్న సినిమా "ది గర్ల్ ఫ్రెండ్". ఈ సినిమాను ప్రముఖ నిర్మాత అల్లు అరవింద్ సమర్పణలో గీతా ఆర్ట్స్, ధీరజ్ మొగిలినేని ఎంటర్ టైన్ మెంట్ బ్యానర్స్ సంయుక్తంగా నిర్మిస్తున్నాయి. ఇంటెన్స్, ఎమోషనల్ లవ్ స్టోరీతో దర్శకుడు రాహుల్ రవీంద్రన్ రూపొందిస్తున్నారు. ప్రొడ్యూసర్ అల్లు అరవింద్ మాట్లాడుతూ నిర్మాతగా ఎన్నో సినిమాలు చేశాను, చేస్తున్నాను. సినిమాల ద్వారా కోట్ల రూపాయలు సంపాదించాను. అందులో దాపరికం లేదు. అయితే "ది గర్ల్ ఫ్రెండ్" సినిమా ద్వారా నేను సంపాదించాలనుకున్నది డబ్బు కాదు. సంతృప్తి. ఈ సినిమా నిర్మించాననే విషయం ఎంతో సంతృప్తినిస్తోంది. మనకు తెలిసిన కొన్ని చెప్పలేని నిజాలను సినిమా మాధ్యమం ద్వారా చెప్పాలి అనే ఫీల్ ఈ కథ విన్నప్పుడు కలిగింది. రాహుల్ లాంటి సున్నిత మనస్కుడు, కమిటెడ్ పర్సన్ మాత్రమే ఇలాంటి సినిమాను రూపొందించగలరు. ఆయన కథ చెబుతున్నప్పుడు ఎంత ఉద్వేగంతో చెప్పారో, సినిమాను కూడా అంతే బాగా తెరకెక్కించారు. ఎన్ని పాటలున్నాయి, ఎన్ని జోక్స్ ఉన్నాయి, ఎంత ఎంటర్ టైన్ మెంట్ ఉంది అని చూసే సినిమా కాదిది. అలా చూస్తే ఈ సినిమా చేయలేం. మన అక్క, చెల్లి, పిన్ని వాళ్ల మనసుల్లో ఏముంటుంది, ఎలాంటి కోర్కెలు ఉంటాయి అనుకుని మూవీ చూడాలి. ది గర్ల్ ఫ్రెండ్ కాకుండా మరో టైటిల్ ఈ సినిమాకు చెప్పమంటే నీ జీవితమంతా నేనే అని చెప్పాలి. అమ్మాయి అబ్బాయి తమ జీవిత భాగస్వామి గురించి ఇలాగే అనుకుంటూ అతి సున్నితంగా సాగే ఈ సినిమా చివరకు అతి ఘాటుగా ముగుస్తుంది. ఈ సినిమా చూశాక చాలామంది ఆ రాత్రి నిద్రపోరు. అంతగా ఈ మూవీ వారిని వెంబడిస్తుంది. ప్రతి ఫ్యామిలీలో ప్రతి పర్సన్

## 'జిగ్రీస్' మీరేలే సాంగ్ లాంచ్



కృష్ణ బురుగుల, ధీరజ్ ఆత్రేయ, మణి వక్కా, రామ్ నితిన్ ప్రధాన పాత్రల్లో మౌంట్ మెరు పిక్చర్స్ నిర్మిస్తున్న యూత్‌ఫుల్ క్రేజీ ఎంటర్‌టైనర్ "జిగ్రీస్". హరీష్ రెడ్డి ఉప్పుల దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రానికి కృష్ణ వోడపల్లి నిర్మాత. ఇప్పటికే విడుదలైన టీజర్ కి అద్భుతమైన రెస్పాన్స్ వచ్చింది. సక్సెస్ ఫుల్ డైరెక్టర్ తరుణ్ భాస్కర్ తాజాగా మీరేలే సాంగ్ లాంచ్ చేశారు. సయ్యద్ కమ్రాన్ ఈ సాంగ్ ని ఫ్రెండ్ షిప్ మెలోడీగా కంపోజ్ చేశారు. హరీష్ రెడ్డి ఉప్పుల రాసిన లిరిక్స్ ఫ్రెండ్స్ మధ్య ఎమోషన్ ప్రజెంట్ చేశాయి. ఏక్‌నాథ్ వోకల్స్ సాంగ్‌ని మరింత టచ్చింగ్ గా మార్చింది. ఈ సాంగ్ ఇన్సంట్ గా అందరికీ కనెక్ట్ అవుతుంది. జిగ్రీస్ ఫ్రెండ్షిప్, క్రేజీ అడ్వెంచర్స్, హిలేరియస్ రోడ్ ట్రిప్ ఎంటర్‌టైనర్‌గా ఉండబోతోందిఈ చిత్రానికి ట్యాలెంటెడ్ టెక్నిషియన్స్ పని చేస్తున్నారు. ఈశ్వరాదిత్య డీవోపీ, కమ్రాన్ మ్యూజిక్, చాణక్య రెడ్డి ఎడిటర్. జిగ్రీస్ నవంబర్ 14న వరల్డ్ వైడ్ రిలీజ్ కానుంది. నటీనటులు: కృష్ణ బురుగుల, ధీరజ్ ఆత్రేయ, మణి వక్కా, రామ్ నితిన్ స్క్రీన్‌ప్లే దర్శకత్వం: హరీష్ రెడ్డి ఉప్పుల నిర్మాత: కృష్ణ వోడపల్లి, డీవోపీ: ఈశ్వరాదిత్య ఎడిటర్: చాణక్య రెడ్డి, సంగీతం: కమ్రాన్, సౌండ్ డిజైన్: వి. స్వాప్నిక్ రావు పీఆర్వో: వంశీశేఖర్

# జటాధర వండర్‌ఫుల్ సినిమా : ప్రేరణ అరోరా



నవ దళపతి సుధీర్ బాబు, బాలీవుడ్ పవర్‌హౌస్ సోనాక్షి సిన్హా ప్రధాన పాత్రలలో నటిస్తున్న మోస్ట్ ఎవైటెడ్ సూపర్ నేచరల్ మైథలాజికల్ థ్రిల్లర్ జటాధర. అద్భుతమైన సినిమాటిక్ ఎక్స్ పీరియన్స్ అందించే ఈ పాన్ఇండియా ద్విభాషా చిత్రానికి వెంకట్ కళ్యాణ్, అభిషేక్ జైస్వాల్ దర్శకత్వం వహించారు. జీ స్టూడియోస్, ప్రేరణ అరోరా సమర్పిస్తున్న ఈ చిత్రాన్ని ఉమేష్ కుమార్ బన్సల్, శివిన్ నారంగ్, అరు ణ అగర్వాల్, ప్రేరణ అరోరా, శిల్పా సింగ్‌హాల్, నిఖిల్ నందా నిర్మించారు. ఈ సందర్భంగా నిర్మాత ప్రేరణ అరోరా విలేకరుల సమావేశంలో సినిమా విశేషాలు పంచుకున్నారు.

**జటాధర సినిమా జర్నీ ఎలా మొదలైంది?**

తెలుగులో సినిమా చేయాలనేది ఎప్పటినుంచో నా కల. తెలుగు సినిమా, తెలుగు కల్చర్ అంటే చాలా ఇష్టం. నేను హిందీలో సినిమాలో చేస్తున్నప్పటికీ తెలుగు సినిమా అంటే నాకు చాలా ఇన్స్పిరేషన్. రామ్ చరణ్ గారి ఆరెంజ్ సినిమా చూశాను. అప్పటి నుంచి నాకు తెలుగు సినిమా పట్ల చాలా పాషన్ వచ్చింది. తెలుగు సినిమాలు చాలా అద్భుతంగా ఉంటాయి. కమర్షియల్, మాస్, హ్యాపీ, ఫ్యామిలీ అన్ని ఎమోషన్స్ తో సినిమాలు వస్తుంటాయి. తెలుగు సినిమా చాలా గొప్ప సినిమాలని ఇండియన్ సినిమాకి అందించింది.

**సుధీర్ సుధీర్ బాబు గారితో వర్క్ చేయడం ఎలా అనిపించింది?**

సుధీర్ బాబు గారంటే నాకు చాలా అభిమానం. ఆయన సినిమాలు చూస్తుంటాను. నేను తెలుగులో చేసిన మొదటి సినిమా ఆయనతో చేయడం చాలా ఆనందాన్ని ఇచ్చింది. ఆయన చాలా హార్డ్ వర్క్ చేస్తారు. చాలా పాషన్ తో వర్క్ చేశారు. ఇందులో చాలా చాలెంజింగ్‌గా అనిపించే సీక్వెన్స్ లో ఉన్నాయి.

**సోనాక్షి సిన్హా గారు ఈ కథ విన్నప్పుడు ఎలా రియాక్ట్ అయ్యారు?**

ఈ సినిమా కథ విన్నప్పుడే దీన్ని హిందీలో కూడా చేయాలని నిర్ణయించుకున్నాను. సోనాక్షి సిన్హా గారు నాకు ముందే తెలుసు. ఆమె అద్భుతమైన పెర్ఫార్మర్. ధన పిశాచి క్యారెక్టర్ కి సోనాక్షి పర్ఫెక్ట్. చాలా మెమొరబుల్ క్యారెక్టర్ అవుతుంది. తప్పకుండా ఆడియన్స్‌కి గ్రేట్ థియేటర్ ఎక్స్పీరియన్స్ ఇస్తుంది.

షూటింగ్ ముందు చాలా ప్రిపరేషన్ ఉండేది. సుధీర్ బాబు గారితో సోనాక్షికి చాలా హెవీ యాక్షన్ సీక్వెన్స్ లో ఉన్నాయి. అవన్నీ కూడా ప్రేక్షకుల్ని అలరిస్తాయి.

**కథలో అనంత పద్మనాభస్వామి ఆలయానికి సంబంధించిన స్ఫూర్తి ఉందా?**

మైథలాజికల్ స్ఫూర్తితో రాసుకున్న కథ ఇది. అనంత పద్మనాభ స్వామి దేవాలయంలో నాగబంధం గురించి తెలిసే ఉంటుంది. నేను పురాణాలని చదువుతాను. శ్రీ వెంకటేశ్వర స్వామి నాకు ఇష్ట దైవము. పద్మనాభ స్వామి టెంపుల్ ఇన్స్పిరేషన్ ఇందులో ఉంటుంది. ధన పిశాచి కి సంబంధించి ఎలిమెంట్స్ ఆడియన్స్ ని చాలా సర్ప్రైజ్ చేస్తాయి. ఈ సినిమాలో డివైన్ ఎలిమెంట్స్ బ్లాక్ మ్యాజిక్ లాంటి ఎక్సైటింగ్ ఎలిమెంట్స్ వున్నాయి.

**శిల్పా శిరోద్కర్ గారికి గురించి?**

శిల్పా శిరోద్కర్ గారు బిగ్ బాస్ లోకివెళ్లే సమయంలో కలిసాను. బిగ్ బాస్ నుంచి బయటకు వచ్చిన తర్వాత ఈ క్యారెక్టర్ గురించి చెప్పాను. తన పెర్ఫార్మన్స్ ఈ సినిమాలోచాలా స్పెషల్‌గా ఉండబోతుంది . ఆ క్యారెక్టర్ లో చాలా ఎమోషన్స్ ఉంటాయి. మేము మరో తెలుగు సినిమా కూడా మేము చేయబోతున్నాం. పెద్ద హీరోతో ఆ సినిమా చేస్తున్నాం. త్వరలోనే ఆ సినిమా వివరాలు కూడా తెలియజేస్తాం.

### ఫిడే ప్రపంచ కప్..
# తొలి గేమ్ గెలిచిన అర్జున్, ప్రణవ్





**న్యూఢిల్లీ:** ఫిడే ప్రపంచ కప్ 2025లో నాల్గవ రోజున భారత ఆటగాళ్లకు మిశ్రమ స్పందన లభించింది. ప్రపంచ జూనియర్ ఛాంపియన్ వి ప్రణవ్, గ్రాండ్ మాస్టర్ ఎరిగాసి అర్జున్ వరుస విజయాలు నమోదు చేశారు. గోవాలో జరిగిన రెండవ రౌండ్ ప్రారంభ ఆటలో టాప్ సీడ్ గుకేష్, గ్రాండ్ మాస్టర్ విదిత్, ఆర్ ప్రజ్ఞానంద డ్రాగా ముగిశారు. ఇద్దరు యువ తారల మధ్య జరిగిన పోరులో ప్రణవ్ నార్వేకు చెందిన గ్రాండ్ మాస్టర్ ఆర్యన్ తారిని 41 ఎత్తుగడలలో ఓడించగా, అర్జున్ బల్గేరియాకు చెందిన మార్టిన్ పెట్రోవ్‌ను 37 ఎత్తుగడలలో ఓడించాడు. అలాగే ప్రస్తుత ప్రపంచ ఛాంపియన్ డి గుకేష్ కజకిస్తాన్‌కు చెందిన గ్రాండ్ మాస్టర్ కాజిబెక్ నోగర్‌బెక్‌తో డ్రా చేసుకోవడంతో తన ప్రచారాన్ని నిరాశపరిచాడు. అర్జెంటీనా ప్రాడిజీ ఐఎం ఫాస్టినో ఓరోతో జరిగిన మ్యాచ్‌లో విదిత్ తన సమయ ఒత్తిడిని అధిగమించి పాయింట్లను విభజించుకున్నాడు. విదిత్ 11 కదలికల తర్వాత 31 ఏళ్ల ఓరో కేవలం 38 నిమిషాలు మాత్రమే మిగిలి ఉన్నాడు.

ఓరో తన రూక్‌ను అటాకింగ్ లైన్ నుండి దూరంగా తరలించడం ద్వారా ప్రయత్నించాడు ఇక విదిత్ 28 కదలికల తర్వాత పునరావృతం ద్వారా డ్రా చేసుకోవడానికి అవకాశం ఇచ్చాడు.

# నేడు ఆస్ట్రేలియాతో నాలుగో టి20
## సిరీస్ కోసం అమీతుమీకి భారత్ సిద్ధం

**న్యూఢిల్లీ:** ఆస్ట్రేలియాతో ఐదు టీ20ల సిరీస్‌లో 1-1తో సమంగా నిలిచిన భారత జట్టు మరో కీలక పోరుకు సిద్ధమైంది. ఈ నెల 6వ తేదీ, గురువారం గోల్డ్ కోస్ట్ వేదికగా జరిగే నాలుగో టీ20లో ఆతిథ్య ఆసీస్‌తో అమీతుమీ తేల్చుకోనుంది. మూడో టీ20లో అద్వితీయమైన ప్రదర్శనతో 5 వికెట్ల తేడాతో గెలుపొందిందిన భారత్ అదే జోరును నాలుగో టీ20లోనూ కొనసాగించాలనుకుంటుంది. మరోవైపు ఈ మ్యాచ్ గెలిచి సిరీస్‌పై పట్టు సాధించాలని ఆసీస్ భావిస్తోంది. దాంతో ఈ మ్యాచ్‌పై సర్వత్రా ఆసక్తి నెలకొంది. ఇక ఈ సిరీస్‌లో కాన్‌బెర్రా వేదికగా జరిగిన తొలి టీ20 వర్షంతో రద్దయ్యింది. రెండు, మూడో టీ20కి వర్షం ముప్పు పొంచి ఉందని వార్తలు వచ్చినా మ్యాచ్‌లు సజావుగానే సాగాయి. ఈ క్రమంలోనే నాలుగో



టీ20కి ఆతిథ్యం ఇచ్చే గోల్డ్ కాస్ట్ వాతావరణం ఎలా ఉందనేది ఇప్పుడ చర్చనీయాంశమైంది. అయితే నాలుగో టీ20కి ఎలాంటి వర్షం ముప్పు లేదు. పూర్తిగా ఎండ కొట్టనుంది. మ్యాచ్ సమయంలో మాత్రం ఉష్ణోగ్రతలు 17 డిగ్రీల సెల్సియస్‌కు పడిపోనున్నాయి. ఇక గోల్డ్ కోస్ట్‌లో బిల్ పిప్పెన్ ఓవల్ పిచ్ సాధారణంగా బ్యాటింగ్‌కు అనుకూలంగా ఉంటుంది. బంతి మంచిగా బౌన్స్ అవుతుంది. ఈ పిచ్ ఆరంభంలో బౌలర్లకు కాస్త సహకరించినా, మిడిల్ ఓవర్లలో మాత్రం ప్రతికూలంగా మారుతుంది. ఇక్కడ టాస్ గెలిచిన జట్టు బౌలింగ్ ఎంచుకునే ఛాన్స్ ఉంది. కాగా భారత్ జట్టులో శుభ్‌మన్ గిల్, అభిషేక్ శర్మ, సూర్యకుమార్ యాదవ్, తిలక్ వర్మ, శివమ్ దూబే/నితీష్ కుమార్ రెడ్డి, వాషింగ్టన్ సుందర్, జితేష్ శర్మ (కీపర్), అర్ష్‌దీప్ సింగ్, జస్‌ప్రీత్ బుమ్రా ఉండే అవకాశాలు ఉన్నాయి.

### అంతర్జాతీయ వన్డేలో సచిన్, మిథాలీ
# రికార్డు రన్స్
## పురుషులు, మహిళా విభాగాల్లో భారత్ విక్టరీ



**న్యూఢిల్లీ:** అంతర్జాతీయ వన్డే క్రికెట్‌లో అత్యధిక పరుగులు చేసిన రికార్డు భారత్‌కే దక్కింది. పురుషుల, మహిళల విభాగాలలో ఒకే దేశానికి చెందిన ఆటగాళ్ల పేరు మీద ఉండటం భారత క్రికెట్‌కు గర్వకారణం. దిగ్గజ క్రికెటర్, క్రికెట్ గాడ్ సచిన్ టెండూల్కర్ పురుషుల వన్డే క్రికెట్‌లో అత్యధిక పరుగులు సాధించిన ఆటగాడిగా ఉన్నారు. అలాగే భారత మహిళా క్రికెట్‌కు విశేష సేవలందించిన మాజీ కెప్టెన్ మిథాలీ రాజ్ మహిళల వన్డే క్రికెట్‌లో అత్యధిక పరుగులు సాధించిన ప్రపంచ రికార్డును కలిగి ఉండి ఈ ఇరువురు అరుదైన ఘనతను సాధించారు. పురుషుల విభాగంలో సచిన్ 18,426 పరుగులు, మహిళల విభాగంలో మిదజాలీ రాజ్ 7,805 పరుగులు చేసి తమ తమ విభాగాలలో అగ్రస్థానంలో నిలిచారు. సచిన్ టెండూల్కర్ తన 24 ఏళ్ల అంతర్జాతీయ కెరీర్‌లో 463 వన్డే మ్యాచ్‌లు ఆడి, ఏకంగా 18,426 పరుగులు సాధించాడు. ఇది పురుషుల వన్డే క్రికెట్‌లో ప్రపంచ రికార్డు. ఆయన తన కెరీర్‌లో 49 సెంచరీలు, 96 హాఫ్ సెంచరీలు నమోదు చేశారు. అంతేకాక, వన్డే చరిత్రలో మొదటి డబుల్ సెంచరీ (200 నాటౌట్) చేసిన పురుష క్రికెటర్ కూడా సచినే. ఆయన 2010లో దక్షిణాఫ్రికాపై గ్వాలియర్‌లో ఈ ఘనత సాధించాడు. సచిన్ ఆట ప్రపంచవ్యాప్తంగా లక్షలాది మంది యువకులకు ప్రేరణగా నిలిచింది. అలాగే లేడీ టెండూల్కర్ గా ప్రసిద్ధి చెందిన మిథాలీ రాజ్, 1999 నుంచి 2022 వరకు సాగిన తన సుదీర్ఘ కెరీర్‌లో 211 ఇన్నింగ్స్‌లలో 50.68 సగటుతో మొత్తం 7,805 పరుగులు చేసింది. ఇది మహిళల వన్డే క్రికెట్‌లో ప్రపంచ రికార్డు. ఆమె తన ఖాతాలో 7 సెంచరీలు, 64 హాఫ్ సెంచరీలు నమోదు చేసుకుంది. మిథాలీ అంతర్జాతీయ క్రికెట్‌లోని అన్ని ఫార్మాట్లు (టెస్ట్, ఒడిఐ, టీ20) కలిపి భారత్ తరఫున 10,868 పరుగులు చేసి, ఆల్‌టైమ్ లీడింగ్ రన్ స్కోరర్‌గా నిలిచింది. ఆమె రిటైర్మెంట్ తర్వాత కూడా, ఆమె వారసత్వం కొత్త తరానికి స్ఫూర్తినిస్తోంది. ఇక భారత మహిళల జట్టు 2025లో తొలిసారిగా ప్రపంచకప్ గెలిచింది. ప్రస్తుతం భారత పురుషుల జట్టు వన్డే క్రికెట్‌లో నంబర్ 1 స్థానంలో ఉంది. ఈ రికార్డులు భారత క్రికెట్ చరిత్రలో ఒక ప్రత్యేక స్థానాన్ని కలిగి ఉన్నాయి.



### వరల్డ్ ఛాంపియన్స్:
# మానవ్ శుభారంభం

**న్యూఢిల్లీ:** ప్రపంచ టేబుల్ టెన్నిస్ ఛాంపియన్స్ అరంగేట్రంలో మానవ్ థక్కర్ విజయంతో శుభారంభం చేశాడు. జర్మనీలో టోమిస్లావ్ పుకార్‌తో జరిగిన ఐదు గేమ్‌ల కఠినమైన థ్రిల్లర్ తర్వాత భారత ఏస్ మానవ్ ఠక్కర్ 16 డబ్ల్యూటిటి ఛాంపియన్స్ ఫ్రాంక్‌ఫర్ట్ రౌండ్‌లోకి ప్రవేశించాడు. ఈ ఏడాది పొడవునా కొన్ని స్థిరమైన ఫలితాల తర్వాత, అతను



ఇప్పుడు ప్రపంచ టాప్ 40లోకి ప్రవేశించాడు, ఇది అతనికి అత్యంత కఠినమైన సింగిల్స్ టోర్నమెంట్ యొక్క ప్రధాన డ్రాలో తన స్థానాన్ని సంపాదించుకోవడానికి సహాయపడింది. తన తొలి ఛాంపియన్స్ మ్యాచ్‌లో, మానవ్ కఠినమైన ఆరంభాన్ని ఎదుర్కొన్నాడు. కానీ వ్యూహాత్మకంగా వ్యవహరించి అనుభవజ్ఞుడైన క్రొయేషియాను 12-10, 3-11, 11-6, 5-11, 11-7 తేడాతో ఓడించాడు.

# తొలి టి20లో వెస్టిండీస్ విజయం
## 7 రన్స్ తేడాతో న్యూజిలాండ్ ఓటమి

**న్యూఢిల్లీ:** న్యూజిలాండ్ పర్యటనను వెస్టిండీస్ ఘనంగా ఆరంభించింది. ఉత్కంఠభరితంగా న్యూజిలాండ్‌తో జరిగిన తొలి టీ20లో వెస్టిండీస్ 7 పరుగుల తేడాతో విజయం సాధించింది. తద్వారా ఐదు టీ20ల సిరీస్‌లో 1-0తో విండీస్ ఆధిక్యంలో ఉంది. ఆక్లాండ్‌లో బుధవారం ప్రారంభమైన మ్యాచ్‌లో టాస్ గెలిచిన న్యూజిలాండ్ బౌలింగ్ ఎంచుకుని విండీస్‌ను బ్యాటింగ్‌కు అహ్వానించింది. దీంతో బ్యాటింగ్‌కు దిగిన వెస్టిండీస్ నిర్ణీత 20 ఓవర్లలో 6 వికెట్లు నష్టానికి 164 పరుగులు చేసింది. ఓపెనర్లు బ్రాండన్ కింగ్ (3), అలిక్ అథనాజ్ (16) విఫలమైనా, వన్‌డౌన్ బ్యాటర్ షాయి హోప్ కెప్టెన్ ఇన్నింగ్స్‌తో మెరిశాడు. మొత్తంగా 39 బంతులు ఎదుర్కొన్న హోప్ 4 ఫోర్లు, 3 సిక్సుల సాయంతో



53 పరుగులు సాధించాడు. మిగిలిన వారిలో రోస్టన్ చేజ్ (28), రోవ్‌మన్ పావెల్ (23 బంతుల్లో 33) మాత్రమే చెప్పుకోదగ్గ స్కోరు చేశారు. కివీస్ బౌలర్లలో జేకబ్ డఫీ, జకారీ ఫౌల్క్స్ రెండేసి వికెట్లు తీయగా, కైలీ జెమీషన్, జేమ్స్ నీషమ్ చెరో వికెట్ పడగొట్టారు. ఇక 165 పరుగుల లక్ష్యాన్ని ఛేదించే క్రమంలో న్యూజిలాండ్ ఆదినుంచే తడబడింది. ఓపెనర్లు టిమ్ రాబిన్సన్ (27), డెవాన్ కాన్వే (13) ప్రభావం చూపలేకపోయారు. వన్‌డౌన్ బ్యాటర్ రచిన్ రవీంద్ర(21) నిరాశపరచగా, మార్క్ చాప్‌మన్ (7), డారిల్ మిచెల్ (13), మైకెల్ బ్రాస్‌వెల్ (1), జేమ్స్ నిషమ్ (11) విఫలమయ్యారు. ఈ దశలో కెప్టెన్ మిచెల్ సాంట్నర్ ఆకాశమే హద్దుగా చెలరేగుతూ గెలుపు ఆశలు చిగురించేలా చేశాడు. కేవలం 28 బంతుల్లో 8 ఫోర్లు, 2 సిక్స్‌లు బాది 55 పరుగులు సాధించి సాంట్నర్ ఆఖరి వరకూ అజేయంగా నిలిచాడు. అయితే మిగిలిన వారి నుండి సహకారం అందకపోవడంతో నిర్ణీత 20 ఓవర్లలో 9 వికెట్లు నష్టపోయిన కివీస్ 157 పరుగుల వద్దే నిలిచిపోయింది. ఫలితంగా వెస్టిండీస్ చేతిలో ఓటమి పాలైంది.

# రికార్డు సేల్స్ నమోదుచేసిన 'మారుతి'

వాణిజ్యం



**న్యూఢిల్లీ, నవంబరు 5:** జీఎస్టీ రేట్లు తగ్గించిన క్రమంలో చిన్న కార్ల తయారీ సంస్థ మారుతీ సుజుకీ అప్పుడు రికార్డు సాధించింది. నవరాత్రి సీజన్‌లో నెల వ్యవధిలోనే ఏకంగా 4 లక్షలకుపైగా బుకింగ్స్‌తో నం.1గా నిలిచింది. ఇంకా 2.50 లక్షలకుపైగా కార్లను విక్రయించింది. ఇప్పుడు మారుతీ సుజుకీ మరో చరిత్ర సృష్టించింది. 42 ఏళ్ల కిందట ప్రారంభమైన మారుతీ సుజుకీ దేశీయంగా రికార్డు స్థాయిలో 3 కోట్లకుపైగా కార్లను విక్రయించింది. ఈ మైల్‌స్టోన్ చేరిన తొలి భారతీయ కార్ల తయారీ కంపెనీగా నిలిచింది. ఇప్పటివరకు మరే కంపెనీ ఇంతటి స్థాయిలో కార్లను విక్రయించలేదు. ఇక్కడ టయోటా ఇండియా వంటి వాటికి విక్రయించినవి కూడా ఉన్నాయి. మారుతీ సుజుకీ ఇటీవలి కాలంలో తన కార్ సేల్స్‌ను భారీగా పెంచుకుంటూ వెళ్లింది. మొదటి కోటి కార్లను విక్రయించేందుకు 28 సంవత్సరాల 2 నెలల సమయం పట్టగా తర్వాతి కోటి కార్ల విక్రయాల్ని చేరుకునేందుకు కేవలం 7 సంవత్సరాల 5 నెలలు పట్టింది. తర్వాత మరో కోటి మార్కును చేరుకునేందుకు 6 సంవత్సరాల 4 నెలల సమయం పట్టింది. ఇది సుజుకీ పట్ల విశ్వసనీయతను, మార్కెట్ లీడర్‌షిప్‌ను చాటిచెబుతోంది. అన్నింటికంటే ఎక్కువగా ఆల్టో మోడల్ కార్లు విక్రయించింది. దీని వాటానే ఏకంగా 47 లక్షలకుపైగా ఉంది. మారుతీ సుజుకీ వ్యాగన్ ఆర్ మోడల్ కార్లు 34 లక్షలకుపైగా అమ్ముడుబోయాయి. మారుతీ సుజుకీ స్విఫ్ట్ కార్లను 32 లక్షలకుపైగా యూనిట్లు విక్రయించింది. ఇంకా కంపెనీ బెస్ట్ కాంపాక్ట్ ఎస్‌యువిలుగా ఉన్న బ్రెజా, ఫ్రాంక్స్ వంటి మోడల్స్ కూడా టాప్ 10 బెస్ట్ సెల్లింగ్ మోడళ్లుగా ఉన్నాయి. ఈ కంపెనీ విషయానికి వస్తే 1983, డిసెంబరు 14న ప్రారంభమైంది. మారుతీ 800 తొలి మోడల్. దశాబ్దాలుగా వినియోగదారుల ప్రాధాన్యత, అభిరుచికి అనుగుణంగా మారుతూ.. కంపెనీ 19 మోడళ్లలో 170కిపైగా వేరియంట్లను అందిస్తోంది.

# భారత్ బ్యాంకులపై విజయ్‌మాల్యా కౌంటర్ కేసు!

**బెంగళూరు, నవంబరు 5:** బ్యాంకు రుణాల ఎగవేత ఆరోపణలు ఎదుర్కొంటున్న విజయ్ మాల్యా భారతీయ బ్యాంకులపై సరికొత్త న్యాయ పోరాటానికి తెరలేపారు. తన నుంచి, కింగ్‌ఫిషర్ ఎయిర్‌లైన్స్‌ను నియంత్రించిన యూబీ హోల్డింగ్స్ కంపెనీ నుంచి ఇప్పటికే రికవరీ చేయబడిన రుణాలపై కూడా బ్యాంకులు వడ్డీని వసూలు చేయడం కొనసాగించకూడదని విజయ్ మాల్యా మంగళవారం కర్ణాటక హైకోర్టును అభ్యర్థించారు. అంతేకాకుండా అప్పులు, తిరిగి వసూలు చేసిన మొత్తాలకు సంబంధించిన పూర్తి అకౌంట్ స్టేట్‌మెంట్‌లను బ్యాంకులు ఇవ్వాలని కోరుతూ ఆయన హైకోర్టును ఆశ్రయించారు. విజయ్ మాల్యా తరఫున సీనియర్ లాయర్ సజన్ పూవయ్య కర్ణాటక హైకోర్టులు వాదనలు వినిపించారు. కోర్టుల్లో కేసులు పెండింగ్‌లో ఉన్నాయనే సాకుతో ఇప్పటికే కోర్టుల ఆదేశాల ద్వారా వసూలు చేసిన మొత్తాన్ని ఫైనల్ రికవరీగా పరిగణించలేమని బ్యాంకులు చేస్తున్న వాదనను మాల్యా తీవ్రంగా ఖండించారు. బ్యాంకులు ఇప్పటికే తమకు రావాల్సిన మొత్తాన్ని వసూలు చేశాయని ఆ మొత్తాన్ని వారు ఉపయోగిస్తున్నారు కాబట్టి వసూలు చేసిన మొత్తంపై వడ్డీని విధించకూడదని వాదించారు. రుణ రికవరీ ట్రిబ్యునల్ జారీ చేసిన రికవరీ సర్టిఫికెట్ ప్రకారం రూ.6,203 కోట్ల అప్పులకు 11.5 శాతం వడ్డీతో తిరిగి వసూలు చేయాలి. రికవరీ చేసిన మొత్తాలపై విజయ్ మాల్యా తరఫు లాయర్ పలు గణాంకాలను హైకోర్టు ముందు ఉంచారు. 2021 జూలై 16వ తేదీన ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఇడి) విడుదల చేసిన పత్రికా ప్రకటన ప్రకారం.. విజయ్ మాల్యా నుంచి రికవరీ చేసిన మొత్తం సొమ్ము రూ.7,181 కోట్లు అని తెలిపారు. ఇక రికవరీ ప్రక్రియల ప్రకారం అప్పటికే రూ.10,040 కోట్లు వసూలు చేసినట్లు పేర్కొన్నారు. ప్రభుత్వ రంగ బ్యాంకులు విజయ్ మాల్యా నుంచి దాదాపు రూ.14 వేల కోట్లను తిరిగి వసూలు చేసినట్లు స్వయంగా కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ పార్లమెంట్‌కు తెలియజేశారు. తమకు రావాల్సిన దానికంటే బ్యాంకులు ఎక్కువ మొత్తాన్ని వసూలు చేశాయని కనీసం పూర్తి అసలు, వడ్డీని పొందే దశలో ఉన్నాయని విజయ్ మాల్యా వాదిస్తున్నారు. గత నెలలో విజయ్ మాల్యా తమకు రావాల్సిన మొత్తాలపై పారదర్శకంగా, కచ్చితమైన అకౌంట్ స్టేట్‌మెంట్‌ను సమర్పించని పబ్లిక్ సెక్టార్ బ్యాంకులు సిగ్గ పడాలి అని విజయ్ మాల్యా తీవ్ర విమర్శలు గుప్పించారు. భారత ప్రభుత్వ రంగ బ్యాంకులు తమరికవరీలవిషయంలో స్పష్టతనిచ్చేవరకు తాను ఇంగ్లాండ్‌లో చట్టపరమైన చర్యలను కొనసాగించబోనని తన కౌంటర్ క్లెయిమ్‌లను భారత దేశంలో మాత్రమే విచారించవచ్చని విజయ్ మాల్యా స్పష్టం చేశారు.

# ఫోర్బ్స్ బెస్ట్ కంపెనీల్లో 'అమర్‌రాజా'




**న్యూఢిల్లీ, నవంబరు 5:** బ్యాటరీల తయారీ రంగంలోని కంపెనీల్లో ఒకటైన అమర రాజా గ్రూప్ మరో ఘనత సాధించింది. ఫోర్బ్స్ రూపొందించిన వరల్డ్ బెస్ట్ ఎంప్లాయర్స్ 2025 జాబితాలో చోటు దక్కించికుంది. ప్రపంచ వ్యాప్తంగా 31 కంపెనీలతో ఫోర్బ్స్ సంస్థ బెస్ట్ ఎంప్లాయర్స్ జాబితాను రూపొందించింది. అందులో బ్యాటరీ కంపెనీ అమర రాజా 28వ స్థానంలో నిలిచింది. వంద పాయింట్లకు గానూ అమర రాజా 63.65 పాయింట్లు దక్కించుకుని టాప్ 30లో నిలిచింది. ఈ ఏడాది ఫోర్బ్స్ బెస్ట్ ఎంప్లాయర్స్ జాబితాలో భారత దేశంనుంచి మొత్తం 6 కంపెనీలు చోటు దక్కించుకున్నాయి. ఈ ఆరు కంపెనీల్లో ఎపి కంపెనీ అమర రాజా గ్రూప్ ఒకటని కంపెనీ తెలిపింది. ఫోర్బ్స్ జాబితాలో చోటు దక్కించుకోవడంపై అమర రాజా గ్రూప్ ఛైర్మన్ జయదేవ్ గల్లా సంతోషం వ్యక్తం చేశారు. మానవ వనరుల అభివృద్ధికి తమ కంపెనీ ఎంతో ప్రాధాన్యం ఇస్తుందని, ఈ కారణంగానే ఈ గుర్తింపు లభించినట్లు ఆయన వివరించారు. అమర రాజా గ్రూప్ సంస్థల్లో ప్రస్తుతం 21 వేల మంది ఉద్యోగులు పని చేస్తున్నారు.

21 వేల మందికి పైగా ఉద్యోగుల కుటుంబంలో భాగమైనందుకు నేను గర్విస్తున్నాను. ఈ గుర్తింపు మా ప్రత్యేకమైన ఉద్యోగి విధానాలకు, నిరంతరం మెరుగుపరచు కునే లక్ష్యానికి లభించిన అద్భుతమైన ధ్రువీకరణ. మేము కలిసి సాధించే ప్రతి మైలురాయి, మా వారసత్వాన్ని మరింత బలోపేతం చేసి మేరుగైనా ఫలితాల కోసం ప్రేరేపిస్తుందని ఆయన అన్నారు. ఉద్యోగుల సాధికారత కల్పించే సంస్కృతిని నిర్మించడంలో అమర రాజా కృషి చేస్తోంది. ఈ జాబితాను రూపొందేందుకు ఫోర్బ్స్ డేటా, ఇంటెలిజెన్స్ ప్లాట్ ఫామ్ స్టాటిస్టా సహకారం తీసుకుంది.






Printed and Published by GireeshSanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at D.No. 396, Lower Tankbund, Hyderabad - 500 080 Phone : 2764 4999. Fax: 040-27642512, RNI No. 62142/95, Editor : *DamerlaSai Baba, *responsible for selection of news under the PRB Act. Regd.: No.HSD/337/21-22 Air Surcharge: Delhi : 40 Ps. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.